www.prajanaava.in

Telugu Daily

ప్రజానావ

ప్రతి అక్షరం జనం కోసం..

పేజీలు : 08 | వెల రూ.5.00

Published from: **Hyderabad, Rangareddy, Karimnagar** Circulated to: **Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad**


హైదరాబాద్ | సంపుటి 01 | సంచిక: 81 | ఆదివారం | 1 నవంబర్, 2026

పది నెలల కనిష్ఠానికి పసిడి

- ఢిల్లీలో 10గ్రాములపై రూ.3,200 పతనం
- కిలో వెండిపై రూ.4,200 కోత
- అంతర్జాతీయంగానూ భారీగా పడిపోయిన ధరలు

2





సంధ్య వెలుగుల సోయగం.. తాజ్‌మహల్ వైభవం

ఉత్తరప్రదేశ్‌లోని ఆగ్రాలో ప్రపంచ ప్రఖ్యాత తాజ్‌మహల్ అస్తమిస్తున్న సూర్యుడి కాంతిలో అరుదైన అందంతో కనువిందు చేసింది. ఆకాశం ఎరుపు వర్ణాన్ని సంతరించుకుండగా.. తాజ్‌మహల్ నల్లని ఛాయాచిత్రంలా దర్శనమిచ్చింది. సూర్యాస్తమయ వేళ ఆకాశమంతా ఎర్రటి రంగులోకి మారగా.. దాని మధ్యలో తాజ్‌మహల్ రూపం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రకృతి రంగులద్దిన ఈ దృశ్యం చూపరులను కట్టిపడేసింది. సాయంత్రపు వెలుగులు, ఎర్రటి ఆకాశం, తాజ్‌మహల్ అందాలు కలగలిసిన ఈ అద్భుత దృశ్యాన్ని పలువురు తమ కెమెరాల్లో బంధించారు.

సీఈసీపై దేశద్రోహం కేసు పెట్టాలి

ఇండియా కూటమి తీర్మానం.. ఓటర్ల జాబితాలో అక్రమాలు, సర్ ప్రక్రియపై తీవ్ర ఆరోపణలు

- ఎన్నికల ప్రక్రియపై ముందస్తు ప్రణాళికతో చేసిన దాడిగా అభివర్ణన
- 'ప్రజా అభిశంసన'లో ఆరోపణల పత్రం చదివిన ఖర్గే

ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుంచి తొలగించడంతో పాటు, ఆయనపై దేశద్రోహం ఆరోపణలతో న్యాయస్థానంలో విచారణ జరపాలని ప్రతిపక్ష ఇండియా కూటమి డిమాండ్ చేసింది. జాతీయ, రాష్ట్ర స్థాయి ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడి ఫలితాలను ప్రభావితం చేసేందుకు బీజేపీ పన్నిన కుట్రలో జ్ఞానేశ్ కుమార్ కూడా భాగస్వామిగా ఉన్నారని ఆరోపించింది.
ఈ మేరకు శనివారం ఢిల్లీలో నిర్వహించిన 'ప్రజా అభిశంసన' కార్యక్రమంలో ఇండియా కూటమి తీర్మానాన్ని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చదివి వినిపించారు. ఓటర్ల జాబితాలో అక్రమాలు, ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై ప్రతిపక్షాలు కొంతకాలంగా ఎన్నికల సంఘాన్ని ప్రశ్నిస్తున్నాయి.
ఈ నేపథ్యంలో సీఈసీపై జవాబుదారీతనం కోరుతూ ఇండియా కూటమి ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. తీర్మానంలో జ్ఞానేశ్ కుమార్‌పై పలు ఆరోపణలు చేసింది. ఓటర్ల జాబితాలను తమకు అనుకూలంగా మార్చుకునేందుకు అధికార బీజేపీకి అవకాశం కల్పించారని, ఇష్టానుసారంగా ఓటర్ల పేర్లను తొలగించేందుకు, కొత్త పేర్లను చేర్చేందుకు అనుమతించారని ఆరోపించింది. ఇది దేశ ప్రజాస్వామ్యానికి పునాదిగా ఉన్న ఎన్నికల ప్రక్రియపై ముందస్తు ప్రణాళికతో చేసిన దాడి అని అభివర్ణించింది.

2



2

నో క్రాప్ హాలిడే

- ప్రతిపక్షాల తప్పుడు ప్రచారాన్ని నమ్మొద్దు
- ఎల్‌నినో నేపథ్యంలో ఆరుతడి పంటల సాగుకు ప్రోత్సాహం
- ఐదు నెలల్లో 31.21 లక్షల ఆయిల్‌పామ్ మొక్కల పంపిణీ
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

పెట్రోల్ ఎగుమతి సుంకం రద్దు

2

- డీజిల్, ఏటీఎఫ్ సుంకాలు పెంపు
- కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ కీలక నిర్ణయం

ఐక్యతే.. రక్షణ కవచం

2




- ఇంధన సంక్షోభం ప్రభావం ప్రజలపై పడకుండా చూశాం
- పటేల్ లేకపోతే నేటి భారత్‌ను ఊహించలేం
- హిమాలయాల నుంచి హిందూ మహాసముద్రం వరకు దేశాన్ని రక్షించారు
- ప్రధాని నరేంద్ర మోడీ

రేపు హైదరాబాద్‌కు అమిత్‌షా

- బీజేపీ మహా పాదయాత్రలో పాల్గొననున్న కేంద్ర హోంమంత్రి
- బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం నుంచి మొజంజాహీ మార్కెట్ వరకు యాత్ర

2



ఆంధ్రప్రదేశ్ తీరంవైపు మరో తుపాను

- నవంబర్ 3న తీరం దాటే అవకాశం
- సముద్రంలోకి వేటకు వెళ్లొద్దని ఐఎండీ హెచ్చరిక

భువనేశ్వర్: బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం వాయుగుండంగా బలపడి, తదుపరి తుఫాన్‌గా మారుతుందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) అధికారులు శనివారం వెల్లడించారు. ఈ తుఫాను నవంబర్ 3వ తేదీ ఉదయం ఆంధ్రప్రదేశ్ తీరాన్ని తాకే అవకాశం ఉందని అంచనా వేశారు. కొద్ది రోజుల కిందట అర్నాబ్ తుపాను ఆంధ్రప్రదేశ్, ఒడిశా తీరాలను గంటకు 150 కి.మీ వేగంతో బలంగా తాకిన విషయం తెలిసిందే. అయితే రాబోయే ఈ కొత్త తుపాను గాలి వేగం గంటకు 80 నుంచి 90 కి.మీ వేగంతో, గరిష్టంగా 100 కి.మీ వేగంతో వీచే అవకాశం ఉందని ఐఎండీ డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ మహాపాత్ర తెలిపారు. అండమాన్ నికోబార్ దీవులు , ఆగ్నేయ బంగాళాఖాతంలో కేంద్రీకృత మైన ఈ వాయుగుండం పశ్చిమ–వాయువ్య దిశగా కదులుతూ మరింత బలపడ నుంది. నవంబర్ 2 సాయంత్రానికి పశ్చిమ–మధ్య బంగాళాఖాతానికి చేరుకుని ఆంధ్రప్రదేశ్ తీరానికి సమీపించనున్నట్లు బులెటిన్‌లో పేర్కొన్నారు. ఈ తుపాను ప్రభావంతో ఒడిశా, ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంతాలలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని, మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లరాదని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది.

నాసిక్– త్రయంబకేశ్వర్ సింహస్థ కుంభమేళా ప్రారంభం

- పవిత్ర ధ్వజారోహణ చేసిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

నాసిక్: మహారాష్ట్రలోని నాసిక్–త్రయంబకేశ్వర్ వేదికగా అత్యంత వైభవంగా జరిగే ప్రసిద్ధ సింహస్థ కుంభమేళా శనివారం అధికారికంగా ప్రారంభమైంది. గోదావరి నది తీరంలోని రామ్‌కుండ్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రత్యేక పూజలు నిర్వహించి సాంప్రదాయబద్ధంగా ధ్వజారోహణ (జెండా ఆవిష్కరణ) మహోత్సవాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మహారాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ఉప ముఖ్యమంత్రులు ఏక్‌నాథ్ శిండే, సునేత్రా పవార్ తదితరులు పాల్గొన్నారు. ఇదే సమయంలో త్రయంబకేశ్వర్ లో ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ శృంగేరి పీఠాధిపతి విధుశేఖర్ భారతి సమక్షంలో ధ్వజారోహణ నిర్వహించారు. రామ్‌కుండ్‌లో పూజా కార్యక్రమాల అనంతరం రాష్ట్రపతి త్రయంబకేశ్వర్ ను సందర్శించి కుశావర్త తీర్థంలో ధ్వజ పూజ, గౌతమీ గంగా గోదావరి పూజలు ఆచరించారు. ద్వాదశ జ్యోతిర్లింగాలలో ఒకటైన శ్రీ త్రయంబకేశ్వర్ ఆలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు సమర్పించారు. కాగా, కుంభమేళా ప్రారంభాన్ని పురస్కరించుకుని 11 సంవత్సరాల తర్వాత రామ్‌కుండ్‌లోని పురాతన శ్రీ గంగా గోదావరి ఆలయం భక్తుల కోసం తెరుచుకుంది. ఈ వేడుకల్లో భాగంగా 6,657 మంది గిరిజనులు ప్రదర్శించిన గోదావరి హారతి ప్రపంచ రికార్డు లక్ష్యంగా సాగింది. ఈ మహా కుంభమేళా 21 నెలల పాటు కొనసాగి 2028 జూలై 24న ముగియనున్నది.

పది నెలల కనిష్ఠానికి పసిడి

న్యూఢిల్లీ: బంగారం, వెండి ధరలు మరింత దిగొచ్చాయి. ఢిల్లీలో శనివారం 99.9 శాతం స్వచ్ఛత కలిగిన 10 గ్రాముల బంగారం ధర రూ.3,200 తగ్గి రూ.1,42,000కు చేరింది. ఇది పది నెలల కనిష్ఠం. చివరిసారిగా 2025 డిసెంబరు 26న ఈ స్థాయి ధర నమోదైంది. వెండి కిలోకు రూ.4,200 తగ్గి రూ.1,86,000కు చేరింది. ఈ ధరల్లో పన్నులు కలిపి ఉన్నాయి. అంతర్జాతీయ మార్కెట్లో అమ్మకాల ఒత్తిడి దేశీయ ధరలపై ప్రభావం చూపిందని నిపుణులు తెలిపారు. ఇంధన ధరల పెరుగుదలతో ద్రవ్యోల్బణ భయాలు, అమెరికా ఫెడరల్ రిజర్వ్ కఠిన వైఖరి కారణంగా వడ్డీ రేట్ల కోతపై అంచనాలు తగ్గాయి. దీంతో మదుపర్లు విలువైన లోహాల నుంచి పెట్టుబడులను వెనక్కి తీసుకుంటున్నారని 360 వన్ అసెట్ ప్రతినిధి రాహుల్ ఖేతావత్ వివరించారు. విదేశీ మార్కెట్‌లో ఔన్సు బంగారం ధర 145.84 డాలర్లు (దాదాపు 4 శాతం) తగ్గి 3,875.55 డాలర్లకు, వెండి 3.04 డాలర్లు (6 శాతం) క్షీణించి 49.12 డాలర్లకు చేరింది. డిసెంబరులో అమెరికా ఫెడ్ వడ్డీ రేట్లు పెంచవచ్చన్న అంచనాలు కూడా ధరల పతనానికి కారణమని మోతీలాల్ ఓస్వాల్ విశ్లేషకుడు మానవ్ మోదీ పేర్కొన్నారు.

వెండిపై పారిశ్రామిక ప్రభావం

కృత్రిమ మేధ ఆధారిత కంపెనీల షేర్లలో అమ్మకాలతో నగదు సమీకరించుకునేందుకు మదుపర్లు బంగారం, వెండిని విక్రయిస్తున్నారని మోదీ తెలిపారు. పారిశ్రామిక అవసరాలపై ఆధారపడే వెండిపై ఈ ప్రభావం ఎక్కువగా ఉందన్నారు. చైనాలోనూ నగదు కోసం బంగారం విక్రయిస్తున్నారన్న వార్తలకు ఇంకా నిర్ధారణ లేదని చెప్పారు. అమెరికా మధ్యంతర ఎన్నికల నేపథ్యంలో ఊహాజనిత అమ్మకాలు పెరిగాయని, ఫలితాలు బులియన్ ధరల తదుపరి గమనాన్ని ప్రభావితం చేయవచ్చని విశ్లేషించారు.

రేపు హైదరాబాద్‌కు అమిత్‌షా

ప్రజానావ, హైదరాబాద్: కేంద్ర హోంమంత్రి అమిత్‌షా సోమవారం హైదరాబాద్‌లో పర్యటించనున్నారు. తెలంగాణ బీజేపీ నిర్వహించే మహా పాదయాత్రలో పాల్గొని మొజంజాహీ మార్కెట్ వద్ద ప్రసంగించనున్నారు. ఈ కార్యక్రమ ఏర్పాట్లను కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి శనివారం పార్టీ రాష్ట్ర నాయకులతో కలిసి పరిశీలించారు. యాత్ర మార్గం, జనసమీకరణ, ఇతర ఏర్పాట్లపై సమీక్షించారు. 'లోక్‌తంత్ర బచావో – అరాచకత హటావో' నినాదంతో నిర్వహిస్తున్న ఈ యాత్ర ద్వారా ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)పై కాంగ్రెస్ చేస్తున్న ఆరోపణలను తిప్పికొట్టాలని బీజేపీ భావిస్తోంది. ఈ ప్రక్రియపై ప్రజలకు తమ వాదనను వివరించేందుకు పాదయాత్రను వేదికగా చేసుకోనుంది. తొలుత ట్యాంక్‌బండ్‌పై యాత్ర నిర్వహించాలని భావించినా, మార్గాన్ని మార్చారు. తాజా షెడ్యూల్ ప్రకారం నవంబరు 2న మధ్యాహ్నం 3 గంటలకు బషీర్‌బాగ్‌లోని నిజాం కాలేజీ సమీపంలో ఉన్న బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద యాత్ర ప్రారంభమై మొజంజాహీ మార్కెట్ చౌరస్తా వరకు సాగుతుంది. అక్కడ అమిత్‌షా ప్రసంగిస్తారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్‌రావు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, పార్టీ ముఖ్య నాయకులు పాల్గొననున్నారు.

ఐక్యతే రక్షణ కవచం



ఏక్తానగర్: అంతర్జాతీయంగా తీవ్ర ఇంధన సంక్షోభం నెలకొన్నప్పటికీ, దేశ పౌరులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సమర్థవంతంగా రక్షించుకోగలిగామని ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. గుజరాత్‌లోని ఏక్తా నగర్‌లో సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ జయంతి వేడుకల్లో ఆయన మాట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలు ఇంధన కొరతతో అల్లాడిపోతున్నాయని, భారతదేశంలో జనాభా ఎక్కువ కాబట్టి ఇక్కడ తీవ్రమైన సంక్షోభం వస్తుందని కొందరు అంచనా వేశారని గుర్తుచేశారు. దేశ వ్యతిరేక శక్తులు సైతం క్రియాశీలకం అయినప్పటికీ, భారత్ తన పౌరులను ఈ సంక్షోభం బారిన పడకుండా కాపాడుకోగలిగిందని ఇది మన దేశ సామర్థ్యానికి నిదర్శనమని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా యుద్ధాలు జరుగుతున్నాయని, పెద్ద ఆర్థిక వ్యవస్థలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని పేర్కొంటూ.. ఈ కష్టకాలంలో భారతీయుల ఐక్యతే మన దేశానికి అతిపెద్ద రక్షణ కవచమని తెలిపారు. సర్దార్ పటేల్ 151వ జయంతి సందర్భంగా ఇచ్చిన మాటకు కట్టుబడి దేశం నుంచి నక్సలిజాన్ని విజయవంతంగా అంతం చేశామని ప్రకటించారు. గతంలో దారిద్ర్య నిర్మూలన పేరుతో ఓట్లు దండుకున్న వారు ఎదిగిపోయారే తప్ప ప్రజల బతుకులు మారలేదని, మోదీ హయాంలో దేశ ప్రజల ఆత్మవిశ్వాసం రెట్టింపు అయిందని ప్రధాని ఉద్ఘాటించారు. స్వాతంత్ర్యానంతరం తీవ్ర అస్థిర పరిస్థితుల మధ్య హిమాలయాల నుంచి హిందూ మహాసముద్రం వరకు దేశాన్ని భద్రంగా ఉంచడంలో సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ దార్శనికత ఎంతో కీలకమని ప్రధాని కొనియాడారు. ఏక్తా నగర్‌లో రాష్ట్రీయ ఏక్తా దివస్ పరేడ్‌లో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. ఆధునిక భారతదేశాన్ని తీర్చిదిద్దడంలో సర్దార్ పటేల్ పాత్ర చిరస్మరణీయమని, ఆయన లేని భారతదేశాన్ని ఊహించడం కూడా కష్టమని పేర్కొన్నారు. దేశ భౌగోళిక ఐక్యతను సాధించడమే కాకుండా, ప్రజలందరినీ భావోద్వేగ బంధంతో ఒకే తాటిపైకి తెచ్చిన ఘనత పటేల్‌కే దక్కుతుందన్నారు. భారతదేశపు వైవిధ్యాన్ని బలహీనతగా కాకుండా, ఐక్యతకు అసలు సిసలు పునాదిగా పటేల్ భావించారని గుర్తుచేశారు. స్వాతంత్ర్యం దేశానికి భవిష్యత్తును నిర్ణయించే స్వేచ్ఛను ఇస్తే, గణతంత్ర విలువలు ఆ స్వేచ్ఛకు దిశానిర్దేశం చేస్తాయని, మన రాజ్యాంగం మనల్ని బాధ్యతాయుతంగా మలుస్తుందని మోదీ వివరించారు. దేశ సార్వభౌమత్వాన్ని, శాంతిభద్రతలను కాపాడుకుంటూ జాతి సమైక్యతను చాటేందుకే ఏక్తా దివస్‌ను అత్యంత ఘనంగా నిర్వహిస్తున్నట్లు స్పష్టం చేశారు.

పటేల్‌కు ఘన నివాళి

సర్థక నామధేయులైన సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని గుజరాత్‌లోని ఏక్తా నగర్‌లో రాష్ట్రీయ ఏక్తా దివస్ వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ పరేడ్‌ను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్వయంగా వీక్షించి గౌరవ వందనం స్వీకరించారు. ఈ వేడుకల్లో నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా (ఎన్ఎస్‌డీ) ఆధ్వర్యంలో ప్రదర్శించిన నక్సల్ ముక్త్ భారత్ ప్రత్యేక నాటక ప్రదర్శన ప్రధాన ఆకర్షణగా నిలిచింది. వామపక్ష తీవ్రవాద ప్రభావిత ప్రాంతాలైన 126 జిల్లాల నుంచి వచ్చిన దాదాపు 2,000 మంది కళాకారులు ఈ ప్రదర్శనలో పాల్గొని, ఆ ప్రాంత ప్రజలు ఎదుర్కొన్న కష్టాలు , శాంతి, భద్రతల సాధన కోసం వారు సాగించిన ప్రయాణాన్ని కళ్లకు కట్టేలా ప్రదర్శించారు. అంతకుముందు ప్రధాని మోదీ స్టాట్యూ ఆఫ్ యూనిటీ వద్ద పటేల్‌కు నివాళులర్పించారు. ఏక్తా నగర్‌ను ప్రపంచస్థాయి పర్యాటక కేంద్రంగా మార్చేందుకు రూ. 400 కోట్లకు పైగా వ్యయంతో కూడిన మురుగునీటి శుద్ధి కర్మాగారాలు, నర్మదా ఘాట్ అభివృద్ధి, ఐఆర్‌సీటీసీ హోటల్, రెయిన్ ఫారెస్ట్, ఎకో ట్రైల్ ప్రాజెక్టులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు.

బ్యాలెట్ ఎన్నికలకు సిద్ధం

- ప్రభుత్వాన్ని రద్దు చేసి కాంగ్రెస్ ఎన్నికలకు రావాలి
- కేంద్ర మంత్రి బండి సంజయ్

ప్రజానావ, హైదరాబాద్: ఈవీఎంలపై అనుమానాలు వ్యక్తం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని రద్దు చేసి బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలకు రావాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ సవాల్ విసిరారు. తెలంగాణలో బ్యాలెట్ ఎన్నికలకు బీజేపీ సిద్ధంగా ఉందని ప్రకటించారు. ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)పై కాంగ్రెస్ చేస్తున్న ఆందోళనలను ఆయన తప్పుబట్టారు. శనివారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన ఆయన.. మరణించినవారి, డూప్లికేట్ ఓట్లతో పాటు అక్రమ వలసదారుల ఓట్లను తొలగిస్తుంటే కాంగ్రెస్ ఎందుకు అభ్యంతరం చెబుతోందని ప్రశ్నించారు. దేశవ్యాప్తంగా 13 కోట్ల ఓట్లు తొలగించారన్న కాంగ్రెస్ ఆరోపణల్లో వాస్తవం లేదని, ప్రస్తుతం ముసాయిదా జాబితా మాత్రమే సిద్ధమైందని చెప్పారు. తెలంగాణలో 2004 నుంచి ఇప్పటివరకు 18.07 లక్షల మంది మరణించారని, 6.70 లక్షల డూప్లికేట్ ఓట్లు ఉన్నాయని పేర్కొన్నారు. అర్హులైన ఓటర్లకు న్యాయం చేయడమే ఎస్ఐఆర్ లక్ష్యమన్నారు.

ఎస్ఐఆర్ ఆగదు

కాంగ్రెస్ పాలనలోనే గతంలో పదిసార్లు ఎస్ఐఆర్ జరిగిందని, అప్పట్లో వ్యతిరేకించని ఆ పార్టీ ఇప్పుడు ఎందుకు ఆందోళన చేస్తోందని బండి సంజయ్ ప్రశ్నించారు. ఎన్నికల్లో ఓటమి ఎదురైనప్పుడల్లా ఈవీఎంలు, ఎన్నికల సంఘంపై ఆరోపణలు చేయడం కాంగ్రెస్‌కు అలవాటుగా మారిందని విమర్శించారు. ఎస్ఐఆర్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ ఆపబోమని, భవిష్యత్తులో ఎన్ఆర్‌సీ, మహిళా రిజర్వేషన్ బిల్లు, నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియలనూ ముందుకు తీసుకెళ్తామని తెలిపారు. రాష్ట్రంలో కరువు, తాగునీటి సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. పంటలు ఎండిపోతున్నా, సాగునీరు అందక రైతులు అవస్థలు పడుతున్నా కాంగ్రెస్ నేతలు రాజకీయ ఆందోళనలకే ప్రాధాన్యం ఇస్తున్నారని విమర్శించారు. దేశ విభజనకు దారితీసే శక్తులతో కాంగ్రెస్ కలిసి ఆందోళనలు చేయడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. నవంబరు 1న సిక్కుల ఊచకోత ఘటనపై కాంగ్రెస్ బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఎస్ఐఆర్‌పై కాంగ్రెస్, విపక్షాల ప్రచారాన్ని తిప్పికొట్టేందుకు వాస్తవాలతో కూడిన పుస్తకాన్ని రూపొందించినట్లు తెలిపారు.

ఎల్‌నినోపై రాజకీయాలు వద్దు

- ప్రతిపక్షంగా ప్రజల పక్షాన ఉండాలి
- కరువు కాంగ్రెస్ తెచ్చిందనడం విడ్డూరం
- గొలుసుకట్టు చెరువుల నిర్లక్ష్యంపై నివేదిక సిద్ధం
- రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి

ప్రజానావ, హైదరాబాద్: ఎల్‌నినో ప్రభావంతో వ్యవసాయ రంగానికి ఎదురయ్యే సవాళ్లను అధిగమించేందుకు రాజకీయాలకు అతీతంగా రైతులకు అండగా నిలవాలని రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి కోరారు. రైతులకు సూచనలు చేయాల్సిన సమయంలో రాజకీయ విమర్శలకు దిగడం సరికాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కరువును తీసుకొచ్చిందంటూ బీఆర్ఎస్ నేతలు వ్యాఖ్యానించడం విడ్డూరంగా ఉందని, కరువును ఎవరైనా తీసుకురాగలరా అని ప్రశ్నించారు. శుక్రవారం బీఆర్కే భవన్‌లోని కమిషన్ కార్యాలయంలో సభ్యులు రాంరెడ్డి గోపాల్‌రెడ్డి, భవానీరెడ్డితో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. ఎల్‌నినో ప్రభావం ఉంటుందన్న అంచనాలతో ముందుగానే సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి పంటల మార్పిడిపై నివేదిక అందజేశామని తెలిపారు. గతంలో వైఎస్ హయాంలో వ్యవసాయ ఉన్నతాధికారులుగా పనిచేసిన వారితో సంప్రదించి సూచనలు తీసుకున్నామని, రైతుల్లో అవగాహన కల్పించేందుకు కరపత్రాలు రూపొందించామని వెల్లడించారు.

ప్రతిపక్షానిదీ బాధ్యతే

ప్రతిపక్షంగా బీఆర్ఎస్ ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోదండరెడ్డి సూచించారు. అఖిలపక్ష సమావేశంలో ఆ పార్టీ నేతలు చేసిన వ్యాఖ్యలు బాధాకరమని, ఇంకా అధికారంలో ఉన్నట్లుగానే మాట్లాడుతున్నారని విమర్శించారు. ఎల్‌నినో ముప్పును ఎదుర్కొనేందుకు రైతులకు భరోసా కల్పించాల్సిన సమయంలో రాజకీయ విమర్శలకు ప్రాధాన్యం ఇవ్వడం తగదన్నారు. తెలంగాణలో గొలుసుకట్టు చెరువులు నిర్లక్ష్యానికి గురయ్యాయని పేర్కొన్న ఆయన.. వాటి పునరుద్ధరణ, పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై కమిషన్ ప్రత్యేక నివేదిక రూపొందించిందని చెప్పారు. త్వరలో ఈ నివేదికను నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి అందజేస్తామని తెలిపారు.

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనూ రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నారని, పలువురు ఆత్మహత్యలకు పాల్పడ్డారని ఆరోపించారు. అప్పట్లో రాహుల్‌గాంధీ తెలంగాణకు వచ్చి రైతు కుటుంబాలను పరామర్శించిన విషయాన్ని గుర్తుచేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఎల్‌నినో ప్రభావం రైతులపై పడకుండా చూడటం అందరి బాధ్యతని స్పష్టం చేశారు.

ఎలక్ట్రానిక్స్ తయారీలో తెలంగాణను అగ్రస్థానంలో నిలుపుతాం

ప్రజానావ, హైదరాబాద్: తెలంగాణను దేశంలోనే ప్రముఖ ఎలక్ట్రానిక్స్ తయారీ కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. టెక్నాలజీ, ఇన్నోవేషన్, తయారీ రంగాలను అనుసంధానిస్తూ సమగ్ర పారిశ్రామిక వ్యవస్థను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. రంగారెడ్డి జిల్లా తుక్కుగూడలోని ఈ సిటీలో ఆవిష్కరణ్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో రూ.200 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేసిన మివి నూతన తయారీ కేంద్రాన్ని శనివారం మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం తయారీ రంగానికి అత్యంత ప్రాధాన్యమిస్తోందన్నారు. 2025 – 26లో ఈ రంగం 7.7 శాతం వృద్ధిని నమోదు చేసిందని, రాష్ట్ర పారిశ్రామిక స్థూల విలువ జోడింపులో (జీఎస్‌వీఏ) తయారీ రంగం వాటా రూ.1.37 లక్షల కోట్లకు చేరిందని వివరించారు. తెలంగాణ రైజింగ్ – 2047 విజన్‌లో భాగంగా ఎలక్ట్రానిక్స్ తయారీ క్లస్టర్లు, హార్డ్‌వేర్ పార్కులను బలోపేతం చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నామన్నారు. చిప్ డిజైన్, సెమీకండక్టర్ తయారీ, ఎలక్ట్రానిక్ విడిభాగాల ఉత్పత్తిలోనూ రాష్ట్రాన్ని ముందంజలో నిలపడం లక్ష్యమన్నారు.

ఢిల్లీ మార్చ్‌కు రాహుల్ పిలుపు

- అనుమతి లేదన్న పోలీసులు.. హస్తినలో ట్రాఫిక్ ఆంక్షలు

న్యూఢిల్లీ: ఎన్నికల సంఘం తీరుకు నిరసనగా నవంబర్ 1న ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో ఇండియా కూటమి తలపెట్టిన భారీ మెగా ర్యాలీలో ప్రజలు, యువకులు, రాజకీయ పార్టీల కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం తన అధికారిక సోషల్ మీడియా వేదిక ఎక్స్ ద్వారా మార్చ్‌కు సంబంధించిన పూర్తి వివరాలను ఆయన వెల్లడించారు. ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు కన్నాట్ ప్లేస్ సమీపంలోని మింటో రోడ్ జంక్షన్ వద్ద ఈ మార్చ్ ప్రారంభమై, అజ్మేరి గేట్ మీదుగా రామ్‌లీలా మైదానం వరకు సాగుతుందని తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా , ఎన్నికల సంఘం అరుదైన కుట్రలతో భారత ప్రజాస్వామ్యాన్ని నిర్వీర్యం చేస్తున్నాయని రాహుల్ గాంధీ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఈ చారిత్రక నిరసనలో ప్రజలు పాల్గొనకుండా అడ్డుకునేందుకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా నానా విధాల ప్రయత్నాలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. మరోవైపు, రాహుల్ గాంధీ తలపెట్టిన ఈ ఢిల్లీ మార్చ్‌పై ఢిల్లీ పోలీసులు వెంటనే స్పందించారు. కన్నాట్ ప్లేస్ ప్రాంతం నుంచి ఎలాంటి మార్చ్ నిర్వహించేందుకు తమకు ముందస్తు దరఖాస్తు అందలేదని, అందువల్ల ఈ పాదయాత్రకు ఎలాంటి అనుమతి లేదని స్పష్టం చేశారు. అయితే ఎంపీలు, వివిధ రాజకీయ పార్టీల ప్రముఖ నాయకులు తమ ప్రైవేట్ వాహనాలలో కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌కు, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నివాసానికి వెళ్లేందుకు ఎలాంటి అభ్యంతరం లేదని పేర్కొన్నారు.

మైదానం చుట్టూ భారీ భద్రతా ఏర్పాట్లు

ఇండియా కూటమి తలపెట్టిన ఈ భారీ ర్యాలీ నేపథ్యంలో ఢిల్లీ పోలీసులు అత్యంత అప్రమత్తమయ్యారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా రామ్‌లీలా మైదానం చుట్టూ భారీ భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. సెంట్రల్ డిస్ట్రిక్ట్‌తో పాటు పలు పోలీస్ డివిజన్లకు చెందిన సిబ్బందిని, అదనంగా భారీ సంఖ్యలో పారామిలిటరీ బలగాలను రంగంలోకి దించారు. ఈ నిరసనల కారణంగా ఢిల్లీ వ్యాప్తంగా తీవ్ర ట్రాఫిక్ జామ్ ఏర్పడే అవకాశం ఉన్నందున పోలీసులు పటిష్టమైన ట్రాఫిక్ ఆంక్షలు, మళ్లింపులను ప్రకటించారు. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సెంట్రల్ ఢిల్లీలోని ప్రధాన మార్గాల్లో ట్రాఫిక్ మళ్లింపులు ఉంటాయని తెలిపారు. నేతాజీ సుభాష్ మార్గ్ టి–పాయింట్, రాజ్ ఘాట్, ఢిల్లీ గేట్, ఐటీఓ ఎ–పాయింట్, అజ్మేరీ గేట్ రెడ్ లైట్, రంజీత్ సింగ్ ఫ్లైఓవర్, ఝుండేవలన్ రౌండ్‌అబౌట్, తుర్క్‌మన్ గేట్, మిర్దార్డ్ చౌక్ తదితర కీలక కూడళ్లలో వాహనాల రాకపోకలపై ఆంక్షలు ఉంటాయని వెల్లడించారు. ఈ మార్గాల్లో వెళ్లే ప్రయాణికులు, రైల్వే స్టేషన్లకు వెళ్లేవారు ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని సూచించారు.

పెట్రోల్ ఎగుమతి సుంకం రద్దు

- డీజిల్, ఏటీఎఫ్ సుంకాలు పెంపు
- కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ కీలక నిర్ణయం

న్యూఢిల్లీ: అంతర్జాతీయ ఇంధన మార్కెట్లలో మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పెట్రోల్ ఎగుమతులపై విధిస్తున్న ప్రత్యేక అదనపు ఎక్సైజ్ సుంకాన్ని పూర్తిగా రద్దు చేస్తున్నట్లు ఆర్థిక మంత్రిత్వ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. అదే సమయంలో హై–స్పీడ్ డీజిల్ ఎగుమతి సుంకాన్ని లీటరుకు రూ. 11.5కి, విమాన ఇంధనం (ఏటీఎఫ్) సుంకాన్ని లీటరుకు రూ. 11కి పెంచుతూ నిర్ణయం తీసుకుంది. సవరించిన ఈ కొత్త ధరలు అక్టోబర్ 31 నుంచే అధికారిక గెజిట్ ప్రకటన ద్వారా అమల్లోకి వచ్చాయి. గతంలో పెట్రోల్ ఎగుమతిపై లీటరుకు రూ. 2.5గా ఉన్న సుంకాన్ని పూర్తిగా ఎత్తివేయగా, డీజిల్పై రూ. 8.5 నుంచి రూ. 11.5కి పెంచారు. అలాగే ఏటీఎఫ్ సుంకాన్ని రూ. 10.5 నుంచి రూ. 11కి సవరించినట్లు మంత్రిత్వ శాఖ వెల్లడించింది. పశ్చిమాసియా సంక్షోభం నేపథ్యంలో దేశీయంగా పెట్రోలియం ఉత్పత్తుల లభ్యతను కాపాడుకునేందుకు, ఎగుమతులను నియంత్రించే ఉద్దేశంతో ఈ విధానాన్ని కేంద్రం మార్చి 2026లో ప్రవేశపెట్టింది. అంతర్జాతీయంగా క్రూడాయిల్, పెట్రోల్, డీజిల్ సగటు ధరలను బట్టి ప్రతీ పక్షం రోజులకోసారి ఈ సుంకాలను ప్రభుత్వం సమీక్షిస్తూ వస్తోంది. తాజా మార్పుల ద్వారా పెట్రోల్ ఎగుమతులపై భారాన్ని పూర్తిగా తొలగించి, డీజిల్, ఏటీఎఫ్ ఎగుమతులపై సుంకాలను పెంచింది.

నో క్రాప్ హాలిడే

- ప్రతిపక్షాల తప్పుడు ప్రచారాన్ని నమ్మొద్దు ఎల్‌నినో నేపథ్యంలో ఆరుతడి పంటల సాగుకు ప్రోత్సాహం
- ఐదు నెలల్లో 31.21 లక్షల ఆయిల్‌పామ్ మొక్కల పంపిణీ
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ప్రజానావ, హైదరాబాద్: రాష్ట్రంలో ప్రభుత్వం ఎక్కడా క్రాప్ హాలిడే ప్రకటించలేదని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. ప్రతిపక్షాల ప్రచారాన్ని రైతులు నమ్మవద్దని, తప్పుడు సమాచారంతో వారిని ఆందోళనకు గురిచేయొద్దని కోరారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం, సాగునీటి లభ్యతలో మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉన్నందున తక్కువ నీటితో సాగయ్యే ఆరుతడి, సమీకృత పంటల సాగును ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. ఎల్‌నినో పరిస్థితులు ప్రపంచవ్యాప్తంగా ఉన్నాయని, వీటిని దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వం ఆరు నెలలుగా రైతులకు ముందస్తు అవగాహన కల్పిస్తోందన్నారు. వాతావరణ పరిస్థితులు, వర్షపాతం అంచనాలు, భూగర్భ జలమట్టాల వివరాలను ప్రతి వారం తెలియజేస్తున్నట్లు చెప్పారు. రైతు వేదికలు, రైతునేస్తం కార్యక్రమాల ద్వారా శాస్త్రవేత్తలు, అధికారులు పంటల ఎంపిక, నీటి వినియోగం, ప్రత్యామ్నాయ సాగు విధానాలపై సూచనలు అందిస్తున్నారని పేర్కొన్నారు. ఆరుతడి పంటల సాగు కోసం సబ్సిడీపై విత్తనాలను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఇప్పటివరకు 26,847 క్వింటాళ్ల శనగలు, 703 క్వింటాళ్ల పెసలు, 1,369 క్వింటాళ్ల మినుములు, 28,460 క్వింటాళ్ల వేరుశనగ, 200 క్వింటాళ్ల పొద్దుతిరుగుడు, 148 క్వింటాళ్ల నువ్వులు, 174 క్వింటాళ్ల కుసుమ విత్తనాలను సిద్ధం చేసినట్లు వెల్లడించారు. అధిక నీరు అవసరమయ్యే పంటలు సాగు చేసి చివరి దశలో నీటి కొరతతో రైతులు నష్టపోకుండా ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహిస్తున్నామని వివరించారు.

పంటల రక్షణకు చర్యలు

ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలను కాపాడేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తుమ్మల తెలిపారు. కరవు ప్రభావిత 365 మండలాల్లో పంట నష్టంపై అధికారులు క్షేత్రస్థాయి సర్వే చేపట్టారని చెప్పారు. రైతులకు కనీస మద్దతు ధరకు మించి ధరలు లభిస్తున్నాయని, సాగు నుంచి దిగుబడుల విక్రయం వరకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పర్యవేక్షిస్తున్నామని పేర్కొన్నారు. దీర్ఘకాలికంగా రైతులకు మెరుగైన ఆదాయం అందించే ప్రత్యామ్నాయ పంటల్లో ఆయిల్‌పామ్ ముఖ్యమైనదని అన్నారు. రాష్ట్రంలో సాగు విస్తీర్ణం పెంచేందుకు ప్రోత్సాహకాలు అందిస్తున్నామని, నాణ్యమైన మొక్కలను సకాలంలో సరఫరా చేసేందుకు కంపెనీల నర్సరీల్లో ముందస్తు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. నవంబర్‌లో 10.99 లక్షలు, డిసెంబర్‌లో 6.19 లక్షలు, జనవరిలో 5.20 లక్షలు, ఫిబ్రవరిలో 4.65 లక్షలు, మార్చిలో 4.18 లక్షల చొప్పున మొత్తం 31.21 లక్షల ఆయిల్‌పామ్ మొక్కలను అందుబాటులో ఉంచనున్నట్లు వెల్లడించారు. రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. వాతావరణ మార్పుల నుంచి రైతులను కాపాడటంతోపాటు వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చి వారి ఆదాయాన్ని పెంచడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తుమ్మల పేర్కొన్నారు.

సీఈసీపై దేశద్రోహం కేసు పెట్టాలి

- ఇండియా కూటమి తీర్మానం ఓటర్ల జాబితాలో అక్రమాలు, ఎస్ఐఆర్ ప్రక్రియపై తీవ్ర ఆరోపణలు
- ఎన్నికల ప్రక్రియపై ముందస్తు ప్రణాళికతో చేసిన దాడిగా అభివర్ణన
- 'ప్రజా అభిశంసన'లో ఆరోపణల పత్రం చదివిన ఖర్గే

న్యూఢిల్లీ: ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుంచి తొలగించడంతో పాటు, ఆయనపై దేశద్రోహం ఆరోపణలతో న్యాయస్థానంలో విచారణ జరపాలని ప్రతిపక్ష ఇండియా కూటమి డిమాండ్ చేసింది. జాతీయ, రాష్ట్ర స్థాయి ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడి ఫలితాలను ప్రభావితం చేసేందుకు బీజేపీ పన్నిన కుట్రలో జ్ఞానేశ్ కుమార్ కూడా భాగస్వామిగా ఉన్నారని ఆరోపించింది. ఈ మేరకు శనివారం ఢిల్లీలో నిర్వహించిన 'ప్రజా అభిశంసన' కార్యక్రమంలో ఇండియా కూటమి తీర్మానాన్ని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చదివి వినిపించారు. ఓటర్ల జాబితాలో అక్రమాలు, ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై ప్రతిపక్షాలు కొంతకాలంగా ఎన్నికల సంఘాన్ని ప్రశ్నిస్తున్నాయి. ఈ నేపథ్యంలో సీఈసీపై జవాబుదారీతనం కోరుతూ ఇండియా కూటమి ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. తీర్మానంలో జ్ఞానేశ్ కుమార్‌పై పలు ఆరోపణలు చేసింది. ఓటర్ల జాబితాలను తమకు అనుకూలంగా మార్చుకునేందుకు అధికార బీజేపీకి అవకాశం కల్పించారని, ఇష్టానుసారంగా ఓటర్ల పేర్లను తొలగించేందుకు, కొత్త పేర్లను చేర్చేందుకు అనుమతించారని ఆరోపించింది. ఇది దేశ ప్రజాస్వామ్యానికి పునాదిగా ఉన్న ఎన్నికల ప్రక్రియపై ముందస్తు ప్రణాళికతో చేసిన దాడి అని అభివర్ణించింది.ఎస్ఐఆర్ ప్రక్రియను ఉద్దేశపూర్వకంగా, పక్షపాత ధోరణితో, పారదర్శకత లేకుండా నిర్వహించారని ఇండియా కూటమి ఆరోపించింది. ఈ ప్రక్రియ ద్వారా 13.2 కోట్ల మంది ఓటర్ల పేర్లను ఉద్దేశపూర్వకంగా తొలగించి, రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కుకు వారిని దూరం చేశారని తీర్మానంలో పేర్కొంది. సహజ న్యాయ సూత్రాలను కూడా ఉల్లంఘించారని విమర్శించింది.

లేకుండానే అక్రమ సవరణ

1960 నాటి ఓటర్ల నమోదు నిబంధనల్లోని ఫారం–6ను పార్లమెంటు పర్యవేక్షణ లేదా అనుమతి లేకుండానే అక్రమంగా సవరించారని మరో ఆరోపణ చేసింది. తొలిసారి ఓటు హక్కు పొందాల్సిన యువత పేర్ల నమోదును అడ్డుకునే కుట్రలో భాగంగానే ఈ మార్పులు చేశారని పేర్కొంది. అలాగే ఈసీఐలోని ఓటర్ల జాబితాల నిర్వహణను కేంద్రీకరించేందుకు ఈఆర్‌వోనెట్/ఈసీఐనెట్ సాఫ్ట్‌వేర్‌ను దుర్వినియోగం చేశారని, స్థానిక ఎన్నికల నమోదు అధికారులు (ఈఆర్‌ఓలు) అర్హులైన ఓటర్ల పేర్లను చేర్చకుండా అడ్డుకున్నారని ఆరోపించింది. ఎన్నికల సంఘంలోని మరో ఇద్దరు కమిషనర్లను నిర్ణయ ప్రక్రియ నుంచి ఉద్దేశపూర్వకంగా తప్పించారని, ఈ వ్యవహారంపై వారు కనీసం 14 అభ్యంతరాలను అధికారికంగా నమోదు చేశారని ఇండియా కూటమి తీర్మానంలో పేర్కొంది. రాజ్యాంగం నిర్దేశించిన విధంగా స్వతంత్రంగా వ్యవహరించి స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నికలకు హామీ ఇవ్వాల్సిన బాధ్యతను సీఈసీ విస్మరించారని ఆరోపించింది. ప్రతిపక్షాలకు న్యాయమైన విచారణ అవకాశం కూడా కల్పించలేదని విమర్శించింది. అంతేకాకుండా, అధికార బీజేపీకి అనుకూలంగా వ్యవహరించినందుకు జ్ఞానేశ్ కుమార్ కుటుంబ సభ్యుల్లో కొందరికి కీలక పదవులు, ప్రత్యేక ప్రయోజనాలు, అసాధారణ పారితోషిక అవకాశాలు లభించాయని తీర్మానంలో ఆరోపించింది. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆదేశాలకు అనుగుణంగా పనిచేస్తూ ప్రజల విశ్వాసాన్ని వమ్ము చేశారని పేర్కొంది. 2023 డిసెంబర్‌లో సీఈసీకి కల్పించిన జీవితకాల న్యాయ రక్షణ కూడా ఆయనపై ఉన్న ఆరోపణలకు కవచంగా ఉపయోగపడే ఉద్దేశంతోనే తీసుకొచ్చారని ఇండియా కూటమి విమర్శించింది. ఈ కార్యక్రమానికి మాజీ లోక్‌సభ స్పీకర్ మీరా కుమార్ అధ్యక్షత వహించగా, సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ అవధేశ్ ప్రసాద్, తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ సౌగత రాయ్ ఉపాధ్యక్షులుగా వ్యవహరించారు.

కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ అధ్యక్షురాలు సోనియా గాంధీ, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శులు ప్రియాంక గాంధీ వాద్రా, జైరాం రమేశ్, కేసీ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు. సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ ధర్మేంద్ర యాదవ్, తృణమూల్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత డెరెక్ ఓబ్రియన్ సహా ఇండియా కూటమి భాగస్వామ్య పార్టీల నాయకులు, ఎంపీలు హాజరయ్యారు. దేశ ప్రజల్లో 60 శాతానికి పైగా ప్రాతినిధ్యం వహిస్తున్న ఇండియా కూటమి ఎంపీలు, అక్టోబర్ 31న ఢిల్లీలో సమావేశమైన పౌరులు ఈ తీర్మానాన్ని ఆమోదించినట్లు అందులో పేర్కొన్నారు. ప్రజలకు, రాజ్యాంగానికి చేసిన ద్రోహానికి జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుంచి తక్షణమే తొలగించి, చట్ట ప్రకారం న్యాయస్థానంలో దేశద్రోహం ఆరోపణలపై విచారించాలని డిమాండ్ చేశారు.

భారతదేశ ఐక్యతే అసలైన బలం

- వైవిధ్యమే మన ప్రత్యేకత
- సర్దార్ పటేల్ ధైర్యసాహసాలు, దూరదృష్టి నేటికీ స్ఫూర్తిదాయకం
- 'ఏక్ భారత్.. శ్రేష్ఠ భారత్'తో జాతీయ సమైక్యతకు బలోపేతం
- జమ్ముకశ్మీర్, లద్దాఖ్ అవతరణ దినోత్సవ వేడుకల్లో గవర్నర్ శివప్రతాప్ శుక్ల





ప్రజానావ, హైదరాబాద్ : భారతదేశానికి భౌగోళిక సరిహద్దుల కంటే ప్రజల మధ్య ఐక్యత, అంకితభావమే అసలైన బలమని రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్ల అన్నారు. భిన్నత్వంలో ఏకత్వమే భారతదేశ గొప్పతనమని, వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రజలు పరస్పరం కలుసుకుని తమ సంస్కృతులు, సంప్రదాయాలను పంచుకోవడం ద్వారా జాతీయ సమైక్యత మరింత బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. 'ఏక్ భారత్.. శ్రేష్ఠ భారత్' కార్యక్రమంలో భాగంగా లోక్‌భవన్‌లోని దర్బార్‌హాల్‌లో నిర్వహించిన జమ్ముకశ్మీర్, లద్దాఖ్ కేంద్రపాలిత ప్రాంతాల అవతరణ దినోత్సవ వేడుకల్లో శనివారం గవర్నర్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. తొలుత సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఆయన సేవలను స్మరించుకున్నారు. దేశంలోని అనేక సంస్థానాలను భారత యూనియన్‌లో విలీనం చేయడంలో సర్దార్ పటేల్ కీలక పాత్ర పోషించారని, ఆయన అసాధారణ ధైర్యసాహసాలు, దూరదృష్టి ఆధునిక భారతదేశ నిర్మాణంలో చిరస్మరణీయమని కొనియాడారు. దేశ ఐక్యత, సమగ్రతను కాపాడటంలో ఆయన చూపిన మార్గం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని అన్నారు. జమ్ముకశ్మీర్, లద్దాఖ్ అవతరణ దినోత్సవాలు దేశ ఐక్యత, సమగ్రతను మరోసారి గుర్తుచేసే చారిత్రక సందర్భాలని పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దార్శనికతకు అనుగుణంగా లోక్‌భవన్‌లో వివిధ రాష్ట్రాల అవతరణ దినోత్సవాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. హైదరాబాద్‌లో నివసిస్తున్న ఆయా రాష్ట్రాల ప్రజలు ఒకచోట చేరి పరస్పర పరిచయాలు పెంపొందించుకోవడానికి, సంస్కృతులు, సంప్రదాయాలను తెలుసుకోవడానికి ఈ వేడుకలు చక్కని వేదికగా నిలుస్తున్నాయని చెప్పారు. జమ్ముకశ్మీర్ ప్రకృతి సౌందర్యానికి, పచ్చని లోయలకు, ప్రశాంతమైన సరస్సులకు ప్రసిద్ధి చెందిందని, ఆధ్యాత్మికంగానూ ఈ ప్రాంతానికి విశేష ప్రాధాన్యత ఉందన్నారు. మాతా వైష్ణోదేవి వంటి పుణ్యక్షేత్రాలను సందర్శించేందుకు దేశ, విదేశాల నుంచి భక్తులు వస్తుంటారని పేర్కొన్నారు. యాత్రికుల సౌకర్యార్థం ప్రభుత్వం రవాణా, హెలికాప్టర్ సేవలను మెరుగుపరిచిందని తెలిపారు. దేశ రక్షణలో జమ్ముకశ్మీర్ యువత కీలక పాత్ర పోషిస్తున్నారని, ఆ ప్రాంతం శాంతి, అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందని అన్నారు. లద్దాఖ్ ఎత్తైన పర్వత శ్రేణులు, విశిష్ట సంప్రదాయాలకు నిలయమని, క్లిష్టమైన భౌగోళిక పరిస్థితుల్లోనూ అక్కడి ప్రజలు చూపుతున్న ధైర్యం, పట్టుదల ప్రశంసనీయమని గవర్నర్ పేర్కొన్నారు. హెమిస్, థిక్సే వంటి ప్రాచీన బౌద్ధ మఠాలు ఆ ప్రాంత ఆధ్యాత్మిక వారసత్వానికి ప్రతీకలని, దలైలామా బోధనలు శాంతి, కరుణ సందేశాన్ని ప్రపంచానికి చాటుతున్నాయని చెప్పారు. తెలంగాణ, జమ్ముకశ్మీర్ భౌగోళికంగా భిన్నమైన ప్రాంతాలైనా ప్రజల మధ్య అనుబంధం బలంగా ఉందన్నారు. జమ్ముకశ్మీర్‌కు చెందిన పలువురు విద్యార్థులు హైదరాబాద్‌లోని విద్యాసంస్థల్లో ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారని తెలిపారు. ఐటీ, ఔషధ, వైద్య రంగాల్లో హైదరాబాద్ జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడంతో వివిధ రాష్ట్రాల విద్యార్థులకు ప్రముఖ విద్యాకేంద్రంగా మారిందని వివరించారు. ప్రతి ఒక్కరూ తమ జన్మస్థలంతో పాటు తాము పనిచేస్తున్న ప్రాంతంతోనూ అనుబంధాన్ని కొనసాగించాలని సూచించారు. లోక్‌భవన్‌లో నిర్వహించే వివిధ రాష్ట్రాల అవతరణ దినోత్సవాలు రాజకీయాలకు అతీతంగా సాంస్కృతిక మార్పిడి, జాతీయ ఐక్యత, సమగ్రతను పెంపొందించడమే లక్ష్యంగా కొనసాగుతున్నాయని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.దానకిశోర్, విద్యాశాఖ కార్యదర్శి యోగితా రానా, డిప్యూటీ జనరల్ ఆఫీసర్ కమాండింగ్ ఇన్ చీఫ్ బ్రిగేడియర్ పునీత్ కుమార్ ద్వివేది, సంయుక్త కార్యదర్శి కొమండూరు శశికిరణ్, జమ్ముకశ్మీర్, లద్దాఖ్ ప్రాంతాలకు చెందిన అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.



యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామిని దర్శించుకున్న గవర్నర్ దంపతులు

- వేదమంత్రాల నడుమ స్వామివారి ఆశీర్వచనం
- 2027 నూతన వార్షిక క్యాలెండర్‌ను ఆవిష్కరించిన శివప్రతాప్ శుక్ల

ప్రజానావ, యాదగిరిగుట్ట : తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్ల తన సతీమణి జానకి శుక్లతో కలిసి యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహ స్వామివారిని దర్శించుకున్నారు. శ్రీ జనార్దనానంద సరస్వతి స్వామి సంస్కృతి ట్రస్ట్ ఆధ్వర్యంలో యాదగిరిగుట్ట దేవస్థానంలో నిర్వహిస్తున్న తెలంగాణ వేద విద్వన్మహాసభలకు గవర్నర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా యాదగిరిగుట్టపై ఉన్న అతిథిగృహానికి చేరుకున్న గవర్నర్ దంపతులకు రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబు, ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి ఘనస్వాగతం పలికారు. అనంతరం గవర్నర్ దంపతులు శ్రీ లక్ష్మీ నరసింహస్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనానంతరం అర్చకులు వేదమంత్రాలతో గవర్నర్ దంపతులకు వేదాశీర్వచనం అందజేశారు. ఈ సందర్భంగా దేవస్థానం కార్యనిర్వహణాధికారి భవానీ శంకర్ స్వామివారి జ్ఞాపికతో పాటు ప్రసాదాలను గవర్నర్‌కు అందజేశారు. అనంతరం దేవస్థానం రూపొందించిన 2027 నూతన వార్షిక క్యాలెండర్‌ను గవర్నర్ శివప్రతాప్ శుక్ల ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.దానకిశోర్, దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, దేవస్థానం కార్యనిర్వహణాధికారి భవానీ శంకర్, జిల్లా ఎస్పీ అక్షాంశ్ యాదవ్, యాదగిరిగుట్ట దేవస్థానం పాలకమండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వేదాలే భారతీయ సంస్కృతికి ప్రాణం

- ప్రకృతి పరిరక్షణ నుంచి సామాజిక సామరస్యం వరకు వేదాలే మార్గదర్శకం
- గవర్నర్ శివప్రతాప్ శుక్ల
- వేద పరిరక్షణలో గురు–శిష్య పరంపర సేవలు అమూల్యం
- 500 మందికి పైగా విద్యార్థులకు అభినందనలు
- 10 మంది వేద పండితులకు ప్రశంసలు



ప్రజానావ, యాదగిరిగుట్ట : వేద జ్ఞానమే భారతీయ నాగరికత, సంస్కృతులకు మూలాధారమని, వేదాలు కేవలం ఆధ్యాత్మిక చింతనకే పరిమితం కాకుండా ప్రకృతి పరిరక్షణ, మానవ జీవనం, నైతిక విలువలు, సామాజిక సామరస్యానికి మార్గదర్శకంగా నిలుస్తున్నాయని తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్ల అన్నారు. యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం, తిరుమల తిరుపతి దేవస్థానం సౌజన్యంతో నిర్వహిస్తున్న 26వ తెలంగాణ వేద విద్వన్మహాసభల్లో శనివారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. తరతరాలుగా వేదాలను పరిరక్షిస్తూ వస్తున్న గురు–శిష్య పరంపర భారతీయ సంస్కృతిలో అత్యంత విశిష్టమైనదని కొనియాడారు. ఆచార్యులు నిరంతర సాధన, అంకితభావంతో వేదాల శుద్ధ ఉచ్చారణ, స్వర, పాఠ సంప్రదాయాలను కాపాడుతూ వస్తున్నారని పేర్కొన్నారు. వేదాల పరిరక్షణలో వారి సేవలు అమూల్యమైనవని అన్నారు. ఈ మహాసభల్లో భాగంగా నిర్వహిస్తున్న వేద పరీక్షల్లో పాల్గొంటున్న 500 మందికి పైగా విద్యార్థులకు గవర్నర్ శుభాకాంక్షలు తెలిపారు. వారి కృషి, క్రమశిక్షణ భారతీయ సాంస్కృతిక వారసత్వం ఉజ్వల భవిష్యత్తుకు నిదర్శనమని ప్రశంసించారు. ఈ సందర్భంగా జయపత్రాలు అందుకున్న 10 మంది వేద విద్వాంసులను ప్రత్యేకంగా అభినందించారు. యాదగిరిగుట్ట పుణ్యక్షేత్రం వేద అధ్యయనం, ఆధ్యాత్మిక సాధన, సాంస్కృతిక చైతన్యానికి ప్రముఖ కేంద్రంగా ఎదిగేందుకు అపార అవకాశాలు ఉన్నాయని గవర్నర్ పేర్కొన్నారు. ప్రాచీన భారతీయ జ్ఞాన సంపదకు, ఆధునిక విజ్ఞానానికి మధ్య సార్థకమైన అనుసంధానం అవసరమని అభిప్రాయపడ్డారు. వేద విద్యా సంస్థలు, విద్వత్ సభలు, గురుకులాలకు మరింత ప్రోత్సాహం అందించాలని పిలుపునిచ్చారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణలో యువత భాగస్వాములు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి డి.శ్రీధర్‌బాబు, ప్రభుత్వ చీఫ్ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.దానకిశోర్, ధార్మిక సలహాదారు ఆర్.గోవింద్ హరి, దేవాదాయ శాఖ కమిషనర్ ఎం.హనుమంతరావు, దేవస్థానం కార్యనిర్వహణాధికారి జె.భవానీ శంకర్, ఆచార్యులు, వేద పండితులు, భక్తులు పాల్గొన్నారు.

ఐదు రోజుల పాటు వర్షాలు

- బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావం
- పలు జిల్లాల్లో భారీ వర్షాలకు అవకాశం

ప్రజానావ, హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రంలో రాబోయే ఐదు రోజుల పాటు విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి భారీ వర్షాలు కురిసే సూచనలు ఉన్నట్లు తెలిపింది. ముఖ్యంగా శనివారం సాయంత్రం ఉమ్మడి వరంగల్, ఖమ్మం, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలతో పాటు యాదాద్రి భువనగిరి, సిద్దిపేట జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు. అల్పపీడన ద్రోణి ప్రభావం రాబోయే రోజుల్లో మరింత పెరిగే అవకాశం ఉందని అంచనా వేశారు. ప్రధానంగా నవంబర్ 2, 3 తేదీల్లో ఉమ్మడి ఆదిలాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే సూచనలు ఉన్నట్లు తెలిపారు. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడే సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా రైతులు పొలాల్లో పనిచేసేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని, విద్యుత్ స్తంభాలు, చెట్ల కింద ఆశ్రయం పొందవద్దని హెచ్చరించారు. వర్షాల కారణంగా రహదారులపై నీరు నిలిచిపోయి రాకపోకలకు అంతరాయం కలిగే అవకాశం ఉన్నందున జీహెచ్ఎంసీతో పాటు స్థానిక సంస్థల అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు.

ఎల్‌నినో ప్రభావంతో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలి

- అధికారులకు ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ ఆదేశం
- రూ.50 లక్షలతో కొత్త మురుగునీటి పైప్‌లైన్ పనులు ప్రారంభం
- రూ.15 లక్షల రోడ్డు పనుల పరిశీలన

ప్రజానావ, సికింద్రాబాద్ : ఎల్‌నినో ప్రభావంతో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సికింద్రాబాద్ ఎమ్మెల్యే, మాజీ ఉపసభాపతి తీగుళ్ల పద్మారావు గౌడ్ అధికారులకు సూచించారు. తార్నాక మున్సిపల్ డివిజన్ పరిధిలో అండాల మిక్స్చర్ సమీపంలో జలమండలి ఆధ్వర్యంలో రూ.50 లక్షల వ్యయంతో నిర్మించనున్న నూతన మురుగునీటి పైప్‌లైన్ పనులను శనివారం ఆయన ప్రారంభించారు. అనంతరం జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో రూ.15 లక్షల వ్యయంతో చేపడుతున్న రహదారి నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా పద్మారావు గౌడ్ మాట్లాడుతూ సికింద్రాబాద్ నియోజకవర్గ పరిధిలో అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేస్తున్నామని, వివిధ శాఖల పరిధిలో పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనలో ఎలాంటి జాప్యం జరగకూడదని స్పష్టం చేశారు. ఎల్‌నినో ప్రభావంతో భవిష్యత్తులో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోకుండా ప్రభుత్వం ముందస్తు ప్రణాళికతో అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ యువ నాయకుడు రామేశ్వర్ గౌడ్, మాజీ కార్పొరేటర్ ఆలకుంట సరస్వతి హరి, మాజీ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్‌రెడ్డి, జలమండలి డీజీఎం షంషీర్, సంబంధిత అధికారులు, నాయకులు పాల్గొన్నారు.







కండర క్షీణత వ్యాధిగ్రస్తులకు సమాజం అండగా నిలవాలి

- బాధిత చిన్నారుల కుటుంబాలకు భరోసా కల్పించాలి
- సమగ్ర వైద్య సేవలు అందించాలి
- పోలీస్ కమిషనర్ సజ్జనార్

ప్రజానావ, హైదరాబాద్ : కండరాల క్షీణత వ్యాధి (మస్క్యులర్ డిస్ట్రోఫీ), డచెన్ మస్క్యులర్ డిస్ట్రోఫీ (డీఎండీ)తో బాధపడుతున్న చిన్నారులు, వారి కుటుంబాలకు సమాజం అండగా నిలిచి భరోసా కల్పించాలని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్ పిలుపునిచ్చారు. భారత్ఎండీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాధిత కుటుంబాలకు మద్దతుగా నిర్వహించిన 'ఓజస్–2026' జాతీయ అవగాహన కార్యక్రమం నగరంలోని బంజారాహిల్స్ ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ (ఐసీసీసీ)లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి వైద్య నిపుణులు, జన్యుశాస్త్ర నిపుణులు, కార్పొరేట్, మీడియా ప్రతినిధులతో పాటు 60 మందికి పైగా బాధిత చిన్నారులు, వారి తల్లిదండ్రులు హాజరయ్యారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న పోలీస్ కమిషనర్ సజ్జనార్ మాట్లాడుతూ కండరాల క్షీణత వ్యాధులతో బాధపడుతున్న చిన్నారుల కుటుంబాలు ఎదుర్కొంటున్న సమస్యలను సమాజం అర్థం చేసుకుని వారికి అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు న్యూరాలజీ, చిన్నపిల్లల వైద్యం, గుండె సంబంధిత వైద్యం, ఊపిరితిత్తుల వైద్యం, ఫిజియోథెరపీ, జన్యుశాస్త్ర నిపుణులతో కూడిన సమగ్ర వైద్య విధానం అవసరమని పేర్కొన్నారు. అలాగే నకిలీ వైద్య విధానాలు, మోసపూరితంగా ఆన్‌లైన్‌లో విరాళాలు కోరే వ్యక్తుల పట్ల బాధిత కుటుంబాలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా పలువురు బాధిత చిన్నారులకు ప్రత్యేక వీల్‌చైర్లను పంపిణీ చేశారు. జాతీయ వైద్య కమిషన్ సభ్యుడు, భారత్ఎండీ ఫౌండేషన్ ముఖ్య సలహాదారు డాక్టర్ సంతోష్ కుమార్ క్రాలేటి మాట్లాడుతూ తెలంగాణలో ప్రత్యేక అరుదైన వ్యాధుల విధానాన్ని రూపొందించి దేశానికే ఆదర్శంగా నిలవాలని ప్రభుత్వానికి సూచించారు. అరుదైన వ్యాధులతో బాధపడుతున్న వారికి మెరుగైన వైద్య సేవలు, అవసరమైన సహకారం అందేలా ప్రత్యేక విధానం దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా తెలుగు కుటుంబాలకు ఉపయోగపడేలా రూపొందించిన 'డీఎండీ కేర్ గైడ్' తెలుగు అనువాద ప్రతిని ఆవిష్కరించారు. దేశవ్యాప్తంగా 100 నాడీ, కండరాల సంబంధిత ప్రత్యేక వైద్య కేంద్రాలను ఏర్పాటు చేయడం తమ ఫౌండేషన్ లక్ష్యమని భారత్ఎండీ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మురళి వెల్లడించారు. బాధిత చిన్నారులకు వైద్యపరమైన సహకారం అందించడంతో పాటు వారి కుటుంబాల్లో వ్యాధిపై అవగాహన పెంపొందించడం, అవసరమైన సహాయాన్ని సమకూర్చడం లక్ష్యంగా ఈ జాతీయ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు.

విద్యుత్ తీగలు ఇద్దరు విద్యార్థుల ప్రాణాలు తీశాయి

- అడవి పందుల నుంచి పంట రక్షణకు రైతు ఏర్పాటు
- పోలీసుల వాహనాన్ని చూసి పాలాల్లోకి పరుగులు

ప్రజానావ, మొయినాబాద్ : పంట పొలాలను అడవి పందుల బారి నుంచి కాపాడుకునేందుకు ఏర్పాటు చేసిన విద్యుత్ తీగలు ఇద్దరు ఇంజినీరింగ్ విద్యార్థుల ప్రాణాలను బలిగొన్నాయి. మొయినాబాద్ మండలం పెద్దమంగళారం గ్రామ పరిధిలో శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఈ విషాద ఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో కేజీ రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో మూడో సంవత్సరం సివిల్ ఇంజినీరింగ్ చదువుతున్న మూక్షా చరణ్ (20), యశ్వంత్ (20) అక్కడికక్కడే మృతి చెందారు. వివరాల ప్రకారం.. సుమారు 10 నుంచి 12 మంది విద్యార్థులు మద్యం బాటిళ్లతో ఓ బహిరంగ ప్రదేశంలో గడుపుతుండగా అటుగా వచ్చిన పోలీసుల పెట్రోలింగ్ వాహనాన్ని చూసి భయపడ్డారు. పోలీసులకు చిక్కకుండా ఉండేందుకు సమీపంలోని వ్యవసాయ పొలాల్లోకి పరుగులు తీశారు. ఈ క్రమంలో పెద్దమంగళారం పరిధిలోని సర్వే నంబర్లు 320, 330లో బోలిచెర్వు రాజిరెడ్డి (45)కి చెందిన సుమారు అర ఎకరం భూమిని కౌలుకు తీసుకుని సాగు చేస్తున్న పొలం చుట్టూ ఏర్పాటు చేసిన విద్యుత్ తీగలు విద్యార్థులకు తగిలాయి. దీంతో మూక్షా చరణ్, యశ్వంత్ విద్యుదాఘాతానికి గురై ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో మూక్షా చరణ్ రాజేంద్రనగర్‌లోని ఉప్పర్‌పల్లికి చెందిన మహేష్ కుమారుడిగా, యశ్వంత్ బల్కంపేటకు చెందిన మహేష్ కుమారుడిగా గుర్తించారు. మిగిలిన విద్యార్థులు సురక్షితంగా బయటపడినట్లు సమాచారం. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు విద్యుత్ తీగలు ఏర్పాటు చేసిన రైతును అదుపులోకి తీసుకున్నారు. మిగిలిన విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇచ్చినట్లు తెలిసింది.

15 ఏళ్లుగా మరమ్మతులకు నోచుకోని రహదారి

- గుంతలమయంగా కల్‌ఖోడ ప్రధాన మార్గం
- రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు

ప్రజానావ, వికారాబాద్ : రహదారి నిర్మించి ఏళ్ల గడుస్తున్నా మరమ్మతులు చేపట్టకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డు వేయండి సారూ.. గుంతల రహదారిపై ప్రయాణించలేకపోతున్నామంటూ వికారాబాద్ జిల్లా మర్పల్లి మండలం కల్‌ఖోడ గ్రామ ప్రజలు పాలకులను వేడుకుంటున్నారు. సుమారు 15 ఏళ్ల క్రితం నిర్మించిన బీటీ రహదారి పూర్తిగా దెబ్బతిని ప్రస్తుతం గుంతలు, పైకి తేలిన కంకర రాళ్లతో ప్రమాదకరంగా మారింది. ఈ మార్గంలో ప్రయాణించాలంటేనే వాహనదారులు భయపడే పరిస్థితి నెలకొంది. ఎన్నిసార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా సమస్య పరిష్కారం కావడం లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కల్‌ఖోడ గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి అధ్వానంగా మారడంతో నిత్యం రాకపోకలు సాగించే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రానికి వెళ్లాలన్నా, ఇతర ప్రాంతాలకు చేరుకోవాలన్నా ఈ రహదారే ప్రధాన ఆధారం. బంట్వారం మండలం తోర్మామిడి గ్రామంతో పాటు తాండూరు నియోజకవర్గంలోని పలు గ్రామాల ప్రజలు కూడా ఇదే మార్గాన్ని వినియోగిస్తున్నారు. అంతేకాకుండా హైదరాబాద్ నుంచి కర్ణాటక సరిహద్దులోని కుంచారం, చించోలి తదితర ప్రాంతాలకు వెళ్లే వారికి ఈ రహదారి సమీప మార్గంగా ఉండటంతో నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఇంతటి ప్రాధాన్యం ఉన్న రహదారిని అధికారులు పట్టించుకోకపోవడంపై స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు పొడవునా ఏర్పడిన గుంతలు, పైకి తేలిన కంకర రాళ్ల కారణంగా ద్విచక్ర వాహనదారులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారని గ్రామస్థులు చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రహదారిని పూర్తిస్థాయిలో పునర్నిర్మించాలని కోరుతున్నారు.



విద్యుత్ మరమ్మతులు

- నగరంలో పలు ప్రాంతాలకు కరెంట్ కోతలు
- ఫీడర్లలో సాంకేతిక సమస్యలతో అత్యవసర పనులు
- ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని అధికారుల సూచన

ప్రజానావ, హైదరాబాద్ : నగరంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుంది. శుక్రవారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి పలు ప్రాంతాల్లో విద్యుత్ ఫీడర్లు దెబ్బతినడంతో మరమ్మతు పనులు చేపట్టేందుకు అధికారులు సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా శనివారం నగరంలోని పలు కీలక ప్రాంతాల్లో కొద్దిసేపు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు ప్రకటించారు. మౌలాలి సబ్‌స్టేషన్ పరిధిలోని జవహర్‌నగర్ ఫీడర్‌లో నిర్వహణ పనులు చేపడుతుండటంతో జవహర్‌నగర్, కృష్ణవేణి నగర్, రాఘవేంద్ర నగర్, కస్తూరిబా నగర్, వసంత్ విహార్ కాలనీ, ఏపీఐఐసీ కాలనీలతో పాటు సమీప ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 గంటల నుంచి 3.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోనుంది. మరోవైపు గోకుల్‌నగర్ విద్యుత్ ఫీడర్‌లో ఏర్పడిన సాంకేతిక సమస్యలను పరిష్కరించేందుకు మరమ్మతులు చేపట్టనున్నారు. దీంతో పార్వతీనగర్, గోకుల్‌నగర్, శారదా ఆస్పత్రి పరిసరాలు, వాటర్ వర్క్స్ ప్రాంతం, అంకురా ఆస్పత్రి, హెచ్ఐజీ–ఏ ప్రాంతాల్లో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదు. ఆస్పత్రులు, అత్యవసర సేవల కేంద్రాల నిర్వాహకులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు, జనరేటర్లను సిద్ధం చేసుకోవాలని అధికారులు సూచించారు. మరోవైపు ఎల్‌నినో పరిస్థితుల ప్రభావంతో ఉష్ణోగ్రతలు పెరుగుతుండటం, ఏసీలు, కూలర్ల వినియోగం అధికం కావడంతో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరుగుతోంది. భవిష్యత్తులో విద్యుత్ కొరత తలెత్తకుండా వినియోగదారులు పొదుపు చర్యలు పాటించాలని ప్రభుత్వం కోరుతోంది. ఇప్పటికే గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా సమస్యలు నెలకొన్న నేపథ్యంలో రాబోయే వేసవి వరకు డిమాండ్ మరింత పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. పెరుగుతున్న అవసరాలకు అనుగుణంగా విద్యుత్ లైన్ల సామర్థ్యాన్ని పెంచే పనులను విద్యుత్ సంస్థలు వేగవంతం చేస్తున్నాయి. ఇదిలా ఉండగా కరెంట్ కోతలతో నీటి సరఫరాకు ఇబ్బందులు కలగకుండా ముందుగానే నీటిని నిల్వ చేసుకోవాలని అధికారులు నగరవాసులకు సూచించారు. వర్షాల సమయంలో విద్యుత్ తీగలు తెగిపడే ప్రమాదం ఉన్నందున వాటిని తాకవద్దని, ఎక్కడైనా తెగిపడిన తీగలు కనిపిస్తే వెంటనే విద్యుత్ శాఖకు సమాచారం అందించాలని హెచ్చరించారు.

ఇందిరాగాంధీ సేవలు చిరస్మరణీయం

నెక్లెస్ రోడ్డులో విగ్రహానికి మంత్రి తుమ్మల నివాళులు

ప్రజానావ, హైదరాబాద్ : భారత మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ వర్ధంతిని పురస్కరించుకుని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హైదరాబాద్‌లోని నెక్లెస్ రోడ్డు వద్ద ఆమె విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఇందిరాగాంధీ దేశానికి అందించిన సేవలను, దేశ సమగ్రత, సమైక్యత కోసం ఆమె చేసిన కృషిని మంత్రి స్మరించుకున్నారు. భారతదేశ తొలి మహిళా ప్రధానమంత్రిగా దేశ అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి ఇందిరాగాంధీ అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. దేశ ఐక్యతను కాపాడటంతో పాటు ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ కోసం ఆమె ప్రదర్శించిన నాయకత్వ పటిమ నేటి తరానికి స్ఫూర్తిదాయకమని మంత్రి తుమ్మల పేర్కొన్నారు.





డ్రైవర్ల మెరుపు సమ్మె ఆర్టీసీ ఎలక్ట్రిక్ బస్సులు బంద్

- డ్యూటీలు నిలిపివేయడంపై డ్రైవర్ల ఆగ్రహం
- బాధితులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్

ప్రజానావ, నల్లగొండ : నల్లగొండ ఆర్టీసీ డిపోలో జేబీఎం ఎలక్ట్రిక్ బస్సుల సేవలు శనివారం ఉదయం 4 గంటల నుంచి నిలిచిపోయాయి. యాజమాన్యం తమ పట్ల కక్షపూరితంగా వ్యవహరిస్తూ ఎలాంటి కారణం లేకుండానే కొంతమంది డ్రైవర్ల డ్యూటీలను నిలిపివేసిందని ఆరోపిస్తూ డ్రైవర్లు ఆకస్మిక సమ్మెకు దిగారు. బాధిత డ్రైవర్లను తిరిగి విధుల్లోకి తీసుకునే వరకు తాము బస్సులను బయటకు తీసేది లేదని స్పష్టం చేశారు. యాజమాన్యం ఏకపక్ష నిర్ణయాల వల్ల తమకు అన్యాయం జరుగుతోందని, ఎలాంటి తప్పు చేయక పోయినా విధులకు దూరం చేయడం సమంజసం కాదని ఆవేదన వ్యక్తం చేశారు. జేబీఎం, సిస్కాన్ మ్యాన్‌పవర్ సంస్థల ప్రతినిధులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని, నిలిపివేసిన డ్రైవర్లకు తిరిగి విధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారమయ్యే వరకు సమ్మె కొనసాగిస్తామని డ్రైవర్లు తేల్చిచెప్పారు.



సమైక్య భారత నిర్మాణంలో పటేల్ పాత్ర అమూల్యం

- జాతీయ ఐక్యత దినోత్సవం సందర్భంగా నివాళులర్పించిన దేవరకొండ మున్సిపల్ చైర్‌పర్సన్ పున్న శైలజ వెంకటేశ్వర్లు

ప్రజానావ, దేవరకొండ : భారతదేశ తొలి ఉప ప్రధానమంత్రి, స్వాతంత్ర్య సమరయోధుడు, భారతరత్న సర్దార్ వల్లభభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకొని దేవరకొండ మున్సిపల్ చైర్‌పర్సన్ పున్న శైలజ వెంకటేశ్వర్లు ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన సర్దార్ పటేల్ దేశంలోని వందలాది సంస్థానాలను ఏకతాటిపైకి తీసుకొచ్చి అఖండ భారతదేశ నిర్మాణానికి విశేష కృషి చేశారని కొనియాడారు. అందుకే ఆయనను ఉక్కుమనిషిగా దేశ ప్రజలు గౌరవించుకుంటున్నారని పేర్కొన్నారు. దేశ ఐక్యత, సమగ్రత, సార్వభౌమత్వాన్ని కాపాడేందుకు ఆయన చేసిన సేవలు ఎప్పటికీ మరువలేనివని తెలిపారు. పటేల్ సేవలను స్మరించుకుంటూ నిర్వహించే జాతీయ ఐక్యత దినోత్సవం సందర్భంగా దేశ సమైక్యతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. భిన్నత్వంలో ఏకత్వమే భారతదేశ ప్రత్యేకత అని, ఆ స్ఫూర్తిని భావితరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రామదుర్గా రెడ్డి, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఖమ్మంలో 286 మంది పోలీసులతో తనిఖీలు

- టేకులపల్లి కేసీఆర్ టవర్ పరిసరాల్లో విస్తృత సోదా
- 62 ద్విచక్ర వాహనాలు, ఐదు ఆటోలు స్వాధీనం
- గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు, వినియోగిస్తున్న 12 మంది గుర్తింపు



ప్రజానావ, ఖమ్మం : ఖమ్మం నగరంలోని టేకులపల్లి కేసీఆర్ టవర్ ప్రాంతంలో గంజాయి వినియోగం, అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయనే విశ్వసనీయ సమాచారంతో పోలీసులు భారీ స్థాయిలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఖమ్మం డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో సీఏఆర్ ఫోర్స్, టాస్క్‌ఫోర్స్, స్పెషల్ బ్రాంచ్, సెంట్రల్ క్రైమ్ స్టేషన్, ఈగల్ ఫోర్స్, క్లూస్ టీమ్ విభాగాలకు చెందిన మొత్తం 286 మంది పోలీస్ అధికారులు, సిబ్బంది ఈ తనిఖీల్లో పాల్గొన్నారు. సోదాలతో పాటు కమ్యూనిటీ కనెక్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాంతంలోని 52 బ్లాకుల్లో ప్రతి ఇంటిని క్షుణ్ణంగా తనిఖీ చేసి అనుమానాస్పద వ్యక్తుల వివరాలను సేకరించారు. సరైన ధ్రువపత్రాలు లేని 62 ద్విచక్ర వాహనాలు, ఐదు ఆటోలను స్వాధీనం చేసుకొని స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అదేవిధంగా 105 మంది వేలిముద్రలను సేకరించి పరిశీలించారు. ఈ తనిఖీల్లో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని, గంజాయి సేవిస్తున్న 12 మందిని గుర్తించడంతో పాటు 50 గ్రాముల పొడి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురు దొంగతనం నిందితులు, ఇద్దరు అనుమానితులను కూడా గుర్తించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ నగరంలోని ప్రాంతాలను నేరరహిత ప్రాంతాలుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో పోలీస్ యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. స్థానికుల విజ్ఞప్తి మేరకు ఈ ప్రాంతంలో పోలీస్ గస్తీని మరింత ముమ్మరం చేస్తామని, బెల్ట్ షాపులపై ఎక్సైజ్ శాఖతో సమన్వయం చేసుకొని చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ముఖ్యంగా యువత చెడు అలవాట్లకు బానిసలై జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. కుటుంబం, పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కోరారు. గంజాయి విక్రయదారుల సమాచారం పోలీసులకు అందించి గంజాయి రహిత సమాజ నిర్మాణంలో ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. స్వీయ రక్షణ కోసం ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, వీటి ద్వారా అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయవచ్చని తెలిపారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు స్థానికులు స్వచ్ఛందంగా ముందుకు రావాలని సూచించారు. నేరస్తుల కదలికలపై నిరంతరం నిఘా ఉంటుందని, ప్రజలు ఎలాంటి గొడవలకు వెళ్లకుండా ప్రశాంత వాతావరణంలో జీవించాలని కోరారు. అక్రమ సంపాదనకు అలవాటుపడి మోసాలకు పాల్పడే వ్యక్తుల మాటలు నమ్మి మోసపోవద్దని హెచ్చరించారు. ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, బ్యాంకు ఖాతా వివరాలు, ఇతర వ్యక్తిగత సమాచారాన్ని అడుగుతూ వచ్చే ఫోన్ కాల్స్, ఈమెయిల్స్‌కు స్పందించవద్దని సూచించారు. అపరిచిత వ్యక్తుల కదలికలపై నిఘా ఉంచాలని, ఎవరైనా అనుమానాస్పదంగా సంచరిస్తే స్థానిక పోలీసులకు లేదా డయల్ 112కు సమాచారం అందించాలని తెలిపారు. ఇళ్లను అద్దెకు ఇచ్చే సమయంలో అద్దెకు వచ్చే వారి చిరునామా, ఆధార్ కార్డులను పరిశీలించిన తర్వాతే ఇవ్వాలని సూచించారు. ఇలాంటి ఆకస్మిక తనిఖీలు నేరస్తులను గుర్తించడంతో పాటు నేరాల నియంత్రణకు దోహదపడతాయని పేర్కొన్నారు. పోలీస్ పెట్రోలింగ్ వాహనాలు, బ్లూకోల్ట్స్ సిబ్బంది ఆయా ప్రాంతాల పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ పాత నేరస్తుల సమాచారాన్ని సేకరిస్తారని తెలిపారు. ప్రజల్లో ఎలాంటి అభద్రతాభావం లేకుండా ఇలాంటి తనిఖీలు నిరంతరం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ రామానుజం, ఏసీపీలు రమణమూర్తి, ఎస్బీ ఏసీపీ మహేష్, సైబర్ క్రైమ్ ఏసీపీ ఫణీందర్, సీసీఎస్ ఏసీపీ సర్వర్, సీఐలు సాదిక్ పాషా, చిట్టిబాబు, కరుణాకర్, శివప్రసాద్, నాగరాజు, ఆర్ఐలు కామరాజు, శ్రీశైలం, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

బాలబాలికలకు చట్టాలపై అవగాహన అవసరం

- విద్యార్థుల రక్షణే సురక్షిత్ బచ్పన్ అభియాన్ లక్ష్యం
- మంచి స్పర్శ, చెడు స్పర్శను గుర్తించా
- సీనియర్ సివిల్ జడ్జి ముదిగొండ రాజు



ప్రజానావ, కల్వకుర్తి : విద్యార్థి దశ నుంచే బాలబాలికలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని కల్వకుర్తి సీనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ముదిగొండ రాజు సూచించారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సురక్షిత్ బచ్పన్ అభియాన్‌లో భాగంగా కల్వకుర్తిలోని కృష్ణవేణి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జడ్జి ముదిగొండ రాజు మాట్లాడుతూ విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పిం చడంతో పాటు వారికి సురక్షితమైన, ప్రశాంతమైన వాతావరణాన్ని కల్పించి రక్షించడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని వివరించారు. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రతతో పాటు తమ వ్యక్తిగత భద్రతపైనా అవగాహన కలిగి ఉండాలని సూచించారు. మంచి స్పర్శ, చెడు స్పర్శ మధ్య తేడాను గుర్తించాలని, ఎవరైనా అసభ్యంగా లేదా అనుమానాస్పదంగా ప్రవర్తిస్తే వెంటనే తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు తెలియజేయాలని చెప్పారు. బాలబాలికల పట్ల ఎవరైనా అనుచితంగా ప్రవర్తిస్తే పోక్సో చట్టం–2012 ప్రకారం కేసులు నమోదు చేసి చర్యలు తీసుకునే అవకాశం ఉందని వివరించారు. తల్లిదండ్రులు చిన్నారులకు మొబైల్ ఫోన్లు ఇచ్చే విషయంలో తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. మొబైల్ ఆటలకు అలవాటు పడటం వల్ల విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురయ్యే ప్రమాదం ఉందని, క్రమంగా ఫోన్లకు బానిసలయ్యే అవకాశం ఉంటుందని హెచ్చరించారు. అంతేకాకుండా సైబర్ నేరగాళ్లు మొబైల్ ఫోన్లలోని వ్యక్తిగత సమాచారం, ఆర్థిక వివరాలను దుర్వినియోగం చేసే ప్రమాదం ఉందని తెలిపారు. ప్రతి ఒక్కరికీ చట్టాలపై అవగాహన ఉండటం బాధ్యత అని, దేశ భవిష్యత్తు విద్యార్థుల చేతుల్లోనే ఉందని పేర్కొన్నారు. చిన్నారులను అన్ని విధాలుగా రక్షించుకోవాల్సిన బాధ్యత సమాజంలోని ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సురేందర్ రెడ్డి, ప్యానెల్ న్యాయవాదులు పి. శివకుమార్, బి. మల్లేష్ యాదవ్, బి. ప్రశాంత్, కోర్టు సిబ్బంది కీర్తి, ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

పంచాయతీ వాటర్ ట్యాంకర్లు ప్రైవేటు పనులకు!

- ప్రజల దాహం తీర్చాల్సిన వాహనాలు వ్యక్తిగత అవసరాలకు వినియోగిస్తున్నారనే ఆరోపణలు
- దౌల్తాబాద్, పన్యాలలో విచారణకు గ్రామస్థుల డిమాండ్



ప్రజానావ, సంగారెడ్డి : గ్రామాల్లో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ఇంటింటికీ మంచినీటిని సరఫరా చేయాల్సిన గ్రామపంచాయతీ వాటర్ ట్యాంకర్లు ప్రైవేటు పనులకు వినియోగిస్తున్నారనే ఆరోపణలు సంగారెడ్డి జిల్లాలో చర్చనీయాంశంగా మారాయి. ప్రజల అవసరాల కోసం ప్రభుత్వ నిధులతో నిర్వహిస్తున్న వాహనాలను కొందరు వ్యక్తిగత అవసరాలకు ఉపయోగించుకుంటున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజల దాహం తీర్చాల్సిన ట్యాంకర్లతో ప్రైవేటు నిర్మాణాలు, వ్యవసాయ భూములకు నీటిని తరలిస్తున్నారని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. హత్నూర మండల పరిధిలోని దౌల్తాబాద్ గ్రామంలో ఓ కాంట్రాక్టర్ తన వ్యక్తిగత నిర్మాణ పనుల కోసం గ్రామపంచాయతీకి చెందిన వాటర్ ట్యాంకర్‌ను వినియోగిస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నా రు. గ్రామ ప్రజలకు తాగునీటిని సరఫరా చేయాల్సిన ప్రభుత్వ వాహనాన్ని వ్యక్తిగత నిర్మాణ పనులకు ఎలా ఉపయోగిస్తారని ప్రశ్నిస్తున్నారు. ఇదే మండలంలోని పన్యాల గ్రామంలోనూ ఇలాంటి వ్యవహారమే వెలు గులోకి వచ్చిందని గ్రామస్థులు చెబుతున్నా రు. హైదరాబాద్‌కు చెందిన ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి తన సొంత పొలం అవసరాల కోసం గ్రామపంచాయతీ వాటర్ ట్యాంకర్‌ను వినియోగిస్తున్నట్లు ఆరోపిస్తు న్నారు. ప్రజలకు ఉపయోగపడాల్సిన ప్రభుత్వ వాహనాలు వ్యక్తిగత పనులకు పరిమితం కావడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లో వేసవిలోనే కాకుండా సాధారణ రోజుల్లోనూ ప్రజలకు తాగునీటి అవసరాలు ఉంటాయి. కొన్ని ప్రాంతాల్లో నీటి సరఫరా సక్రమంగా లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో గ్రామపంచాయతీ ట్యాంకర్లను ప్రైవేటు పనులకు వినియోగిస్తే ప్రజలకు నీటి సరఫరా ఎలా అందుతుందని స్థానికు లు నిలదీస్తున్నారు. ప్రభుత్వ వాహనాలకు వినియోగించే డీజిల్, నిర్వహణ ఖర్చులను ప్రజాధనంతోనే భరిస్తున్నప్పుడు వాటిని వ్యక్తిగత అవసరాలకు ఉపయోగించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు. ఈ వ్యవహారంపై సంబంధిత గ్రామపంచాయతీ కార్యదర్శులను వివరణ కోరగా, తమకు ఈ విషయం గురించి తెలియదని సమాధానమిస్తూ తప్పించుకునే ప్రయత్నం చేసినట్లు సమాచారం. గ్రామపంచాయతీ వాహనాలు ఎక్కడికి వెళ్తున్నాయి? ఎవరి ఆదేశాలతో నీటిని సరఫరా చేస్తున్నాయి? ఏ అవసరాల కోసం ట్యాంకర్లను వినియోగిస్తున్నారు? అనే అంశాలపై పర్యవేక్షణ చేయాల్సిన బాధ్యత అధికారులపై లేదా అని గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ వనరుల దుర్వినియోగంపై ఆరోపణలు వస్తున్నా సంబంధిత అధికారులు ఎందుకు స్పందించడం లేదని నిలదీస్తున్నారు.

విచారణ చేపట్టాలంటూ గ్రామస్థుల డిమాండ్

దౌల్తాబాద్, పన్యాల గ్రామాల్లో గ్రామపంచాయతీ వాటర్ ట్యాంకర్ల వినియో గంపై ఉన్నతాధికారులు తక్షణమే విచారణ చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటివరకు ట్యాంకర్లు ఎవరికి, ఎప్పుడు, ఏ అవసరాల కోసం నీటిని సరఫరా చేశా యో పూర్తి వివరాలను పరిశీలించాలని కోరు తున్నారు. ప్రభుత్వ వాహనాలను వ్యక్తిగత పనులకు వినియోగించినట్లు విచారణలో తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకో వాలని విజ్ఞప్తి చేస్తున్నారు. భవిష్యత్తులో గ్రామపంచాయతీ వనరులు దుర్వినియోగం కాకుండా పర్యవేక్షణను మరింత పటిష్ఠం చేయాలని కోరుతున్నారు. ప్రజల దాహం తీర్చాల్సిన వాటర్ ట్యాంకర్లు ప్రైవేటు అవసరాలకు ఉపయోగపడుతున్నా యనే ఆరోపణలపై అధికారులు ఎలా స్పందిస్తారో వేచి చూడాలి. గ్రామపంచా యతీ వనరులు ప్రజల కోసమా? లేక పలుకుబడి ఉన్న వ్యక్తుల వ్యక్తిగత ప్రయోజనాల కోసమా? అన్న ప్రశ్నలకు సంబంధిత అధికారులు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది.

ఇందిరాగాంధీ సేవలు చిరస్మరణీయం

ప్రజానావ, మక్తల్ : భారత మాజీ ప్రధాన మంత్రి, ఉక్కు మహిళ ఇందిరాగాంధీ వర్ధంతిని పురస్కరించుకొని మక్తల్ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నాయకులు ఘనంగా నివాళులర్పించారు. రాష్ట్ర మంత్రి డా. వాకిటి శ్రీహరి ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమానికి మక్తల్ మున్సిపల్ చైర్‌పర్సన్ వాకిటి మానస హనుమంతు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాసులు గౌడ్, మాజీ ఉపసర్పంచ్, పార్టీ సీనియర్ నాయకుడు కట్టా సురేష్ కుమార్ గుప్తా, ఏఎంసీ వైస్ చైర్మన్ బి. గణేష్ కుమార్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కావలి తాయప్ప ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం నాయకు లు మాట్లాడుతూ దేశాభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం ఇందిరాగాంధీ అందించిన సేవలు చిరస్మరణీ యమని కొనియాడారు. దేశ ఐక్యత, సమగ్రతను కాపాడటంలో ఆమె చూపిన చొరవ, ధైర్యసాహ సాలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నా రు. దేశ ప్రధానిగా ఆమె తీసుకున్న నిర్ణయాలు, ప్రజా సంక్షే మం కోసం చేసిన కృషిని ఈ సందర్భంగా గుర్తుచేసు కున్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇందిరాగాంధీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయ కులు, కౌన్సిలర్ వెంకటేష్, నీల గౌడ్, ఆర్‌ఎంపీ శంక ర్, ఏఎంసీ డైరెక్టర్ ఫయాజ్, కావలి ఆంజనేయులు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు చందర్, గార్లపల్లి అశోక్ గౌడ్, వడ్డె బాలరాజ్ పాల్గొని నివాళులర్పించారు.

దేశ ఐక్యతకు పటేల్ సేవలు చిరస్మరణీయం

పోలీస్ సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించిన ఎస్పీ శరత్ చంద్ర పవార్



ప్రజానావ, నల్లగొండ : స్వాతంత్ర్య సమరయోధుడు, భారతదేశ తొలి ఉప ప్రధానమంత్రి, ఉక్కుమనిషి సర్దార్ వల్లభభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకొని నల్లగొండ జిల్లా పోలీస్ కార్యాలయంలో జాతీయ ఐక్యత దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఐపీఎస్ సర్దార్ వల్లభభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పోలీస్ అధికారులు, సిబ్బందితో కలిసి జాతీయ ఐక్యత ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య పోరాటంలో కీలక పాత్ర పోషించిన సర్దార్ వల్లభభాయ్ పటేల్ స్వాతంత్ర్యం అనంతరం దేశంలోని అనేక సంస్థానాలను ఏకం చేసి బలమైన, సమైక్య భారతదేశ నిర్మాణానికి విశేష కృషి చేశారని కొనియాడారు. ఆయన దృఢ సంకల్పం, నాయకత్వ లక్షణాలు, దేశం పట్ల అచంచలమైన నిబద్ధత నేటి తరానికి ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. భిన్నత్వంలో ఏకత్వాన్ని కాపాడుతూ ప్రజల్లో జాతీయ సమైక్యతా భావాన్ని పెంపొందించేందుకు ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. దేశ ఐక్యత, సమగ్రత, సార్వభౌమత్వం, భద్రతను కాపాడటం ప్రతి పౌరుడి ప్రాథమిక బాధ్యత అని స్పష్టం చేశారు. కుల, మత, ప్రాంత, భాషా భేదాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ సోదరభావంతో మెలగాలని, దేశాభివృద్ధి, శాంతిభద్రతలు, సామాజిక సామరస్య పరిరక్షణకు తమవంతు సహకారం అందించాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా పోలీస్ శాఖలో పనిచేసే ప్రతి ఒక్కరూ ప్రజల భద్రతతో పాటు దేశ అంతర్గత భద్రత పరిరక్షణలో నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విధి నిర్వహణలో అంకితభావం, క్రమశిక్షణ, నిబద్ధతతో పనిచేయాలని తెలిపారు. సర్దార్ పటేల్ ఆశయాలు, ఆదర్శాలను స్ఫూర్తిగా తీసుకొని దేశ సమైక్యతను మరింత బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, జాతీయ ఐక్యత సందేశాన్ని సమాజంలోని అన్ని వర్గాలకు చేరవేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ రమేష్, ఏవో శివప్రసాద్, ఎస్బీ డీఎస్పీ మల్లారెడ్డి, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, సీఐలు, ఆర్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



పట్టభద్రుల ఓటరు నమోదును వేగవంతం చేయాలి

- మక్తల్ నియోజకవర్గంలో పదివేల మందికిపైగా నమోదు చేయించాలి
- బీజేపీ కార్యకర్తలకు డా. బంగ్ల లక్ష్మీకాంత్‌రెడ్డి పిలుపు

ప్రజానావ, మక్తల్ : అర్హులైన ప్రతి పట్టభద్రుడికి ఆన్‌లైన్ ద్వారా ఓటు హక్కు కల్పించేలా బీజేపీ కార్యకర్తలు కృషి చేయాలని మక్తల్ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జి డా. బంగ్ల లక్ష్మీ కాంత్ రెడ్డి పిలుపునిచ్చారు. అమరచింత పట్టణ కేంద్రంలో బీజేపీ పట్టణ అధ్యక్షురాలు డా. మంగా లావణ్య అంజన్ అధ్యక్షతన నిర్వహించిన ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మక్తల్ నియోజకవర్గ పరిధిలోని ఏడు మండలాల నుంచి పదివేల మందికి పైగా పట్టభద్రుల ఓటరు నమోదును పూర్తి చేసేలా ప్రతి బీజేపీ కార్యకర్త బాధ్యతగా పనిచేయాలని సూచించారు. అర్హులైన పట్టభద్రులందరికీ ఓటు హక్కు కల్పించేందుకు విస్తృతంగా ప్రచారం చేయాలని కోరారు. అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజాపాలన పేరుతో మాటలకే పరిమితమవుతోందని ఆరోపించారు. ఈవీఎంలకు బదులుగా బ్యాలెట్ పత్రాలతో ఎన్నికలు నిర్వహిస్తే తామే గెలుస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటమి చవిచూసిందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీ దూకుడు వైఖరికి విద్యావంతులు, ఉపాధ్యాయులు తమ ఓటుతో గట్టి సమాధానం చెప్పారని వ్యాఖ్యానించారు. అనంతరం ఆత్మకూరు పట్టణంలోని కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ సభ్యులను కలిసి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదులో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘ్ పరివార్ జిల్లా నాయకుడు లక్ష్మీ నారాయణ, ఎమ్మెల్సీ ఎన్నికల సహ ఇన్‌చార్జి జిందే జ్యోతి శ్రీనివాస్, చేనేత కార్మిక సంఘం అధ్యక్షుడు తిరుమల్ రఘురామ్, ఉపాధ్యక్షుడు ఒగ్గు వెంకటేష్, బీజేపీ రాష్ట్ర నాయకులు నరాల నారాయణ, మరాఠి అశోక్, కౌన్సిలర్లు వేద విష్ణు, పారుపల్లి ఉసన్న, మాజీ అధ్యక్షుడు విజయ్ యాదవ్, నర్వ మండల బీజేపీ అధ్యక్షుడు అజిత్ సింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి విజయ్ రామ్, బీజేవైఎం జిల్లా కార్యదర్శి సాయి, మండల ఉపాధ్యక్షులు భీంసేన్, వెంకటేశ్వర్లు, ఆత్మకూరు పట్టణ, గ్రామీణ అధ్యక్షులు మండ్ల సురేష్, అశోక్ భూపాల్, జిల్లా నాయకులు ఆనంద్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి

- చీమలగడ్డ కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన ప్రభుత్వ విప్ వేముల వీరేశం
- రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులకు ఆదేశం

ప్రజానావ, నకిరేకల్ : అకాల వర్షాలతో తడిసిన వరి ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి రైతులకు న్యాయం చేయాలని ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అధికారులను ఆదేశించారు. నకిరేకల్ పట్టణంలోని చీమలగడ్డ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించి వర్షానికి తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రంలో ఎదురవుతున్న సమస్యలను రైతులను అడిగి తెలుసుకున్నారు. వర్షాల కారణంగా ధాన్యం తడిసిపోవడంతో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకొని, వారికి భరోసా కల్పించారు. రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయడంలో ఎలాంటి జాప్యం చేయకూడదని, తడిసిన ధాన్యాన్ని కూడా నిబంధనల ప్రకారం వెంటనే కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారు లకు సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, సంబంధిత అధికారులు, రైతులు పాల్గొన్నారు.



కొమ్ముకుంట తండాలో వందమంది కాంగ్రెస్‌లో చేరిక

- రూ.2.60 కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం
- డా. కూచుకుళ్ల రాజేష్ రెడ్డి సమక్షంలో పార్టీ కండువాలు కప్పుకున్న బీఆర్ఎస్ కార్యకర్తలు

ప్రజానావ, నాగర్‌కర్నూల్ : తాడూరు మండలంలోని కొమ్ముకుంట తాండలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన సుమారు వందమంది కార్యకర్తలు డా. కూచుకుళ్ల రాజేష్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో తమ గ్రామంలోని రహదారి సమస్యను పట్టించుకోలేదని, అభివృద్ధి పనులు కూడా ఆశించిన స్థాయిలో జరగలేదని పార్టీలో చేరిన కార్యకర్తలు అసంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామాభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తున్న కాంగ్రెస్ పార్టీ విధానాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు తెలిపారు. ఇదే క్రమంలో కొమ్ముకుంట తాండ ప్రజల చిరకాల రహదారి సమస్య పరిష్కారానికి మరో ముందడుగు పడింది. గ్రామానికి రవాణా సౌకర్యం మెరుగుపరిచే లక్ష్యంతో రూ.2 కోట్ల 60 లక్షల వ్యయంతో చేపట్టనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులను డా. కూచుకుళ్ల రాజేష్ రెడ్డి ప్రారంభించారు. ఎన్నో ఏళ్లుగా రహదారి సౌకర్యం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న గ్రామ ప్రజలకు ఈ పనులతో ఊరట లభించనుంది. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సర్పంచ్ రమేష్, మాజీ డిప్యూటీ సర్పంచ్ రాజు నాయక్, సోమలా నాయక్, లక్ష్మణ్ నాయక్, దీప్లా నాయక్, వార్డు సభ్యుడు మోతియా నాయక్, శంకర్ నాయక్, మంజు నాయక్ తదితరులు పాల్గొన్నారు. యువ నాయకులు సురేష్, భాను నాయక్, శివ రాథోడ్, శ్రీకాంత్, రాము, సురేష్, రాజేష్, వినోద్, మహేష్, శివ, మహేష్‌బాబు, తారాసింగ్, చందర్, జగదీష్‌తో పాటు గ్రామ మహిళలు, యువత, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు హాజరయ్యారు.





ఘనంగా ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

ప్రజానావ, సిరిసిల్ల : 1920 అక్టోబర్ 31 న లాలా లజపతి రాయ్ అధ్యక్షతన ఆవిర్భావం జరిగిన నాటినుండి బ్రిటిష్ వారితో సైతం పోరాడి కార్మికుల హక్కుల కోసం ఏఐటియుసి పోరాటం చేస్తున్నదని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు వెల్లడించారు. శనివారం రాజన్న సిరిసిల్ల జిల్లా ఏఐటీయూసీ కార్మిక భవన్ శుభాష్ నగర్ లో ఏఐటీయూసీ 107 వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు అజ్జ వేణు ఏఐటీయూసీ జెండాను ఎగురవేసి, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి. రాములు గారితో కలిసి సమావేశం లో మాట్లాడారు. స్వేచ్ఛ, లింగ వివక్ష లేని వేతనం కోసం, సెలవులు, సంగం పెట్టుకొనే హక్కు, కనీసవేతన హక్కు, వేతనాల చెల్లింపు హక్కు, ఉద్యోగ భద్రత హక్కు ఈనాడు 44 కార్మిక చట్టాలు ఉంటే అందులో నుండి 29 కార్మిక చట్టాలను 4 కోడ్ లుగా విభజించి కేంద్ర బీజేపీ ప్రభుత్వం కార్మిక ద్రోహానికి పాల్పడుతున్నాడన్నారు. కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా చట్టాలు మార్చడం జరిగింది. సమ్మె చేసే హక్కు, సంగం పెట్టుకునే హక్కు, కనీస వేతనాల చట్టం లాంటివి లేకుండా చేసే ప్రయత్నాలు చేస్తున్నారు, కాంట్రాక్ట్ అని ఔట్ సోర్సింగ్ అని నానా రకాల దోపిడీ పేర్లత ఈ ప్రజాస్వామ్య దేశంలో ఓటు వేసి గెలిపించిన నాయకులు ప్రజలను దోపిడీ చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమం లో తన్నీరు రామస్వామి, పండుగ చంద్రయ్య, డప్పు స్వామి, మాన్వాడ పరమేశ్వర్, అలుగొండ ఎల్లయ్య, కొంక విజయ్, అన్నమనేని భూదన్న, చీకోటి రాజు, నీరటి బాలయ్య, తాటకార్ల శంకర్, కొత్తపెల్లి రవిచారి తదితరులు పాల్గొన్నారు.

భీమేశ్వర స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్



ప్రజానావ, వేములవాడ : వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామివారిని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ శనివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు, వేద పండితులు ఆయనకు ఘన స్వాగతం పలికి వేదాశీర్వచనం అందజేశారు. అనంతరం ఆలయ డీఈఓ ప్రతాప నవీన్ కుమార్ శేషవస్త్రం, పీఆర్వో పెరిక శ్రీనివాస్ లడ్డూ ప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.

ఢిల్లీ నిరసనకు బయలుదేరిన వేములవాడ కాంగ్రెస్ నేతలు



ప్రజానావ, వేములవాడ : కాంగ్రెస్ అధిష్టానం పిలుపు మేరకు, ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆదేశాలతో నవంబర్ 1న ఢిల్లీలో నిర్వహించనున్న నిరసన కార్యక్రమంలో పాల్గొనేందుకు వేములవాడ మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు నేతృత్వంలో కాంగ్రెస్ నాయకులు, మున్సిపల్ కౌన్సిలర్లు శుక్రవారం ఢిల్లీకి బయలుదేరారు. కేంద్ర ప్రభుత్వ వైఖరిపై నిరసన తెలుపుతూ, ప్రజా సమస్యలు, హక్కుల పరిరక్షణ కోసం ఢిల్లీ వేదికగా గళమెత్తనున్నట్లు పుల్కం రాజు తెలిపారు.

అక్రమాలపై పోలీసుల ఉక్కుపాదం.. ఆపరేషన్ చబుత్రా

- బెల్ట్ షాపులపై మూడు కేసులు..
- మూడు డీజే సౌండ్ సిస్టమ్‌లు సీజ్
- డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 15 మందిపై కేసులు
- బహిరంగంగా మద్యం సేవించిన వారిపైనా చర్యలు
- సిరిసిల్లలో డీఎస్పీ నాగేంద్రచారి ఆధ్వర్యంలో విస్తృత తనిఖీలు



ప్రజానావ, సిరిసిల్ల : అక్రమ కార్యకలాపాల నియంత్రణ, ప్రజా శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యంగా పోలీసులు ఆపరేషన్ చబుత్రా నిర్వహించారు. ప్రజాభద్రతకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని సిరిసిల్ల డీఎస్పీ కె. నాగేంద్రచారి హెచ్చరించారు. శనివారం సిరిసిల్ల పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో డీఎస్పీ నాగేంద్రచారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఆపరేషన్‌లో డాగ్ స్క్వాడ్ సహాయంతో అనుమానిత ప్రాంతాల్లోని ఇళ్లను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనుమానితులకు గంజాయి గుర్తింపు కిట్లతో పరీక్షలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో నిబంధనలకు విరుద్ధంగా బెల్ట్ షాపులు నిర్వహిస్తున్న ముగ్గురిపై మూడు కేసులు నమోదు చేసి మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపిన 15 మందిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేయగా, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించిన వారిపై ఐదు కేసులు నమోదు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా వినియోగిస్తున్న మూడు డీజే సౌండ్ సిస్టమ్‌లను సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అలాగే మద్యం మత్తులో నిర్లక్ష్యంగా, ప్రమాదకరంగా వాహనాలు నడిపిన రెండు బోర్‌వెల్ లారీలు, ఒక కారుపై కేసులు నమోదు చేశారు. అక్రమ కార్యకలాపాల నియంత్రణకు పోలీసుల తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని డీఎస్పీ స్పష్టం చేశారు. ఈ ఆపరేషన్‌లో సీఐలు శ్రీనివాస్, నాగేశ్వరరావు, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికుల హక్కులను కాలరాస్తున్న కేంద్రం

- నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి
- కనీస వేతనం రూ.26 వేలకు పెంచాలి
- ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ డిమాండ్



ప్రజానావ, కాగజ్‌నగర్ : కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా వ్యవహరిస్తూ కార్మికులు పోరాటాల ద్వారా సాధించుకున్న హక్కులను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కాలరాస్తోందని ఏఐటీయూసీ కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ విమర్శించారు. కార్మికుల ప్రయోజనాలను దెబ్బతీసే విధానాలను కేంద్ర ప్రభుత్వం వెంటనే విడనాడాలని డిమాండ్ చేశారు. కాగజ్‌నగర్‌లోని ఎంఎల్ఎస్ గోదాంలో నిర్వహించిన ఏఐటీయూసీ 107వ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని యూనియన్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉపేందర్ మాట్లాడుతూ 1920 లో ఆవిర్భవించిన ఏఐటీయూసీ దేశంలో కార్మిక ఉద్యమానికి బలమైన పునాది వేసిందని, సంపూర్ణ స్వాతంత్ర్యం కోసం కూడా పోరాటం చేసిన తొలి కార్మిక సంఘంగా చరిత్రలో నిలిచిందని గుర్తుచేశారు. కార్మికుల హక్కులు, సంక్షేమం, న్యాయమైన వేతనాల సాధన కోసం సంఘం అనేక ఉద్యమాలు నిర్వహించిందన్నారు. కార్మికుల ప్రయోజనాలకు విఘాతం కలిగించే నాలుగు లేబర్ కోడ్‌లను కేంద్ర ప్రభుత్వం వెంటనే రద్దు చేసి, గతంలో అమల్లో ఉన్న 44 కార్మిక చట్టాలను యథాతథంగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని, కనీస వేతనాన్ని రూ.26 వేలకు పెంచి అమలు చేయాలని కోరారు. ఎనిమిది గంటల పని విధానాన్ని పకడ్బందీగా అమలు చేయడంతో పాటు పీఎఫ్, ఈఎస్ఐ, గ్రాట్యుటీపై ఉన్న పరిమితులను తొలగించాలని సూచించారు. కనీస పెన్షన్‌ను రూ.10 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. సింగరేణి సంస్థకు కొత్త బొగ్గు బావులను కేటాయించాలని, ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని కోరారు. ఎస్పీఎంలో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు నిర్వహించి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, పౌరసరఫరాల శాఖ హమాలీ కార్మికులను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని అన్నారు. జాతీయ ఆరోగ్య మిషన్ ఉద్యోగులతో ప్రభుత్వం చర్చలు జరిపి వారి సమస్యలను పరిష్కరించా లని కోరారు. ఆటో, హమాలీ తదితర అసంఘటిత రంగ కార్మికుల సంక్షేమం కోసం ప్రత్యేక బోర్డులు ఏర్పాటు చేసి అమలు చేయాలని, గ్రామపంచాయతీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. బహుళ ప్రయోజన విధానాన్ని రద్దు చేసి జీవో నంబర్ 60 ప్రకారం వేతనాలు చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్మికుల హక్కుల పరిరక్షణకు సంఘటితంగా పోరాటాలు కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా నాయకులు సత్యనారాయణ, కుమార్, సురేష్, రాజు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



అందుబాటులో ఉండి.. సేవలు అందించాలి

జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

ప్రజానావ, సిరిసిల్ల : తహసీల్దార్ కార్యాలయ అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండాలని.. సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ఎల్లారెడ్డిపేట మండల తహసీల్దార్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా అధికారులు, సిబ్బంది హాజరు రిజిస్టర్, రిజిస్ట్రేషన్ల ప్రక్రియను పరిశీలించారు. సేవలపై ఆరా తీశారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. కుల, ఆదాయం, నివాసం ఇతర ధృవీకరణ పత్రాల కోసం, రిజిస్ట్రేషన్ల కోసం వచ్చే అర్జీదారులకు అందుబాటులో ఉండి.. సేవలు అందించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి.. పకడ్బందీగా పనులు చేపట్టాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు.



ఓటు హక్కును హరించే ఎస్ఐఆర్‌ను నిలిపివేయాలి

- ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి
- గాంధీ విగ్రహం ఎదుట ఏఐఎస్ఎఫ్ నిరసన

ప్రజానావ, నిర్మల్ : అర్హులైన పౌరుల ఓటు హక్కును కాలరాసే ప్రమాదం ఉన్న ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) నిర్మల్ జిల్లా సమితి డిమాండ్ చేసింది. ఈ ప్రక్రియను పర్యవేక్షించడంలో ఎన్నికల సంఘం విఫలమైందని ఆరోపిస్తూ ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని కోరింది. ఈ మేరకు నిర్మల్‌లోని గాంధీ పార్కులో మహాత్మా గాంధీ విగ్రహం ఎదుట ఏఐఎస్ఎఫ్ జిల్లా సమితి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి కైలాష్ మాట్లాడుతూ ఓటు హక్కు అనేది భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి కల్పించిన ప్రాథమిక ప్రజాస్వామ్య హక్కు అని పేర్కొన్నారు. ఓటరు జాబితాల సవరణ పేరుతో అర్హులైన ఓటర్ల పేర్లను తొలగించే ప్రమాదం ఉందని, దీనివల్ల ప్రజల్లో తీవ్ర ఆందోళన నెలకొందని అన్నారు. ఓటరు జాబితాల సవరణ ప్రక్రియలో ఒక్క అర్హుడైన పౌరుడు కూడా తన ఓటు హక్కును కోల్పోకూడదని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతి ఓటుకు విలువ ఉంటుందని, ఓటు హక్కును పరిరక్షించాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందని గుర్తుచేశారు. ఎలాంటి పారదర్శకత లోపాలు లేకుండా, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఓటరు జాబితాల సవరణ చేపట్టాలని డిమాండ్ చేశారు. అర్హులైన ఓటర్ల పేర్ల తొలగింపునకు దారితీసే చర్యలను తక్షణమే నిలిపివేసి, ఎస్ఐఆర్ ప్రక్రియపై పునరాలోచన చేయాలని కోరారు. ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణలో విఫలమైన ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఓటు హక్కును కాపాడుకునేందుకు విద్యార్థి సమాజం, ప్రజాస్వామ్యవాదులు, ప్రజలు ఐక్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు అస్లం, నాయకులు వినేష్, అఖిల్, సిద్ధు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్, ఎస్పీలకు తెలుగు ఫోక్ అసోసియేషన్ ఆహ్వానం

నవంబర్ 3న జరిగే వేడుకలకు ఆహ్వాన పత్రికలు అందజేత

ప్రజానావ సిరిసిల్ల : నవంబర్ 3న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో జరిగే తెలుగు ఫోక్ అసోసియేషన్ ఆవిర్భావ వేడుకలకు హాజరు కావాలని జిల్లా కలెక్టర్ గరిమా అగర్వాల్, జిల్లాఎస్పీ మహేష్ బీ గీతేలకు ఆహ్వాన పత్రికను తెలంగాణ ఫోక్ ఇండస్ట్రీ ప్రతినిధులు అందజేశారు. శనివారం తెలంగాణ ఫోక్ ఇండస్ట్రీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రోగ్రాం ఇన్చార్జి ఎండి సత్తార్ లు మర్యాదపూర్వకంగా కలిసి నవంబర్ 3వ తేదీ మంగళవారం నిర్వహించనున్న తెలుగు ఫోక్ అసోసియేషన్, తెలంగాణ ఫోక్ ఇండస్ట్రీ ఆవిర్భావ వేడుకలకు హాజరుకావాలని నిర్వాహకులు కోరారు. తెలుగు ఫోక్ అసోసియేషన్, తెలంగాణ ఫోక్ ఇండస్ట్రీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ ఆవిర్భావ వేడుకలకు ముఖ్య అతిథులుగా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్, ఎస్పీని కోరారు. ఈ కార్యక్రమంలో ఫోక్ ఇండస్ట్రీ రాష్ట్ర అధ్యక్షుడు పత్తిపాటి రమణాకర్, ఉపాధ్యక్షుడు జి.ఎల్. నాందేవ్, ప్రచార కార్యదర్శి ఆకునూరి దేవయ్య, సభ్యులు ఎడుమల శ్రీధర్ రెడ్డి, మాట్ల తిరుపతి, నక్క శ్రీకాంత్, మ్యూజిక్ డైరెక్టర్లు కాయితోజు ప్రవీణ్, సాంబారి నవీన్, వేముల సతీష్, శ్రీరాముల మహేందర్ తదితరులు పాల్గొన్నారు.





ఒకే రోడ్డుపై రెండుసార్లు పనులు..

నిధుల స్వాహాకు స్కెచ్!

- రెండేళ్ల క్రితమే నిర్మించిన సీసీ రోడ్డుపై మళ్లీ నిర్మాణం
- ఉన్నతాధికారులకు 8వ వార్డు సభ్యుడి ఫిర్యాదు
- విచారణ చేపడతామన్న డీఈ

ప్రజానావ, గూడూరు : ప్రభుత్వ నిధులను ప్రజల అవసరాలకు వినియోగించాల్సిన బాధ్యత కలిగిన కొందరు వాటిని స్వప్రయోజనాలకు మళ్లిస్తున్నారనే ఆరోపణలు గూడూరు మండలంలో కలకలం రేపుతున్నాయి. ఇప్పటికే నిర్మాణం పూర్తయిన సీసీ రోడ్డుపై మరోసారి కొత్త రోడ్డు వేసి, పనులు చేసినట్లుగా రికార్డులు సృష్టించి ప్రభుత్వ నిధులు కాజేసేందుకు ప్రయత్నించారనే ఆరోపణలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. మండల పరిధిలోని ఓ గ్రామంలో సుమారు రెండేళ్ల క్రితం ప్రభుత్వ నిధులతో సిమెంట్ కాంక్రీట్ రోడ్డు నిర్మించారు. అయితే, ఆ రోడ్డు నిర్మాణం పూర్తయి, బిల్లులు మంజూరైనప్పటికీ ఇటీవల అదే రోడ్డుపై మరోసారి సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. గతంలో పూర్తయిన పనులనే తిరిగి చేసినట్లుగా చూపించి పాత బిల్లులతో పాటు కొత్త బిల్లుల రూపంలోనూ నిధులు డ్రా చేసుకునేందుకు కొందరు ప్రయత్నించినట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇందుకోసం ప్రత్యేకంగా తీర్మానాలు చేయించుకుని ప్రభుత్వ నిధులను స్వాహా చేసేందుకు పథకం రచించినట్లు గ్రామంలో ఆరోపణలు వినిపిస్తున్నాయి.

వార్డు సభ్యుడి ఫిర్యాదుతో వెలుగులోకి

గ్రామంలో జరుగుతున్న ఈ వ్యవహారాన్ని గమనించిన అదే గ్రామానికి చెందిన 8వ వార్డు సభ్యుడు అక్రమాలపై మౌనంగా ఉండకుండా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ప్రజాధనాన్ని ఇలా దుర్వినియోగం చేయడాన్ని సహించలేమని, ఒకే రోడ్డుపై రెండుసార్లు పనులు చేసినట్లు చూపించి నిధులు డ్రా చేసుకునే వ్యవహారంపై సమగ్ర విచారణ జరపాలని కోరారు. ఈ అక్రమాల వెనుక స్థానిక నాయకులు, సంబంధిత అధికారుల పాత్ర ఉందనే అనుమానాలు గ్రామస్థుల్లో వ్యక్తమవుతున్నాయి. వార్డు సభ్యుడి ఫిర్యాదుతోనైనా ఉన్నతాధికారులు స్పందించి క్షేత్రస్థాయిలో విచారణ జరిపితే మరిన్ని వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

విచారణ చేపడతాం.. డీఈ

ఈ వ్యవహారంపై సంబంధిత డీఈని వివరణ కోరగా, వార్డు సభ్యుడు తనకు ఫిర్యాదు చేసిన విషయం వాస్తవమేనని తెలిపారు. ఫిర్యాదు మేరకు గ్రామానికి వెళ్లి క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి, అక్రమాలు జరిగినట్లు తేలితే తగిన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

అడవి పందుల దాడి.. రెండెకరాల పత్తి పంట ధ్వంసం

- రూ.80 వేల వరకు పెట్టుబడి పెట్టిన గిరిజన రైతుకు తీవ్ర నష్టం
- అప్పులు తీర్చేదెలా అంటూ కన్నీరుమున్నీరు

ప్రజానావ, ఆసిఫాబాద్ : ఆరుగాలం శ్రమించి సాగు చేసిన పంట చేతికొచ్చే సమయంలో అడవి పందుల గుంపు విరుచుకుపడటంతో గిరిజన రైతుకు తీవ్ర నష్టం వాటిల్లింది. పంట పొలంలోకి చొరబడిన అడవి పందులు పత్తి మొక్కలను తొక్కి ధ్వంసం చేయడంతో రెండెకరాల్లో సాగు చేసిన పంట తీవ్రంగా దెబ్బతింది. అప్పులు చేసి పెట్టిన పెట్టుబడి కళ్లముందే నేలపాలవడంతో బాధిత రైతు కుటుంబం తీవ్ర ఆవేదనలో మునిగిపోయింది. కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా తిర్యాణి మండలం చలిమెల కొలంగూడెం గ్రామానికి చెందిన గిరిజన రైతు టేకం కొండు తనకున్న రెండెకరాల భూమిలో పత్తి పంట సాగు చేశాడు. వ్యవసాయమే జీవనాధారంగా కుటుంబాన్ని పోషించుకుంటున్న ఆయన పంట సాగు కోసం అప్పులు చేసి సుమారు రూ.70 వేల నుంచి రూ.80 వేల వరకు పెట్టుబడి పెట్టాడు. పంట దిగుబడిపై ఎన్నో ఆశలు పెట్టుకుని రేయింబవళ్లు కష్టపడ్డాడు. అయితే పంట చేతికొచ్చే దశలో అడవి పందుల గుంపు పొలంలోకి ప్రవేశించి పత్తి మొక్కలను పూర్తిగా తొక్కి నాశనం చేసింది. దీంతో రెండెకరాల్లో పంట తీవ్రంగా దెబ్బతిని రైతుకు కోలుకోలేని నష్టం కలిగింది.

అప్పుల భారం.. కుటుంబ పోషణ ఎలా?

కళ్లముందే పంట నాశనం కావడంతో రైతు టేకం కొండు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. అప్పులు చేసి పెట్టిన పెట్టుబడి కూడా తిరిగి వచ్చే పరిస్థితి లేదని కన్నీటిపర్యంతమవుతున్నాడు. కుటుంబంలో పిల్లలు ఉన్నారని, పంట నష్టంతో ఇప్పుడు వారిని ఎలా పోషించుకోవాలో అర్థం కావడం లేదని వాపోతున్నాడు. ప్రభుత్వం, అటవీ శాఖ అధికారులు వెంటనే స్పందించి క్షేత్రస్థాయిలో పంట నష్టాన్ని పరిశీలించి తగిన పరిహారం అందించాలని వేడుకుంటున్నాడు.

గిరిజన రైతులకు తప్పని అడవి జంతువుల బెడద

తిర్యాణి అటవీ ప్రాంత పరిసర గ్రామాల్లో అడవి జంతువుల సంచారం రైతులకు తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. పంటలు చేతికొచ్చే సమయంలో అడవి పందులు, ఇతర వన్యప్రాణులు పొలాల్లోకి ప్రవేశించి పంటలను ధ్వంసం చేస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే పెట్టుబడి ఖర్చులు పెరిగిపోవడంతో పాటు ప్రకృతి వైపరీత్యాలు, అడవి జంతువుల దాడులు వ్యవసాయాన్ని భారంగా మారుస్తున్నాయని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పంట నష్టాన్ని అంచనా వేసి బాధిత రైతుకు పరిహారం అందించడంతో పాటు భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన రక్షణ చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.





మిత్రుడి కుటుంబానికి ఆర్థిక భరోసా

- ఆపదలో అండగా నిలిచిన 1996–97 పదో తరగతి బ్యాచ్ స్నేహితులు
- రూ.23,500 ఆర్థిక సాయం అందజేత

ప్రజానావ, స్టేషన్‌ఘన్‌పూర్ : స్నేహం అంటే పాఠశాల రోజులకే పరిమితం కాదని, జీవితంలో ఎదురయ్యే కష్టసుఖాల్లోనూ ఒకరికొకరు అండగా నిలవడమే నిజమైన స్నేహబంధమని స్టేషన్‌ఘన్‌పూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1996–97 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు నిరూపించారు. తమతో కలిసి చదువుకున్న బాల్యమిత్రుడు, స్థానిక ఎస్సీ కాలనీకి చెందిన చింత శ్రీనివాస్ (46) అనారోగ్యంతో అకాల మరణం చెందడంతో మిత్రులంతా తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. భార్య, ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులతో కూడిన కుటుంబానికి పెద్ద దిక్కును కోల్పోవడంతో ఆ కుటుంబం ఆర్థికంగా ఇబ్బందుల్లో పడింది. మిత్రుడి కుటుంబ పరిస్థితిని తెలుసుకున్న పూర్వ విద్యార్థులు చలించిపోయి తమవంతు సాయం అందించేందుకు ముందుకొచ్చారు. స్నేహం అనేది సంతోష సమయాల్లో కలిసుండటమే కాకుండా ఆపదలోనూ అండగా నిలవాలని భావించి రూ.23,500 నగదును సేకరించి మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమతో కలిసి చదువుకున్న మంచి స్నేహితుడిని కోల్పోవడం బాధాకరమని, అతను భౌతికంగా తమ మధ్య లేకపోయినా అతని కుటుంబానికి అండగా నిలవడం తమ బాధ్యతగా భావిస్తున్నామని తెలిపారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ భవిష్యత్తులోనూ తమవంతు సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు. కష్టకాలంలో మిత్రుడి కుటుంబానికి అండగా నిలిచిన పూర్వ విద్యార్థుల మానవత్వంపై స్థానికులు ప్రశంసలు కురిపిస్తున్నారు. ఈ కార్యక్రమంలో జీడి కనకయ్య, నక్క లక్ష్మణ్, కలకోల్ల నరహరి, చింత అంజయ్య, తాటికొండ రమేష్, నీల రవి, నీల చంద్రకళ, దేవరాజుల సరోజన, గోరంతల పద్మ, కుసుమ స్వరూప రాణి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అంతరిక్ష పరిజ్ఞాన పరీక్ష

- బాన్సువాడలో ప్రత్యేక పరీక్ష కేంద్రం
- జిల్లా వ్యాప్తంగా 800 మంది పదో తరగతి విద్యార్థులకు అవకాశం
- ప్రతిభావంతులకు శ్రీహరికోట సందర్శన

ప్రజానావ, బాన్సువాడ : పదో తరగతి విద్యార్థుల్లో అంతరిక్ష విజ్ఞానంపై ఆసక్తిని పెంపొందించడంతో పాటు వారి ప్రతిభను వెలికితీసేందుకు ప్రత్యేక పరీక్ష నిర్వహించనున్నారు. కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా సుమారు 800 మంది పదో తరగతి విద్యార్థులు ఈ పరీక్షకు హాజరుకానున్నారు. జిల్లా వ్యాప్తంగా రెండు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయగా, ఒకటి జిల్లా కేంద్రం కామారెడ్డిలో, మరొకటి బాన్సువాడ పట్టణంలోని భారతరత్న జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేశారు. విద్యార్థులు తమ సొంత మొబైల్ ఫోన్ల ద్వారా ఆన్‌లైన్‌లోనే పరీక్ష రాయాల్సి ఉంటుంది. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఎంపిక చేసి శ్రీహరికోటలోని అంత రిక్ష పరిశోధనా కేంద్రాన్ని సందర్శించే అవకాశం కల్పించనున్నారు. అంతరిక్ష పరిశోధనలు, శాస్త్రసాంకేతిక రంగాలపై విద్యార్థులకు అవగాహన కల్పించడంతో పాటు భవిష్యత్తులో ఈ రంగాల్లో రాణించేందుకు ప్రోత్సహించడమే పరీక్ష ప్రధాన ఉద్దేశమని నిర్వాహకుడు శ్రీరామ్ తెలిపారు. విద్యార్థులు నిర్దిష్ట సమయంలో తమ మొబైల్ ఫోన్ల ద్వారా పరీక్షకు హాజరై ప్రతిభ కనబరచాలని ఆయన సూచించారు. శ్రీహరికోట అంతరిక్ష కేంద్రాన్ని సందర్శించే అవకాశం విద్యార్థుల్లో మరింత ఉత్సాహాన్ని నింపుతుందని నిర్వాహకులు ఆశాభావం వ్యక్తం చేశారు.



ఉక్రెయిన్‌కు 500 పేట్రియాట్ క్షిపణులు

- అమ్మకానికి అమెరికా అంగీకారం
- సరఫరాకు ఏళ్లు పట్టొచ్చన్న జెలెన్‌స్కీ

న్యూయార్క్ : రష్యాతో యుద్ధంలో ఆయుధాల కొరతను ఎదుర్కొంటున్న ఉక్రెయిన్‌కు అమెరికా కీలక ఊరటనిచ్చింది. ఆ దేశానికి 500 పేట్రియాట్ క్షిపణులను విక్రయించేందుకు అంగీకరించింది. రష్యా దాడులను ఎదుర్కొనేందుకు అవసరమైన ఆయుధాలు తగ్గిపోవడంతో ఉక్రెయిన్ తీవ్ర ఇబ్బందులు పడుతోంది. ఈ పరిస్థితుల్లో అమెరికా తాజా నిర్ణయం ప్రాధాన్యం సంతరించుకుంది. దీనిపై ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్‌స్కీ స్పందిస్తూ, క్షిపణుల సరఫరాకు చాలా ఏళ్ల పట్టే అవకాశం ఉందని తెలిపారు. పీఏసీ-3 అడ్డగింపు క్షిపణుల కొనుగోలుకు సుమారు రెండు బిలియన్ డాలర్ల వ్యయం అవుతుందని, ఈ నిధులను ఉక్రెయిన్ మిత్రదేశాలైన ఐరోపా దేశాలు, కెనడా సమకూర్చనున్నాయని అమెరికా ప్రభుత్వం వెల్లడించింది. రష్యా ప్రయోగిస్తున్న బాలిస్టిక్ క్షిపణులను అడ్డుకునేందుకు పేట్రియాట్ క్షిపణులే అత్యంత సమర్థవంతమైన ఆయుధాలని జెలెన్‌స్కీ పేర్కొన్నారు. ఈ ఒప్పందంతో ఉక్రెయిన్ వైమానిక రక్షణ వ్యవస్థకు మరింత బలం చేకూరే అవకాశం ఉంది.

అమెరికా-ఇరాన్ మధ్య శాంతి ఒప్పందానికి ప్రతిపాదన

- యురేనియం నిల్వల అప్పగింతకు ఇరాన్ అంగీకారం
- హోర్మూజ్ జలసంధి తెరిచేందుకు సన్నాహాలు

న్యూఢిల్లీ : అమెరికా, ఇరాన్ మధ్య మరోసారి శాంతి ఒప్పందానికి అంగీకారం కుదిరినట్లు ఓ అంతర్జాతీయ మీడియా కథనం వెల్లడించింది. ఇరాన్ తన వద్ద ఉన్న శుద్ధి చేసిన యురేనియం నిల్వలను అప్పగించేందుకు అంగీకరించినట్లు సమాచారం. ఆ నిల్వలను మూడో దేశానికి అప్పగించడం లేదా వాటి శుద్ధి స్థాయిని తగ్గించడం ద్వారా వివాదానికి పరిష్కారం చూపాలని ప్రతిపాదించినట్లు తెలుస్తోంది. అలాగే అంతర్జాతీయ నౌకాయానానికి కీలకమైన హోర్మూజ్ జలసంధిని తెరిచేందుకు ఇరాన్ అంగీకరించినట్లు సమాచారం. ఒప్పందం కుదిరిన ఏడు రోజుల్లోగా జలసంధిని తెరిచే అవకాశముందని అల్ అరేబియా ఆంగ్ల పత్రిక తన కథనంలో పేర్కొంది. ఇరు దేశాల మధ్య ఒప్పందానికి సంబంధించిన ముసాయిదా బయటకు వచ్చినట్లు తెలిపింది. ఒప్పందం అమలుకు చైనాను హామీ దేశంగా చేర్చినట్లు సమాచారం. అమెరికా, ఇరాన్ మధ్య చర్చలు ఖతార్ రాజధాని దోహాలో జరిగే అవకాశాలున్నాయి. అణు కార్యక్రమం, సముద్ర భద్రతకు సంబంధించి ఇరాన్ తన వైఖరిని వెల్లడించనుండగా, ఆర్థిక ఆంక్షల ఎత్తివేత ప్రక్రియను అమెరికా పరిశీలించనుంది. మధ్యవర్తులు, హామీ దేశాల భాగస్వామ్యంతో వివాద పరిష్కార ఒప్పందాన్ని రూపొందించనున్నట్లు తెలుస్తోంది. దౌత్య ప్రయత్నాల్లో భాగంగా ఖతార్ ప్రతినిధి బృందం టెహ్రాన్‌కు చేరుకుంది. ఖతార్ ప్రధాని సలహాదారు నేతృత్వంలోని బృందం ఇరాన్‌లో పర్యటిస్తోంది. ఈ బృందం ద్వారా అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ తన లేఖను ఇరాన్‌కు పంపినట్లు సమాచారం. మరోవైపు, ఇప్పట్లో యుద్ధాన్ని ముగించే ఆలోచన లేదని అమెరికా అధ్యక్షుడు డొనాల్ట్ ట్రంప్ పేర్కొన్నట్లు వార్తలు వెలువడ్డాయి. దీంతో శాంతి ఒప్పందంపై స్పష్టత రావాల్సి ఉంది.

ఫ్రాన్స్‌లో యువత నిరసనలు

- 70 వేల మంది భద్రతా సిబ్బంది మోహరింపు
- జీవన వ్యయాలు, విద్యా సమస్యలపై ఆందోళనలు
- ఐరోపా దేశాలకూ విస్తరణ

ప్యారిస్ : జీవన వ్యయాల పెరుగుదల, విద్యా రంగ సమస్యలకు వ్యతిరేకంగా ఫ్రాన్స్‌లో యువత చేపట్టిన నిరసనలు వరుసగా మూడో వారాంతానికి చేరుకున్నాయి. ఆందోళనలు హింసాత్మకంగా మారే అవకాశాల నేపథ్యంలో ప్రభుత్వం దేశవ్యాప్తంగా 70 వేల మంది పోలీసులు, సైనిక సిబ్బందిని మోహరించింది. ప్యారిస్‌లో నిరసన ర్యాలీ మార్గాన్ని నగర కేంద్రం నుంచి శివారు ప్రాంతాలకు మార్చారు. నగర కేంద్రంలో కార్మిక సంఘాలు, ఎల్లో వెస్ట్ ఉద్యమకారులు చేపట్టనున్న ర్యాలీలపై పోలీసులు నిషేధం విధించారు. ఈ ఆంక్షలను కార్మిక, విద్యార్థి సంఘాలు న్యాయస్థానంలో సవాలు చేసినప్పటికీ వారికి అనుకూలంగా తీర్పు రాలేదు. గతంలో అల్లర్లు, దోపిడీలు చోటుచేసుకున్న ప్లాస్ డి లా రిపబ్లిక్, లెస్ హాలెస్ ప్రాంతాల్లో శనివారం, ఆదివారం రాత్రి 11 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు ప్రజల ప్రవేశాన్ని నిషేధించారు. ఫ్రాన్స్‌లో ప్రారంభమైన యువత నిరసనలు ఐరోపాలోని పలు దేశాలకు విస్తరిస్తున్నాయి. జర్మనీలో 'జెన్ జెడ్ రెగెట్' పేరుతో యువత సుమారు 30 నగరాల్లో ఆందోళనలకు పిలుపునిచ్చింది. ఈ కార్యక్రమానికి ఆన్‌లైన్‌లో 1.4 లక్షల మంది పేర్లు నమోదు చేసుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. స్పెయిన్‌లోని బార్సిలోనాలో నిరసనల నేపథ్యంలో 'బ్లూకస్' పేరుతో గుర్తు తెలియని టిక్‌టాక్ నెట్‌వర్క్ ఆందోళనలకు పిలుపునిచ్చింది. ఇటలీలోని మిలాన్, టూరిన్, బొలోగ్నా నగరాల్లో నిరసనకారులు, పోలీసుల మధ్య ఘర్షణలు చోటుచేసుకోవడంతో అధికారులు అప్రమత్తమ య్యారు. బెల్జియం, నెదర్లాండ్స్, ఆస్ట్రియా, స్విట్జర్లాండ్, పోర్చుగల్ దేశాల్లోనూ సామాజిక మాధ్యమం టిక్‌టాక్ ద్వారా నిరసనలకు పిలుపులు వెలువడ్డాయి. దీంతో ఐరోపా వ్యాప్తంగా యువత ఆందోళనలు మరింత విస్తరించే సూచనలు కనిపిస్తున్నాయి.


ఫ్రాన్స్‌లో యువత నిరసనలు

- 70 వేల మంది భద్రతా సిబ్బంది మోహరింపు
- జీవన వ్యయాలు, విద్యా సమస్యలపై ఆందోళనలు
- ఐరోపా దేశాలకూ విస్తరిస్తున్న ఉద్యమాలు

ప్యారిస్ : జీవన వ్యయాల పెరుగుదల, విద్యా రంగ సమస్యలకు వ్యతిరేకంగా ఫ్రాన్స్‌లో యువత చేపట్టిన నిరసనలు వరుసగా మూడో వారాంతానికి చేరుకున్నాయి. ఆందోళనలు హింసాత్మకంగా మారే అవకాశాల నేపథ్యంలో ప్రభుత్వం దేశవ్యాప్తంగా 70 వేల మంది పోలీసులు, సైనిక సిబ్బందిని మోహరించింది. ప్యారిస్‌లో నిరసన ర్యాలీ మార్గాన్ని నగర కేంద్రం నుంచి శివారు ప్రాంతాలకు మార్చారు. నగర కేంద్రంలో కార్మిక సంఘాలు, ఎల్లో వెస్ట్ ఉద్యమకారులు చేపట్టనున్న ర్యాలీలపై పోలీసులు నిషేధం విధించారు. ఈ ఆంక్షలను కార్మిక, విద్యార్థి సంఘాలు న్యాయస్థానంలో సవాలు చేసినప్పటికీ వారికి అనుకూలంగా తీర్పు రాలేదు. గతంలో అల్లర్లు, దోపిడీలు చోటుచేసుకున్న ప్లాస్ డి లా రిపబ్లిక్, లెస్ హాలెస్ ప్రాంతాల్లో శనివారం, ఆదివారం రాత్రి 11 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు ప్రజల ప్రవేశాన్ని నిషేధించారు. ఫ్రాన్స్‌లో ప్రారంభమైన యువత నిరసనలు ఐరోపాలోని పలు దేశాలకు విస్తరిస్తున్నాయి. జర్మనీలో 'జెన్ జెడ్ రెగెట్' పేరుతో యువత సుమారు 30 నగరాల్లో ఆందోళనలకు పిలుపునిచ్చింది. ఈ కార్యక్రమానికి ఆన్‌లైన్‌లో 1.4 లక్షల మంది పేర్లు నమోదు చేసుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. స్పెయిన్‌లోని బార్సిలోనాలో నిరసనల నేపథ్యంలో 'బ్లూకస్' పేరుతో గుర్తు తెలియని టిక్‌టాక్ నెట్‌వర్క్ ఆందోళనలకు పిలుపునిచ్చింది.

అంధులకు చూపు.. ఆలోచనలతో సంభాషణ

- న్యూరాలింక్ నుంచి బ్లైండ్‌సైట్, టెలిపతి ఉత్పత్తులు
- వివరాలు వెల్లడించిన ఎలాన్ మస్క్



న్యూఢిల్లీ : మెదడులో ప్రత్యేక చిప్‌లను అమర్చడం ద్వారా సాంకేతిక విప్లవాన్ని సృష్టించేందుకు ప్రయత్నిస్తున్న ఎలాన్ మస్క్‌కు చెందిన న్యూరాలింక్ సంస్థ రెండు కొత్త ఉత్పత్తులను ప్రకటించింది. చూపులేని వారికి దృష్టిని అందించడమే లక్ష్యంగా రూపొందించిన 'బ్లైండ్‌సైట్', కేవలం ఆలోచనల ద్వారానే కంప్యూటర్లు, ఇతర వ్యక్తులతో సంభాషించేందుకు ఉపయోగపడే 'టెలిపతి' సాంకేతికతలను పరిచయం చేసింది. బ్లైండ్‌సైట్ సాంకేతిక అభివృద్ధి పూర్తయిందని, ప్రస్తుతం ప్రభుత్వ నియంత్రణ సంస్థల అనుమతుల కోసం ఎదురుచూస్తున్నామని ఎలాన్ మస్క్ వెల్లడించారు. టెలిపతి ద్వారా ఆలోచనలతోనే సమాచారాన్ని పంపించుకునే విధానాన్ని మరింత అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. 'ఎక్స్' వేదికగా చేసిన రెండు పోస్టుల్లో ఈ ఉత్పత్తుల వివరాలను పంచుకున్నారు. న్యూరాలింక్ తొలి ఉత్పత్తి టెలిపతి అని, దీని ద్వారా కేవలం ఆలోచనలతోనే కంప్యూటర్లు లేదా మనుషులతో అత్యంత వేగంగా సంభాషించవచ్చని పేర్కొన్నారు. రానున్న సంవత్సరాల్లో మాట్లాడటం లేదా టైప్ చేయడం ద్వారా సాధించే వేగం కంటే ఆలోచనల ద్వారా సమాచారాన్ని పంపించే వేగం ఎన్నో రెట్లు ఎక్కువగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. పూర్తిగా అంధులైనవారితో పాటు పుట్టుకతోనే చూపులేని వారికి కూడా దృష్టిని అందించడమే బ్లైండ్‌సైట్ లక్ష్యమని మరో పోస్టులో వివరించారు. బ్లైండ్‌సైట్ ఎలా పనిచేస్తుంది? అంధులకు చూపును కల్పించేందుకు న్యూరాలింక్ అభివృద్ధి చేస్తున్న ప్రయోగాత్మక మెదడు ఇంప్లాంట్ ఇది. కళ్లతో సంబంధం లేకుండా నేరుగా మెదడుకు దృశ్య సమాచారాన్ని పంపించడం దీని ప్రత్యేకత. సాధారణంగా కళ్ల కాంతిని గ్రహించి సంకేతాలుగా మార్చి దృష్టి నాడి ద్వారా మెదడుకు పంపిస్తాయి. మెదడు ఆ సంకేతాలను విశ్లేషించి దృశ్యాలను గుర్తిస్తుంది. అయితే కళ్లు లేదా దృష్టి నాడులు దెబ్బతిన్నప్పుడు ఈ ప్రక్రియకు ఆటంకం ఏర్పడి చూపు కోల్పోయే పరిస్థితి వస్తుంది. ఈ సమస్యను అధిగమించేందుకు బ్లైండ్‌సైట్‌లో ప్రత్యేక కెమెరా ద్వారా పరిసరాలను చిత్రీకరించి, ఆ సమాచారాన్ని వైర్‌లెస్ విధానంలో మెదడులో అమర్చిన చిప్‌కు పంపిస్తారు. ఆ చిప్ మెదడులో చూపునకు సంబంధించిన భాగాన్ని ప్రేరేపించి దృశ్యాలను గుర్తించేలా చేస్తుందని సంస్థ భావిస్తోంది. టెలిపతి ప్రత్యేకత ఏమిటి? ఆలోచనలతోనే కంప్యూటర్లను నియంత్రించడం, ఇతరులతో సమాచారాన్ని పంచుకోవడం టెలిపతి ప్రధాన ఉద్దేశం. ఇది మెదడు–కంప్యూటర్ అనుసంధాన సాంకేతికత ఆధారంగా పనిచేస్తుంది. మెదడులో అమర్చే చిన్న చిప్ నాడీ సంకేతాలను గుర్తించి డిజిటల్ ఆదేశాలుగా మారుస్తుంది. దీంతో చేతులు కదపకుండా, కీబోర్డు ఉపయోగించకుండా కేవలం ఆలోచనలతోనే కంప్యూటర్ తెరపై సూచికను కదపడం, క్లిక్ చేయడం, టైప్ చేయడం వంటి పనులు చేయవచ్చు.

అంతరిక్షం నుంచి ఏఐ స్పందన

- గూగుల్ ప్రయోగం విజయవంతం
- కక్ష్యలోని ఉపగ్రహం నుంచి భూమికి సందేశం
- తొలిసారిగా డేటా కేంద్ర స్థాయి చిప్ వినియోగం

స్వాల్‌బర్డ్ : అంతరిక్షం నుంచే కృత్రిమ మేధ (ఏఐ) వ్యవస్థను నిర్వహించాలన్న గూగుల్ లక్ష్యం దిశగా కీలక ముందడుగు పడింది. సంస్థ చేపట్టిన 'ప్రాజెక్ట్ సన్‌క్యాచర్' నమూనా ఉపగ్రహం తన కక్ష్య నుంచే ఏఐ స్పందనను రూపొందించి భూమికి పంపింది. డేటా కేంద్రాల్లో వినియోగించే స్థాయి ఏఐ చిప్ అంతరిక్షంలో పనిచేయడం ఇదే తొలిసారి. ఉపగ్రహం సక్రమంగా పనిచేస్తున్నట్లు నిర్ధారించుకున్న అనంతరం, నార్వేలోని స్వాల్‌బర్డ్ గ్రౌండ్ స్టేషన్ మీదుగా అది ప్రయాణిస్తున్న సమయంలో ఇంజినీర్లు అందులోని 'గెమ్మా 4' ఏఐ నమూనాకు తొలి ప్రయోగాత్మక ఆదేశాన్ని పంపారు. అంతరిక్షంలో ఉండటంపై ప్రాసలేని చిన్న కవిత రాయాలని కోరారు. దీనికి స్పందించిన ఏఐ నమూనా భూమిని నీలి పాలరాయితో పోలుస్తూ, నిశ్శబ్ద సౌందర్యంలో డేటా ప్రవాహాలు సాగుతున్నాయని, నక్షత్రాల కాంతి తన ఆత్మకు పోషణ ఇస్తోందని భావం వచ్చేలా సమాధానమిచ్చింది. అంతరిక్షంలోనే ఏఐ నమూనాను పనిచేయించి, దాని స్పందనను భూమికి పంపించడం భవిష్యత్తులో అంతరిక్ష ఆధారిత కంప్యూటింగ్ వ్యవస్థల అభివృద్ధికి కీలక అడుగుగా భావిస్తున్నారు.





అమెరికా సైనిక స్థావరాలో ఫ్రీజర్ల నిలిపివేత


- సైబర్ దాడి అనుమానం
- ఆహార పదార్థాలు పాడవడంతో పెంటగాన్ దర్యాప్తు.. రంగంలోకి అమెరికా సైబర్ కమాండ్

వాషింగ్టన్ : అమెరికాలోని పలు సైనిక స్థావరాల్లో ఫ్రీజర్లు, శీతలీకరణ యంత్రాలు అకస్మాత్తుగా పనిచేయకపోవడం, వాటిలో నిల్వ చేసిన ఆహార పదార్థాలు పాడైపోవడం కలకలం రేపింది. దీని వెనుక సైబర్ దాడి ఉందా? అన్న కోణంలో అమెరికా రక్షణ శాఖ (పెంటగాన్) దర్యాప్తు చేపట్టింది. ఈ ఏడాది ఆగస్టులో కనీసం ఆరు సైనిక స్థావరాల్లోని ఆహార విక్రయ కేంద్రాల్లో ఈ సమస్య తలెత్తింది. ఫ్రీజర్లను సాధారణంగా నిలిపివేయడమే కాకుండా, వాటిని మంచు తొలగింపు ప్రక్రియ (డీఫ్రాస్ట్ మోడ్)లోకి మార్చి లోపలి ఉష్ణోగ్రతలను పెంచినట్లు అనుమానిస్తున్నారు. అరిజోనాలోని ఫోర్ట్ హువాచుకా సైనిక స్థావరంలో ఆగస్టు 26న ఫ్రీజర్లు డీఫ్రాస్ట్ మోడ్‌లోకి మారడంతో అందులోని ఘనీభవించిన ఆహార పదార్థాలన్నీ పాడైపోయినట్లు అధికారులు వెల్లడించారు. సాధారణంగా ఫ్రీజర్లలో పేరుకుపోయిన మంచును తొలగించేందుకు ఈ ప్రక్రియను ఉపయోగిస్తారు. అయితే ఈ సమయంలో ఉష్ణోగ్రత పెరగడంతో ఆహార పదార్థాలు నిల్వ ఉండలేకపోయాయి. కాలిఫోర్నియాలోని ఫోర్ట్ ఇర్విన్, ట్రావిస్ వైమానిక స్థావరంతో పాటు మరో నాలుగు సైనిక స్థావరాల్లోనూ ఇలాంటి సమస్యలు నమోదయ్యాయి. ఆయా స్థావరాల్లో సైనికులు, వారి కుటుంబాలకు నిత్యావసరాలు, ఆహార పదార్థాలు విక్రయించే ప్రత్యేక దుకాణాలు ఉన్నాయి. ఫ్రీజర్లు పనిచేయక పోవడంతో పెద్ద మొత్తంలో ఆహారం వృథా అయింది. ఈ ఘటనలపై సమగ్ర దర్యాప్తు చేపట్టేందుకు అమెరికా సైబర్ కమాండ్ కూడా రంగంలోకి దిగింది.

ఓటర్ల జాబితాల సవరణపై అప్రమత్తంగా ఉండాలి

- 1.27 కోట్ల మంది హిందువుల పేర్లు గల్లంతయ్యాయి
- బీజేపీ కార్యకర్తలకు యోగి ఆదిత్యనాథ్ పిలుపు

లక్నో : ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియలో బీజేపీ కార్యకర్తలు అప్రమత్తంగా వ్యవహరించాలని ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ఓటర్ల జాబితాల నుంచి 1.27 కోట్ల మంది హిందువుల పేర్లు తొలగిపోయాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం నిర్వహించిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో పార్టీ శ్రేణులను ఉద్దేశించి యోగి మాట్లాడారు. అర్హులైన ఓటర్లందరి పేర్లు జాబితాలో ఉండేలా కార్యకర్తలు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. ఓటర్ల పేర్ల తొలగింపు ప్రభావం 28 స్థానిక సంస్థల నియోజకవర్గాల్లో పార్టీ స్థితిపై పడుతోందని ఆయన పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు దక్కేలా జాబితాల సవరణ ప్రక్రియను నిశితంగా పరిశీలించాలని పార్టీ కార్యకర్తలకు సూచించారు.



మెజారిటీకి దూరంగా నెతన్యాహు కూటమి

- ఇజ్రాయెల్‌లో ప్రభుత్వ ఏర్పాటుకు అరబ్ పార్టీల మద్దతే కీలకం
- మళ్లీ ఎన్నికలు జరిగే అవకాశమూ



జెరూసలేం : ఇజ్రాయెల్ పార్లమెంట్ ఎన్నికల్లో ప్రధాని బెంజమిన్ నెతన్యాహు నేతృత్వంలోని కుడిపక్ష కూటమికి ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన మెజారిటీ లభించలేదు. దీంతో తదుపరి ప్రభుత్వం ఎవరి నేతృత్వంలో ఏర్పడుతుందన్న ఉత్కంఠ నెలకొంది. మొత్తం 120 స్థానాలున్న నెసెట్‌లో ప్రభుత్వ ఏర్పాటుకు కనీసం 61 స్థానాలు అవసరం కాగా, నెతన్యాహు కూటమికి 53, మాజీ సైన్యాధిపతి గాడి ఐసెన్‌కోట్ నేతృత్వంలోని ప్రతిపక్ష కూటమికి 48 స్థానాలు వచ్చాయి. అరబ్ పార్టీలకు కలిపి 19 స్థానాలు దక్కడంతో ప్రభుత్వ ఏర్పాటులో వాటి మద్దతు కీలకంగా మారింది. నెతన్యాహు నేతృత్వంలోని లికుడ్ పార్టీ 27 స్థానాలతో అతిపెద్ద పార్టీగా అవతరించినప్పటికీ, కూటమికి మెజారిటీ సాధించేందుకు మరో ఎనిమిది స్థానాలు అవసరం. ప్రతిపక్షానికి మరో 13 స్థానాలు కావాలి. ఈ నేపథ్యంలో అరబ్ పార్టీల మద్దతు ఎవరికి లభిస్తుందన్నది ఆసక్తికరంగా మారింది. నెతన్యాహును అధికారానికి దూరం చేయాలని భావిస్తున్న ప్రతిపక్షానికి అరబ్ పార్టీల సహకారం అవసరమైనప్పటికీ, వాటితో కలిసి పనిచేసే అంశంపై ప్రతిపక్ష పార్టీల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అరబ్ పార్టీల మద్దతుతో ప్రభుత్వం ఏర్పాటు చేయాలా? లేక నెతన్యాహు వ్యతిరేక పార్టీలన్నీ కలిసి ప్రత్యామ్నాయ కూటమిని ఏర్పాటు చేయాలా? అన్నది ఇంకా తేలలేదు. ప్రతిపక్ష నేత ఐసెన్‌కోట్ అరబ్ పార్టీలతో కలిసి పనిచేసే అవకాశాన్ని పూర్తిగా తోసిపుచ్చలేదు. కొన్ని షరతులతో వారి సహకారం తీసుకునేందుకు సిద్ధంగా ఉన్నట్లు సంకేతాలిచ్చారు. మరోవైపు నెతన్యాహు వ్యతిరేక కూటమికి పార్లమెంట్ స్పీకర్ ఎన్నికలో మద్దతు ఇచ్చే అంశంపైనా అరబ్ పార్టీల నేతలు చర్చించినట్లు సమాచారం. ప్రభుత్వంలో భాగస్వామ్యం కాకపోయినా పార్లమెంట్ చర్చలు, చట్టాల రూపకల్పనలో ప్రభావం చూపే అవకాశం వాటికి ఉంది. ఒకవేళ నెతన్యాహు అధికారం కోల్పోతే ఆయనపై ఉన్న అవినీతి ఆరోపణల కేసులు మరోసారి తెరపైకి వచ్చే అవకాశం ఉంది. అలాగే 2023 అక్టోబర్ 7న హమాస్ జరిపిన దాడిని ముందుగా గుర్తించడంలో, అడ్డుకోవడంలో ఇజ్రాయెల్ భద్రతా వ్యవస్థ విఫలమైందన్న అంశంపై సమగ్ర విచారణకు డిమాండ్లు పెరిగే అవకాశముంది. ఇదిలా ఉండగా, అరబ్ పార్టీల మద్దతుతో ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేశారంటూ నెతన్యాహు పార్టీ లికుడ్ ఆరోపించింది. ఎన్నికల్లో అక్రమాలు జరిగాయని, విదేశీ సహకారం కూడా ఉందని పేర్కొన్నప్పటికీ, ఈ ఆరోపణలకు సంబంధించి నిర్ధారిత ఆధారాలు బయటపడలేదు. అరబ్ ఓటర్లను లక్ష్యంగా చేసుకుని ఆరోపణలు చేయడం ద్వారా వారి రాజకీయ ప్రాతినిధ్యాన్ని ప్రశ్నార్థకం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ప్రతిపక్షం విమర్శించింది. ప్రస్తుత పరిస్థితుల్లో ఏ కూటమికీ స్పష్టమైన మెజారిటీ లేకపోవడంతో ప్రభుత్వ ఏర్పాటుపై చర్చలు సంక్లిష్టంగా మారనున్నాయి. అవసరమైన మద్దతును కూడగట్టడంలో పార్టీలు విఫలమైతే వచ్చే ఏడాది ప్రారంభంలో మరోసారి ఎన్నికలు జరిగే అవకాశముందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

విదేశీ వైద్య విద్యపై ఎన్ఎంసీ అస్పష్టత

- జార్జియా ఎంబీబీఎస్ డిగ్రీల చెల్లుబాటుపై గందరగోళం
- విద్యార్థులను మోసగిస్తున్న కన్సల్టెంట్లు

న్యూఢిల్లీ : భారత్‌లో వైద్య వృత్తిని చేపట్టేందుకు విదేశాల్లో పొందిన ఎంబీబీఎస్ డిగ్రీల చెల్లుబాటు విషయంలో జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసీ) స్పష్టమైన వైఖరిని వెల్లడించకపోవడం విద్యార్థుల్లో గందరగోళానికి కారణమవుతున్నది. ఈ అస్పష్టతను ఆసరాగా చేసుకుని విదేశాల్లో వైద్య విద్య అభ్యసించాలనుకునే విద్యార్థులను కొందరు కన్సల్టెంట్లు తప్పుదోవ పట్టిస్తున్నారని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విదేశీ విశ్వవిద్యాలయాలతో కుమ్మక్కై విద్యార్థులను మభ్యపెట్టి భారీ మొత్తంలో కమీషన్లు వసూలు చేస్తున్నారని న్యాయ నిపుణులు ఆరోపిస్తున్నారు. విదేశీ వైద్య పట్టభద్రుల పరీక్ష (ఎఫ్ఎంజీఈ)కు అర్హత కల్పించే దేశాలు, విశ్వవిద్యాలయాల జాబితాను ప్రకటించి విద్యార్థులను మోసాల బారిన పడకుండా కాపాడాలని ప్రభుత్వాన్ని, ఎన్ఎంసీని వారు కోరుతున్నారు. జార్జియాలో ఆరేళ్ల ఎంబీబీఎస్ కోర్సు పూర్తి చేస్తే భారత్‌లో వైద్య వృత్తిని చేపట్టేందుకు అవసరమైన ఎఫ్ఎంజీఈ పరీక్షకు హాజరయ్యే అర్హత లభిస్తుందా లేదా అనే అంశంపై వైద్యులు కావాలనుకుంటున్న ఇద్దరు విద్యార్థులు ప్రధానమంత్రి ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా స్పష్టత కోరారు. దీనిపై సెప్టెంబర్ 24న ఇచ్చిన తొలి సమాధానంలో ఎన్ఎంసీ 2021 నాటి నిబంధనలను పునరుద్ఘాటించింది. ఎంబీబీఎస్ పూర్తి చేసిన అనంతరం వైద్య వృత్తిని చేపట్టేందుకు జార్జియా స్వతంత్ర లైసెన్స్ మంజూరు చేసినప్పుడే ఆ డిగ్రీ భారత్‌లో ఎఫ్ఎంజీఈ పరీక్షకు హాజరయ్యేందుకు చెల్లుబాటు అవుతుందని పేర్కొంది. మరో విద్యార్థి ఇదే తరహా ప్రశ్నను లేవనెత్తగా అక్టోబర్ 13న ఇచ్చిన రెండో సమాధానంలో స్వతంత్ర లైసెన్సింగ్ వ్యవస్థకు సంబంధించిన నిబంధనలను సంబంధిత అధికార వ్యవస్థ, నిపుణుల కమిటీ పరిశీలిస్తున్నాయని ఎన్ఎంసీ వెల్లడించింది.

వైమానిక దళానికి కొత్త అధిపతి

- అశుతోష్ దీక్షిత్‌కు బాధ్యతల అప్పగింత
- 43 ఏళ్ల సేవల అనంతరం పదవీ విరమణ చేసిన ఏపీ సింగ్


న్యూఢిల్లీ : భారత వైమానిక దళానికి నూతన అధిపతిగా ఎయిర్ చీఫ్ మార్షల్ అశుతోష్ దీక్షిత్ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఈ పదవిలో కొనసాగిన ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్ 43 ఏళ్ల సుదీర్ఘ సేవల అనంతరం పదవీ విరమణ చేశారు. రేస్ కోర్స్ వైమానిక స్థావరంలో ఏపీ సింగ్‌కు వైమానిక దళం గౌరవ వందనం సమర్పించిన అనంతరం ఆయన కొత్త అధిపతిగా అశుతోష్ దీక్షిత్‌కు బాధ్యతలు అప్పగించారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో అశుతోష్ దీక్షిత్ కీలక పాత్ర పోషించారు. నూతన బాధ్యతలు చేపట్టడానికి ముందు ఆయన వైమానిక దళ ఉపాధిపతిగా పనిచేశారు. అంతకుముందు సమీకృత రక్షణ దళాల ప్రధానాధికారిగా, సెంట్రల్ ఎయిర్ కమాండ్ వైమానిక అధిపతిగా వివిధ హోదాల్లో సేవలందించారు.

మైనారిటీ వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలి

బెంగళూరు : ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని క్రైస్తవ, ముస్లిం సామాజిక, ఆధ్యాత్మిక నేతలు డిమాండ్ చేశారు. మైనారిటీలు, అణగారిన వర్గాలను లక్ష్యంగా చేసుకున్న మతమార్పిడి నిరోధక చట్టం, పశు వధ నిషేధ చట్టం సహా పలు వివాదాస్పద చట్టాలను తక్షణమే రద్దు చేయాలని కోరారు. బీజేపీ ప్రభుత్వ హయాంలో తీసుకొచ్చిన ఈ చట్టాలను రద్దు చేయడంలో జాప్యం మైనారిటీ వర్గాల్లో తీవ్ర నిరాశకు కారణమవుతున్నదని పేర్కొన్నారు. ఈ మేరకు బెంగళూరు ఆర్చ్‌బిషప్ పీటర్ మచాడో, కర్ణాటక రాజ్యసభ ముస్లిం ఐక్యవేదిక కన్వీనర్ మహ మ్మద్ యహ్యా దాముడి మీడియాతో మాట్లాడారు. కర్ణాటకలో అధికారంలోకి వచ్చిన వెంటనే మైనారిటీ వ్యతిరేక చట్టాలను రద్దు చేస్తామని కాంగ్రెస్ ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిందని పీటర్ మచాడో గుర్తుచేశారు. అయితే ప్రభుత్వం ఏర్పడి మూడేళ్లు దాటుతున్నా ఇప్పటివరకు ఆ హామీని నెరవేర్చలేదని ఆయన విమర్శించారు.

చెన్నై ఓపెన్‌కు ఇదే చివరి ఎడిషన్

- ఫిలిప్పీన్స్‌కు నిర్వహణ హక్కులు
- భారత్‌లోకి మరో నాలుగు టెన్నిస్ టోర్నీలు
- 2028 ఆరంభంలో డబ్ల్యూటీఏ 125 పోటీల నిర్వహణకు సన్నాహాలు
- భారత మహిళా క్రీడాకారిణులకు అంతర్జాతీయంగా మరిన్ని అవకాశాలు
- ఏఐటీఏలో పోటీ మంచిదే: విజయ్ అమృత్‌రాజ్



చెన్నై: డబ్ల్యూటీఏ–250 చెన్నై ఓపెన్‌కు ఈ ఏడాదే చివరి ఎడిషన్ కానుంది. వచ్చే ఏడాది నుంచి టోర్నీ నిర్వహణ హక్కులు ఫిలిప్పీన్స్‌కు దక్కనున్నాయి. ఈ నేపథ్యంలో 2028 జనవరి–ఫిబ్రవరిలో భారత్‌లో మూడు నుంచి నాలుగు డబ్ల్యూటీఏ–125 టోర్నీలు నిర్వహించేందుకు తమిళనాడు టెన్నిస్ సంఘం (టీఎన్‌టీఏ) ప్రయత్నిస్తోందని భారత టెన్నిస్ దిగ్గజం విజయ్ అమృత్‌రాజ్ తెలిపారు. పీటీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ వివరాలు వెల్లడించారు. చెన్నైలో వర్షాకాలంలో టోర్నీ నిర్వహణ ఇబ్బందిగా మారుతోందని, అందుకే తరలింపు నిర్ణయాన్ని అర్థం చేసుకున్నానని చెప్పారు. ఫిలిప్పీన్స్ క్రీడాకారిణి అలెగ్జాండ్రా ఈలా టాప్–20లోకి చేరడం, వింబుల్డన్‌లో ఆమె ప్రదర్శనతో అక్కడ టెన్నిస్‌కు ఆదరణ పెరగడం కూడా టోర్నీ తరలింపునకు దోహదపడిందన్నారు.

ర్యాంకింగ్ పాయింట్లే లక్ష్యం

2027లో భారత్‌కు డబ్ల్యూటీఏ–250 టోర్నీ వచ్చే అవకాశం లేదని, 125, 125 ప్లస్ హెచ్ విభాగాల్లో పోటీల నిర్వహణకు ప్రయత్నిస్తున్నామని అమృత్‌రాజ్ తెలిపారు. పెద్ద పేరున్న క్రీడాకారిణులు పాల్గొనే 250 టోర్నీల్లో భారత అమ్మాయిలకు ప్రధాన డ్రాలో చోటు దక్కడం కష్టమవుతోందని, వైల్డ్‌కార్డులపైనే ఆధారపడాల్సి వస్తోందని చెప్పారు. 125 టోర్నీల్లో క్వార్టర్, సెమీఫైనల్స్ చేరి ర్యాంకింగ్ పాయింట్లు సాధించే అవకాశాలు మెరుగ్గా ఉంటాయని, వైష్ణవి, సహజ వంటి క్రీడాకారిణులకు ఎక్కువ అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడే అవకాశం కల్పించడమే లక్ష్యమన్నారు. ప్రైజ్‌మనీ, షెడ్యూల్, హాజరు రుసుము, ఫైనల్స్‌లో ఆడే అవకాశాలు అగ్రశ్రేణి క్రీడాకారిణుల భాగస్వామ్యాన్ని ప్రభావితం చేస్తాయని వివరించారు.

దేశవ్యాప్తంగా టోర్నీలు జరగాలి

త్వరలో జరగనున్న అఖిల భారత టెన్నిస్ సంఘం (ఏఐటీఏ) ఎన్నికల్లో కొత్త నాయకత్వం ఆటగాళ్ల ప్రయోజనాలకు ప్రాధాన్యమివ్వాలని అమృత్‌రాజ్ సూచించారు. కొన్ని రాష్ట్రాలకే పరిమితం కాకుండా దేశవ్యాప్తంగా జూనియర్, సీనియర్ టోర్నీలు నిర్వహించాలని, రాష్ట్ర సంఘాలు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. మౌలిక సదుపాయాలు, వాతావరణ పరిస్థితులు రాష్ట్రానికోలా ఉంటాయని, టోర్నీలు నిర్వహించని సంఘాలపై కఠిన చర్యల కంటే ప్రోత్సాహం అవసరమని అభిప్రాయపడ్డారు. ఈసారి ఏఐటీఏ ఎన్నికల్లో పోటీ ఉండటం మంచిదేనని, అభ్యర్థులు తమ కార్యాచరణను వెల్లడించి, మెరుగైన ప్రణాళిక ఉన్నవారికి బాధ్యతలు అప్పగించాలని పేర్కొన్నారు.

హైలో ఓపెన్ ఫైనల్‌కు సింధు

- సెమీస్‌లో వరుస గేముల్లో అన్మోల్‌పై విజయం
- వరుసగా రెండో వారంలో తుది పోరుకు భారత షట్లర్



సార్బ్రూకెన్ : భారత బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు మరోసారి సత్తా చాటింది. వరుసగా రెండో వారంలోనూ ఫైనల్‌కు చేరింది. హైలో ఓపెన్ సూపర్ 500 టోర్నీ మహిళల సింగిల్స్ సెమీ ఫైనల్లో శనివారం సహచర క్రీడాకారిణి అన్మోల్ ఖర్బ్‌పై విజయం సాధించింది. 32 నిమిషాల పాటు సాగిన పోరులో 21–13, 21–16తో వరుస గేముల్లో గెలిచి తుది పోరుకు అర్హత సాధించింది. గతవారం ఫ్రెంచ్ ఓపెన్‌లోనూ ఫైనల్ చేరిన సింధు రన్నరప్‌గా నిలిచింది. ప్రపంచ 53వ ర్యాంకర్ అన్మోల్ తొలి గేమ్‌లో సింధుకు గట్టి పోటీనిచ్చింది. ఓ దశలో 4–2తో ఆధిక్యంలోకి వెళ్లినా.. సింధు దూకుడైన ఆటతో పుంజుకుని విరామ సమయానికి 11–9తో ముందంజ వేసింది. ఆ తర్వాత ప్రత్యర్థి తప్పిదాలను సద్వినియోగం చేసుకుంటూ 21–13తో గేమ్ గెలిచింది. రెండో గేమ్‌లోనూ అన్మోల్ 4–2తో ఆధిక్యంలో కి వెళ్లింది. నెట్ వద్ద చక్కటి ఆటతో స్కోరును సమం చేసినా.. సింధు కీలక సమయంలో వేగం పెంచింది. 13–15తో వెనుకబడిన స్థితి నుంచి వరుస పాయింట్లతో పుంజుకుని 21–16తో గేమ్‌తో పాటు మ్యాచ్‌ను సొంతం చేసుకుంది. మరో సెమీఫైనల్లో భారత ఆటగాడు లక్ష్యసేన్ ఫ్రాన్స్‌కు చెందిన టోమా జూనియర్ పోపోవ్‌తో తలపడనున్నాడు.



ఆసీస్‌పై సఫారీల ప్రతీకారం

- చివరి టెస్టులో 176 పరుగులతో గెలుపు
- 2–1తో టెస్టు సిరీస్ కైవసం
- హార్మర్‌కు పది వికెట్లు
- ఐసీసీ టెస్టు ర్యాంకింగ్స్‌లో దక్షిణాఫ్రికాకు అగ్రస్థానం

కేప్‌టౌన్: ఆస్ట్రేలియాపై దక్షిణాఫ్రికా ప్రతీకారం తీర్చుకుంది. సొంతగడ్డపై మూడు టెస్టుల సిరీస్‌ను 2–1తో సొంతం చేసుకుంది. శనివారం ముగిసిన నిర్ణయాత్మక మూడో టెస్టులో 176 పరుగుల తేడాతో ఆసీస్‌ను చిత్తు చేసింది. 288 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్‌లో 111 పరుగులకే కుప్పకూలింది. సఫారీ స్పిన్నర్ సైమన్ హార్మర్ 16 పరుగులిచ్చి ఆరు వికెట్లు పడగొట్టి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఈ మ్యాచ్‌లో 37 ఏళ్ల హార్మర్ 120 పరుగులిచ్చి 10 వికెట్లు సాధించాడు. టెస్టుల్లో అతడికిదే తొలి పది వికెట్ల ప్రదర్శన. రబడా మూడు వికెట్లు తీసి టెస్టుల్లో 350 వికెట్ల మైలురాయిని అందుకున్నాడు.

ర్యాంకింగ్స్‌లోనూ అగ్రస్థానం

2018 శాండ్‌పేపర్ వివాదం తర్వాత దక్షిణాఫ్రికా గడ్డపై ఇరు జట్ల మధ్య జరిగిన తొలి టెస్టు సిరీస్ ఇదే. తొలి టెస్టులో ఆస్ట్రేలియా 214 పరుగులతో గెలవగా.. రెండో టెస్టులో దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్ 31 పరుగుల తేడాతో విజయం సాధించింది. మూడో టెస్టులోనూ గెలిచి సిరీస్‌ను దక్కించుకుంది. ఈ విజయంతో ఐసీసీ టెస్టు జట్టు ర్యాంకింగ్స్‌లో ఆస్ట్రేలియాను వెనక్కి నెట్టి దక్షిణాఫ్రికా అగ్రస్థానానికి చేరింది.



తొలి రౌండ్‌లోనే పరీక్ష

- వైష్ణవి, సహజకు ప్రత్యర్థులుగా విదేశీ క్రీడాకారిణులు
- ఎనిమిదో సీడ్ కటార్జినా కావాతో మాయ పోరు
- రేపటి నుంచి చెన్నై ఓపెన్ ఆరంభం

చెన్నై: డబ్ల్యూటీఏ–250 చెన్నై ఓపెన్ టెన్నిస్ టోర్నీలో భారత క్రీడాకారిణులకు తొలి రౌండ్‌లోనే పరీక్ష ఎదురుకానుంది. భారత నంబర్‌వన్, వైల్డ్‌కార్డ్ ఎంట్రీ వైష్ణవి అద్దర్.. బ్రిటన్‌కు చెందిన జోడీ బరేజ్‌తో తలపడనుంది. మరో భారత ప్లేయర్ సహజ యమలపల్లి.. స్విట్జర్లాండ్ క్రీడాకారిణి సిమోనా వాల్టర్‌తో పోటీ పడనుంది. శనివారం టోర్నీ డ్రాను ప్రకటించారు. నవంబరు 2 నుంచి 8 వరకు చెన్నైలోని ఎస్‌డీఏటీ టెన్నిస్ స్టేడియంలో ఈ పోటీలు జరగనున్నాయి. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 334వ స్థానంలో ఉన్న వైష్ణవి.. 471వ ర్యాంకర్ బరేజ్‌ను ఢీకొననుంది. గతంలో టాప్–100లో నిలిచిన అనుభవం బరేజ్ కు ఉంది. చెన్నైలో గతంలో జాతీయ స్థాయి టోర్నీలు ఆడిన అనుభవం తనకు కలిసొస్తుందని వైష్ణవి ఆశాభావం వ్యక్తం చేసింది. ఇక్కడి వాతావరణం, పరిస్థితులపై అవగాహన ఉందని, అధిక ఉష్ణోగ్రతల్లో ఆడటం సవాలుతో కూడుకున్నదని తెలిపింది. మెరుగైన ఆటతీరు కనబరచడంపైనే దృష్టి సారిస్తానని పేర్కొంది. ప్రపంచ 128వ ర్యాంకర్ సిమోనా వాల్టర్‌తో సహజ యమలపల్లి తలపడనుంది. 17 ఏళ్ల మరో భారత క్రీడాకారిణి మాయ రాజేశ్వరన్ రేవతికి కఠినమైన డ్రా ఎదురైంది. ప్రపంచ 106వ ర్యాంకర్, ఎనిమిదో సీడ్ పోలాండ్ ప్లేయర్ కటార్జినా కావాతో ఆమె ఆడనుంది.



ఏయూ బ్యాంకు సమాచార చోరీపై విచారణ

- మా నుంచి ఎలాంటి భద్రతా లేవు: సేల్స్‌ఫోర్స్
- ఖాతాదారుల వివరాల లీకేజీపై బ్యాంకు దర్యాప్తు

ముంబై: ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంకు ఖాతాదారుల సమాచార చోరీ వ్యవహారంలో తమ సాంకేతిక వేదికలో ఎలాంటి భద్రతా లోపాలు గుర్తించలేదని గ్లోబల్ సాంకేతిక సంస్థ సేల్స్‌ఫోర్స్ వెల్లడించింది. ప్రస్తుతం అందుబాటులో ఉన్న సమాచారం మేరకు తమ వేదికలో లోపాలేవీ కనిపించలేదని, విచారణకు అవసరమైన సహకారం అందిస్తామని తెలిపింది. మరోవైపు, తమ వాహన రుణ ఖాతాదారులకు సంబంధించిన పరిమిత సమాచారం లీకైనట్లు అనుమానిస్తూ బ్యాంకు దర్యాప్తు ప్రారంభించింది. అయితే సొంత వ్యవస్థలకు ఎలాంటి నష్టం జరగలేదని, సేవలు యథావిధిగా కొనసాగుతున్నాయని స్పష్టం చేసింది. స్కాట్లెట్‌గ్రూప్ అనే హ్యాకర్ల బృందం తమ భద్రతా వ్యవస్థను ఛేదించినట్లు ప్రకటించిందని సైబర్ ముప్పుల విశ్లేషణ సంస్థ హ్యాక్‌మనాక్ తెలిపింది. ఆధార్, పాన్, కేవైసీ పత్రాలు, రుణ దరఖాస్తులు, బ్యాంకు స్టేట్‌మెంట్లు, బీమా పత్రాలు, ఉద్యోగుల వివరాలు చోరీ చేసినట్లు హ్యాకర్లు పేర్కొన్నారని వెల్లడించింది. అయితే ఈ ఆరోపణలు ఇంకా ధ్రువీకరణ కాలేదని స్పష్టం చేసింది. ఇటీవల పలు బ్యాంకులపై సైబర్ దాడుల వార్తల నేపథ్యంలో.. సైబర్ దాడులతో భారత ఆర్థిక వ్యవస్థను దెబ్బతీసే ప్రయత్నాలు జరగవచ్చని ప్రధాని మోదీ అక్టోబర్ 25న హెచ్చరించారు.

చెన్నైలో బీపీ పరికరాల ఉత్పత్తి

- భారత్‌లో జపాన్ కంపెనీ ఓమ్రాన్ తొలి తయారీ కేంద్రం
- 2028 నాటికి పది రెట్లు లక్ష్యం

చెన్నై: జపాన్‌కు చెందిన వైద్య పరికరాల సంస్థ ఓమ్రాన్ హెల్త్‌కేర్ భారత్‌లో తన తొలి తయారీ కేంద్రాన్ని ప్రారంభించింది. చెన్నై సమీపంలోని ఈ ప్లాంట్‌లో రక్తపోటు కొలిచే పరికరాల ఉత్పత్తిని చేపట్టింది. దేశీయ తయారీని విస్తరించడంతో పాటు 'మేక్ ఇన్ ఇండియా'కు తోడ్పాటునందించడం లక్ష్యంగా ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. మహీంద్రా సంస్థకు చెందిన ఆరిజిన్స్ పారిశ్రామిక ప్రాంగణంలో 24 వేల చదరపు మీటర్ల విస్తీర్ణంలో దీన్ని నిర్మించారు. ఐదు ఉత్పత్తి శ్రేణుల ద్వారా బీపీ పరికరాలను తయారు చేస్తున్నారు. 2028 నాటికి ఉత్పత్తి సామర్థ్యాన్ని ప్రస్తుత స్థాయితో పోలిస్తే పది రెట్లు పెంచాలని సంస్థ నిర్ణయించింది.

40 కోట్లకు పైగా పరికరాల విక్రయం

1973లో బీపీ పరికరాల తయారీ ప్రారంభించిన ఓమ్రాన్ ఇప్పటివరకు 130 దేశాల్లో 40 కోట్లకు పైగా యంత్రాలను విక్రయించింది. 2010లో భారత్‌లో కార్యకలాపాలు మొదలుపెట్టిన సంస్థ.. 2024–25లో రూ.246 కోట్ల ఆదాయాన్ని నమోదు చేసింది. ప్రస్తుతం దేశంలో 210 మందికి ఉపాధి కల్పిస్తోంది. భారత రక్తపోటు అధ్యయన సంస్థతో కలిసి ఇంటివద్ద రక్తపోటు పరీక్షలకు సంబంధించిన మార్గదర్శకాల రూపకల్పనలోనూ భాగస్వామ్యమైంది. కొత్త కేంద్రంతో స్థానిక విడిభాగాల సేకరణ, నైపుణ్యాభివృద్ధి, ఉద్యోగ కల్పనకు ఊతం లభిస్తుందని సంస్థ అధ్యక్షుడు, సీఈవో అయుము ఒకాడా తెలిపారు.



లగ్జరీ కార్ల తయారీ సంస్థ ఆడి తన కొత్త తరం క్యూ3 ఎన్‌యూవీని కేరళ మార్కెట్లోకి విడుదల చేసింది. కొచ్చిలో ఆడి వాహనాల విక్రయ సంస్థ పీపీఎన్ మోటార్స్ నిర్వహించిన కార్యక్రమంలో ఈ కారును ఆవిష్కరించి, తొలి 10 వాహనాలను వినియోగదారులకు అందించింది. మహారాష్ట్రలోని ఛత్రపతి శంభాజీనగర్ ప్లాంట్‌లో అసెంబ్లింగ్ చేసిన ఈ కారు ప్రారంభ ధరను రూ.51.99 లక్షలుగా నిర్ణయించింది. ఇందులో 2.0 లీటర్ పెట్రోల్ ఇంజిన్ 150 కిలోవాట్ల శక్తి, 320 ఎన్‌ఎం టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. 7.1 సెకన్లలో గంటకు 100 కిలోమీటర్ల వేగాన్ని అందుకుంటుంది. క్వాట్రో ఆల్‌వీల్ డ్రైవ్, ఐదు డ్రైవింగ్ మోడ్‌లు ప్రత్యేకతలు.



లక్షకు మూడు లక్షలు

- ఐదేళ్లలో మూడింతలైన పసిడి బాండ్ల పెట్టుబడి
- 200 శాతానికిపైగా రాబడి
- అదనంగా ఏటా 2.5 శాతం వడ్డీ
- ముందస్తు ఉపసంహరణకు రేపు ఆర్‌బీఐ అవకాశం

న్యూఢిల్లీ: ఐదేళ్ల క్రితం పసిడి బాండ్లలో పెట్టుబడి పెట్టిన వారికి భారీ లాభాలు అందున్నాయి. నాడు రూ.లక్ష పెట్టుబడి పెట్టినవారి సొమ్ము ప్రస్తుతం దాదాపు రూ.3 లక్షలకు చేరింది. 2021–22 సిరీస్–7 సావరీన్ పసిడి బాండ్ల ముందస్తు ఉపసంహరణకు నవంబరు 2ను రిజర్వ్ బ్యాంక్ ప్రకటించింది. ఈ సందర్భంగా గ్రాము బంగారానికి రూ.14,167 చొప్పున చెల్లించనుంది. నాడు ఆఫ్‌లైన్‌లో గ్రాముకు రూ.4,765, ఆన్‌లైన్‌లో రూ.4,715 చొప్పున బాండ్లు కొనుగోలు చేసినవారికి వరుసగా 197 శాతం, 200 శాతానికిపైగా రాబడి లభించనుంది. దీనికి అదనంగా ప్రారంభ పెట్టుబడిపై ఏటా 2.5 శాతం వడ్డీ కూడా అందుతుంది. పసిడి బాండ్ల కాలపరిమితి ఎనిమిదేళ్లు. అయితే ఐదేళ్ల పూర్తయ్యాక ముందస్తుగా నగదు తీసుకోవచ్చు. ఉపసంహరణ ధరను నిర్ణయించేందుకు ముందటి వారంలోని చివరి మూడు పనిదినాల్లో భారత బులియన్, ఆభరణాల సంఘం ప్రకటించిన బంగారం సగటు ధరను పరిగణనలోకి తీసుకుంటారు. ఈ క్రమంలో అక్టోబరు 28, 29, 30 తేదీల ధరల ఆధారంగా గ్రాముకు రూ.14,167గా నిర్ణయించారు.

టాటా కదలికలపై సెబీ కన్ను

- టాటా సన్స్ వ్యవహారాలపైనా మార్కెట్ల నియంత్రణ సంస్థ నిశిత పరిశీలన
- చంద్రశేఖరన్ పునర్నియామకం, లిస్టింగ్ వివాదాల వేళ చైర్మన్ కీలక వ్యాఖ్యలు



కోల్‌కతా: టాటా గ్రూప్‌లో చోటుచేసుకుంటున్న పరిణామాలను నిశితంగా గమనిస్తున్నామని మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ చైర్మన్ తుహిన్ కాంత పాండే తెలిపారు. ముఖ్యంగా మాతృ సంస్థ టాటా సన్స్ పాలనాపరమైన అంశాలపై దృష్టి సారించామన్నారు. గ్రూప్‌లోని స్టాక్ మార్కెట్లో నమోదైన కంపెనీలు, వాటి ప్రమోటర్లు సెబీ వెల్లడింపు, ఇతర నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. టాటా సన్స్ ప్రస్తుతం స్టాక్ మార్కెట్లో నమోదుకాని సంస్థ కావడంతో దాని పాలనాపరమైన వ్యవహారాలు భిన్నంగా ఉంటాయని పాండే పేర్కొన్నారు. అయితే గ్రూప్‌లోని 26 నమోదిత కంపెనీలు లిస్టింగ్ నిబంధనలను పాటిస్తున్నాయని చెప్పారు. భారత్ ఛాంబర్ ఇన్వెస్టర్స్ ఫోరం ప్రారంభోత్సవంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. టాటా సన్స్ చైర్మన్‌గా చంద్రశేఖరన్ పునర్నియామకం, సంస్థను మార్కెట్లో నమోదు చేయాలా.. వద్దా అనే అంశాలపై గ్రూప్‌లో విభేదాల నేపథ్యంలో ఈ వ్యాఖ్యలకు ప్రాధాన్యం ఏర్పడింది. అయితే నిర్దిష్ట ఉల్లంఘనలు, చర్యల గురించి ప్రస్తావించలేదు.

ఏడు కంపెనీలకు 11.92 శాతం వాటా

2025 మార్చి 31 నాటికి టాటా గ్రూప్‌లోని 26 నమోదిత కంపెనీల ఉమ్మడి మార్కెట్ విలువ 328 బిలియన్ డాలర్లు. టాటా స్టీల్, టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికల్స్, టాటా కెమికల్స్, టాటా పవర్, ఇండియన్ హోటల్స్, టాటా కన్స్యూమర్ ప్రొడక్ట్స్, టాటా ఇన్వెస్ట్‌మెంట్ కార్పొరేషన్ సంస్థలకు టాటా సన్స్‌లో కలిపి 11.92 శాతం వాటా ఉంది. ఈ ఏడు కంపెనీలకు 1.77 కోట్లకు పైగా వాటాదారుల ఖాతాలున్నాయి. టాటా ట్రస్ట్స్‌కు టాటా సన్స్‌లో 66 శాతం, షాపూర్జీ పల్లోంజీ గ్రూప్‌నకు 18.4 శాతం వాటా ఉంది.



మారుతీ డిజైర్ అరుదైన మైలురాయి

- 18 ఏళ్ల 9 నెలల్లోనే 35 లక్షల యూనిట్లు తయారీ

న్యూఢిల్లీ: మారుతీ సుజుకీ ఇండియా ప్రముఖ సెడాన్ మోడల్ డిజైర్ ఉత్పత్తిలో సరికొత్త మైలురాయిని చేరుకుంది. ఇప్పటివరకు ఈ కారు 35 లక్షల యూనిట్లకు పైగా తయారైనట్లు సంస్థ శనివారం ప్రకటించింది. మార్కెట్లోకి వచ్చిన 18 ఏళ్ల 9 నెలల్లోనే ఈ ఘనత సాధించింది. ప్రస్తుతం హరియాణాలోని మనేసర్ తయారీ కేంద్రంలో డిజైర్ ఉత్పత్తి జరుగుతోంది. ఈ మైలురాయి తమ ప్రయాణంలో కీలక ఘట్టమని మారుతీ సుజుకీ ఎండీ, సీఈవో హిసాషి టకేయుచి తెలిపారు. ఉత్పత్తి సామర్థ్యాన్ని మరింత పెంచుతూ దేశీయ, అంతర్జాతీయ వినియోగదారులకు ప్రపంచస్థాయి నాణ్యతతో కూడిన వాహనాలను అందిస్తామని పేర్కొన్నారు. డిజైర్‌తో పాటు ఆల్టో, స్విఫ్ట్, వ్యాగన్‌ఆర్ మోడళ్లు కూడా 35 లక్షల యూనిట్ల ఉత్పత్తి మైలురాయిని దాటాయి. భారత్ ఎన్‌క్యాప్ భద్రతా పరీక్షల్లో 5 స్టార్ రేటింగ్ సాధించిన తొలి సెడాన్ డిజైర్ కావడం విశేషం.



సంజయ్ గుప్తా ఆకస్మిక మృతి.. బాలీవుడ్‌లో విషాదం

బాలీవుడ్ ప్రముఖ దర్శకుడు, నిర్మాత, కథా రచయిత సంజయ్ గుప్తా (57) ఆకస్మికంగా కన్నుమూశారు. క్రైమ్ డ్రామాలు, నగర జీవన నేపథ్యంలో సాగే ఉత్కంఠభరిత కథలు, శైలీబద్ధమైన యాక్షన్ చిత్రాలతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఆయన మరణవార్త హిందీ చిత్ర పరిశ్రమను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. ఆయన మృతిపట్ల పలువురు సినీ ప్రముఖులు సామాజిక మాధ్యమాల వేదికగా సంతాపం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా 'కాంటే' సినిమాతో సంజయ్



గుప్తా దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపును సంపాదించుకున్నారు. ఆయన దర్శకత్వం వహించి నిర్మించిన ఈ చిత్రంలో అమితాబ్ బచ్చన్, సంజయ్ దత్, సునీల్ శెట్టి వంటి ప్రముఖ నటులు కీలక పాత్రలు పోషించారు. దోపిడీ నేపథ్యంతో రూపొందిన ఈ ఉత్కంఠభరిత చిత్రం అప్పట్లో ప్రత్యేకమైన గుర్తింపును తెచ్చుకొని కల్ట్ సినిమాగా నిలిచింది. ముంబై అండర్‌వరల్డ్, ముఠా రాజకీయాలు, నేర ప్రపంచంలోని పరిణామాలను తెరపై ఆవిష్కరించడంలో ఆయన ప్రత్యేక శైలిని ఏర్పరచుకున్నారు. 1994లో విడుదలైన 'ఆతిష్' చిత్రంతో దర్శకుడిగా తన ప్రయాణాన్ని ప్రారంభించిన ఆయన, ఆ తర్వాత 'ముసాఫిర్', 'ఘూటౌట్ ఎట్ లోఖండ్‌వాలా', 'ఘూటౌట్ ఎట్ వడాలా' వంటి విజయవంతమైన చిత్రాలతో ప్రేక్షకులను అలరించారు. యాక్షన్ చిత్రాలకే పరిమితం కాకుండా విభిన్న కథాంశాలతోనూ తన ప్రతిభను చాటుకున్నారు. హృతిక్ రోషన్ కథానాయకుడిగా రూపొందిన 'కాబిల్' చిత్రానికి దర్శకత్వం వహించడంతో పాటు 'ముంబై సాగా' వంటి సినిమాలతోనూ ప్రేక్షకుల ముందుకు వచ్చారు. ఆయన చిత్రాల్లో కనిపించే వేగ వంతమై న కథనం, మాఫియా నేపథ్యం, బలమైన పాత్రలు ప్రత్యేక అభిమాన వర్గాన్ని సంపాదించాయి. సంజయ్ గుప్తా ఆకస్మిక మరణవార్త తెలియగానే బాలీవుడ్ ప్రముఖులు దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటున్నారు. అయితే ఆయన మరణానికి గల కారణాలను కుటుంబ సభ్యులు లేదా సంబంధిత వర్గాలు ఇంకా అధికారికంగా వెల్లడించలేదు. ఆయన మృతి హిందీ చిత్ర పరిశ్రమకు తీరని లోటుగా సినీ ప్రముఖులు పేర్కొంటున్నారు.

శూర్పణఖ పాత్ర నాకు ఎంతో ఆనందం

బాలీవుడ్ ప్రముఖ దర్శకుడు నితేష్ తివారీ అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్న పౌరాణిక చిత్రం 'రామాయణ'పై ప్రపంచవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రంలో శూర్పణఖ పాత్రలో రకుల్ ప్రీత్ సింగ్ నటిస్తోంది. తాజాగా లాస్ ఏంజెల్స్‌లో జరిగిన 'రామాయణ' ప్రీమియర్ సందర్భంగా ఆమె తన పాత్ర గురించి ఆసక్తికరమైన విషయాలను వెల్లడించింది. ఈ సినిమాలో నటించడానికి ప్రధానంగా రెండు కారణాలు ఉన్నాయని తెలిపింది. భారతదేశ చరిత్ర, సంస్కృతి, మన మూలాలను ప్రపంచ వేదికపై పరిచయం చేసే అవకాశం రావడం తనకు ఎంతో ఆనందాన్నిచ్చిందని పేర్కొంది. అంతేకాకుండా శూర్పణఖ పాత్రను ఇప్పటివరకు చాలామంది తప్పుగా అర్థం చేసుకున్నారని, కానీ వాస్తవానికి ఆ పాత్రలో ఎన్నో భావోద్వేగాలు, విభిన్న కోణాలు దాగి ఉన్నాయని వివరించింది. రామాయణంలో యుద్ధానికి దారితీసిన కీలక పరిణామాల వెనుక శూర్పణఖ పాత్ర కూడా ఉందని, అలాంటి బహుముఖ కోణాలున్న పాత్రను పోషించడం నటిగా తనకు ఎంతో ఆసక్తికరంగా అనిపించిందని రకుల్ తెలిపింది. ఈ చిత్రంలో శ్రీరాముడిగా రణ్‌బీర్ కపూర్, సీతగా సాయిపల్లవి, రావణాసురుడిగా యశ్, హనుమంతుడిగా సన్నీ డియోల్ తదితర ప్రముఖ నటీనటులు కనిపించనున్నారు. ఆస్కార్ విజేత ఎ.ఆర్. రెహమాన్ సంగీతం అందిస్తున్న ఈ భారీ చిత్రాన్ని రెండు భాగాలుగా రూపొందిస్తున్నారు. ఇందులో మొదటి భాగం నవంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది.



క్రిస్మస్ కానుకగా అతిమనోహరం

మలయాళ అగ్ర కథానాయకుడు మోహన్‌లాల్ నటిస్తున్న తాజా చిత్రం 'అతిమనోహరం'. తరుణ్ మూర్తి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో ఆయన 'లవ్ లాజన్' అనే శక్తిమంతమైన పోలీసు అధికారి పాత్రలో కనిపించనున్నారు. సుదీర్ఘ విరామం తర్వాత మోహన్‌లాల్ మరోసారి ఖాకీ దుస్తుల్లో పోలీసు అధికారిగా ప్రేక్షకులను అలరించనుండటంతో అభిమానుల్లో ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. నేర పరిశోధన నేపథ్యంలో ఉత్కంఠభరితంగా తెరకెక్కిన ఈ చిత్రం ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకొని విడుదలకు సిద్ధమవు తోంది. క్రిస్మస్ కానుకగా డిసెంబర్ 24న థియేటర్లలో విడుదల చేయాలని చిత్రబృందం నిర్ణయించింది. ఈ క్రమంలో తాజాగా సినిమా సంగీత ప్రచారాన్ని ప్రారంభించారు. ఇందులో భాగంగా మొదటి పాట విడుదల తేదీని ప్రకటిస్తూ ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేశారు. కేరళ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని నవంబర్ 1న ఉదయం 10 గంటలకు తొలి గీతాన్ని విడుదల చేయనున్నట్లు వెల్లడించారు.

బాలయ్య 112.. సంగీత దర్శకుడిపై ఇంకా నిర్ణయం తీసుకోలేదు

నందమూరి నటసింహం బాలకృష్ణ, మాస్ చిత్రాల దర్శకుడు కొరటాల శివ కలయికలో ఓ భారీ ప్రాజెక్టు తెరకెక్కనున్న విషయం తెలిసిందే. 'ఎన్‌బీకే–112' అనే వర్కింగ్ టైటిల్‌తో రూపొందనున్న ఈ సినిమాకు సంబంధించిన పూజా కార్యక్రమాలు ఇప్పటికే ఘనంగా పూర్తయ్యాయి. ఎస్‌ఎల్‌వీ సినిమాస్ పతాకంపై నిర్మాత సుధాకర్ చెరుకూరి ఈ చిత్రాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. చిత్రీకరణ ఇంకా ప్రారంభం కాకముందే ఈ ప్రాజెక్టుకు సంబంధించి అనేక వార్తలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్నాయి. ముఖ్యంగా ఈ సినిమాకు తమిళ సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్ సంగీతం అందించనున్నారని తొలుత ప్రచారం జరిగింది. అయితే ఆయన ఇతర సినిమాలతో బిజీగా ఉండటంతో ఈ ప్రాజెక్టు నుంచి తప్పుకున్నారని, ఆయన స్థానంలో యువ సంగీత దర్శకుడు జీవీ ప్రకాశ్ కుమార్‌ను ఎంపిక చేశారని వార్తలు వెలువడ్డాయి. దీంతో బాలకృష్ణ అభిమానుల్లో గందరగోళం నెలకొంది. ఈ ప్రచారంపై తాజాగా కొరటాల శివ బృందం స్పందించి స్పష్టత ఇచ్చింది. 'ఎన్‌బీకే–112'కు సంబంధించి సామాజిక మాధ్యమాల్లో వస్తున్న వుకార్లను నమ్మవద్దని



అభిమానులు, ప్రేక్షకులకు సూచించింది. ఈ చిత్రానికి సంగీత దర్శకుడిని ఎంపిక చేసే ప్రక్రియ ఇంకా కొనసాగుతోందని, ఇప్పటివరకు ఎవరినీ అధికారికంగా ఖరారు చేయలేదని స్పష్టం చేసింది. త్వరలోనే సంగీత దర్శకుడి పేరును అధికారికంగా ప్రకటిస్తామని వెల్లడించింది. దీంతో అనిరుధ్, జీవీ ప్రకాశ్ పేర్లతో సాగుతున్న ప్రచారానికి ప్రస్తుతానికి తెరపడింది. బాలకృష్ణ, కొరటాల శివ కలయికలో రాబోతున్న ఈ సినిమాకు సంబంధించిన ఇతర నటీనటులు, సాంకేతిక బృందం వివరాల కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



టబు చేతిలో గన్.. విజయ్ సేతుపతిపై గురి

వరుస పరాజయాల తర్వాత డైనమిక్ డైరెక్టర్ పూరి జగన్నాథ్ తెరకెక్కిస్తున్న హై ఓల్టేజ్ యాక్షన్ చిత్రం 'స్లమ్‌డాగ్–33 టెంపుల్ రోడ్'. కోలీవుడ్ స్టార్ విజయ్ సేతుపతి కథానాయకుడిగా నటిస్తున్న ఈ పాన్ ఇండియా చిత్రాన్ని పూరి కనెక్ట్స్ పతాకంపై పూరి జగన్నాథ్, ఛార్మీ కౌర్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఇందులో టబు, జరీనా వహాబ్, సంయుక్త మీనన్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. రమేష్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ సినిమా ప్రస్తుతం నిర్మాణానంతర పనులు జరుపుకుం టోంది. మరోవైపు ప్రచార కార్యక్రమాల ద్వారా సినిమాపై ఆసక్తిని పెంచేందుకు మేకర్స్ ప్రయత్నిస్తున్నారు. ఇందులో భాగంగా ఇటీవల సీనియర్ నటి టబుకు సంబంధించిన ప్రత్యేక గ్లింప్స్‌ను విడుదల చేయగా ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభించింది. తాజాగా మరో ఆసక్తికరమైన ఫొటోను చిత్రబృందం సామాజిక మాధ్యమాల్లో పంచుకుంది. ఈ చిత్రంలో విజయ్ సేతుపతికి అత్యంత సమీపంగా తుపాకీ గురిపెట్టి టబు కనిపిస్తున్న తీరు సినిమాపై మరింత ఉత్కంఠను పెంచుతోంది.

రెండు భాగాలుగా శివాజీ మహారాజ్ చరిత్ర



'కాంతార' చిత్రంతో దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న కన్నడ నటుడు, దర్శకుడు రిషబ్ శెట్టి మరో భారీ చారిత్రక చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ప్రముఖ నిర్మాత సందీప్ సింగ్‌తో కలిసి ఆయన రూపొందించనున్న ఈ చిత్రానికి 'ఛత్రపతి శివాజీ మహారాజ్' అనే పేరు ఖరారు చేశారు. భారత చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిన ఛత్రపతి శివాజీ మహారాజ్ జీవిత విశేషాలను రెండు భాగాలుగా తెరకెక్కించేందుకు చిత్రబృందం సిద్ధమైంది. ఇప్పటికే విడుదలైన తొలి రూపం పోస్టర్ సినిమాపై భారీ అంచనాలను పెంచింది. తాజాగా ఈ ప్రాజెక్టుకు సంబంధించిన చిత్రీకరణ వివరాలను వెల్లడిస్తూ రిషబ్ శెట్టి భావోద్వేగభరితమైన సందేశాన్ని పంచుకున్నారు. స్వరాజ్యం అనేది కేవలం ఒక కల మాత్రమే కాదని, భారతదేశ చరిత్రను మలుపు తిప్పిన గొప్ప దృక్పథమని ఆయన స్పష్టం చేశారు. ధైర్యం, త్యాగం, పోరాట పటిమ, స్వరాజ్య సాధన పట్ల అచంచలమైన నిబద్ధతతో కూడిన శివాజీ మహారాజ్ జీవితం తరతరాలకు స్ఫూర్తినిస్తూనే ఉంటుందని రిషబ్ శెట్టి పేర్కొన్నా రు. చివరగా 'జై భవాని.. జై శివాజీ' అంటూ తన సందే శాన్ని ముగించారు. పేర్కొన్నారు. ఛత్రపతి శివాజీ మహారాజ్ అసాధారణ వారసత్వానికి అంకితమిస్తూ రూపొందిస్తున్న ఇంతటి గొప్ప చిత్రంలో భాగం కావడం తనకు గర్వకా రణమని తెలిపారు. టీ–సిరీస్ నిర్మాత సందీప్ సింగ్‌తో కలిసి శివాజీ మహారాజ్ జీవితాన్ని భారీ చారిత్రక ఇతిహాసంగా రెండు భాగాల్లో ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తు న్నట్లు వెల్లడించారు. ఈ ప్రతిష్టాత్మక చిత్రీకరణ 2027 ప్రారంభం లో మొదలు కానుందని

100మంది జానపద కళాకారులతో ఎల్లమ్మ పాట



రాక్‌స్టార్ దేవిశ్రీ ప్రసాద్ నటుడిగా పరిచయం కాబోతున్న చిత్రం 'ఎల్లమ్మ'. 'బలగం' సినిమాతో దర్శకుడిగా విశేష గుర్తింపు తెచ్చుకున్న వేణు యెల్దండి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ఆయన రూపొందిస్తున్న రెండో సినిమాపై ఇప్పటికే ఆసక్తి నెలకొనగా, తాజాగా విడుదలైన ఓ సంగీతపరమైన అప్‌డేట్ అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ఈ సినిమా టైటిల్ పాటను దేశంలోని విభిన్న ప్రాంతాలకు చెందిన వందమంది జానపద లయ కళాకారులతో కలిసి దేవిశ్రీ ప్రసాద్ రికార్డు చేశారు. భారతీయ జానపద సంగీతంలోని వైవిధ్యాన్ని ప్రతిబింబించేలా ఈ పాటను ప్రత్యేకంగా రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. వివిధ సంస్కృతులు, సంప్రదాయాలకు చెందిన కళాకారులంతా ఒకే వేదికపై కలిసి పాటకు లయ అందించడం ఈ చిత్రానికి ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. ఈ విశేషాన్ని తెలియజేస్తూ చిత్రబృందం రికార్డింగ్ సమయంలో తీసిన ఫొటోలను సామాజిక మాధ్యమాల్లో పంచుకుంది. ప్రస్తుతం ఈ చిత్రాలు వైరల్‌గా మారి అభిమానుల్లో ఆసక్తిని పెంచుతున్నాయి. ఇటీవల దేవిశ్రీ ప్రసాద్‌ను 'పర్ష' పాత్రలో పరిచయం చేస్తూ విడుదల చేసిన తొలి రూపం పోస్టర్‌కు కూడా మంచి స్పందన వచ్చింది. దిల్‌రాజు, శిరీష్ ఈ చిత్రాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. తెలుగు, తమిళం, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో పాన్ ఇండియా స్థాయిలో రూపొందుతున్న ఈ సినిమా 2027 మార్చి 5న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. సంగీత దర్శకుడిగా ఎన్నో విజయాలు అందుకున్న దేవిశ్రీ ప్రసాద్ నటుడిగా ఎలా మెప్పిస్తారోనన్న ఆసక్తి ప్రేక్షకుల్లో నెలకొంది.

విఠాబాయి జీవితకథలో శ్రద్ధా కపూర్

బాలీవుడ్ కథానాయిక శ్రద్ధా కపూర్ ప్రధాన పాత్రలో నటిస్తున్న ప్రతిష్టాత్మక చిత్రం 'ఈత'. మహారాష్ట్రకు చెందిన ప్రముఖ తమాషా, లావణి జానపద నృత్య కళాకారిణి విఠాబాయి నారాయణగావ్‌కర్ జీవితం ఆధారంగా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. 1940ల నుంచి 1990ల వరకు ఆమె ఎదుర్కొన్న కష్టాలు, అవమానాలు, పోరాటాలు, కళారంగంలో సాధించిన విజయాలను ఈ సినిమాలో ఆవిష్కరించనున్నారు. లక్ష్మణ్ ఉటేకర్ దర్శకత్వం వహిస్తున్న ఈ సంగీత ప్రధాన జీవిత చరిత్ర చిత్రాన్ని 'స్త్రీ', 'స్త్రీ 2' వంటి విజయవంతమైన చిత్రాలను నిర్మించిన దినేష్ విజన్ తెరకెక్కిస్తున్నారు. రణదీప్ హుడా, నానా పటేకర్, సిద్ధార్థ్ జాదవ్, మహ్మద్ జీషన్ అయ్యూబ్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. డిసెంబర్ 4న ఈ చిత్రం థియేటర్లలో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న శ్రద్ధా కపూర్ సినిమా ఎంపిక, కథలపై తన అభిప్రాయాలను వెల్లడించారు. తాను ఎప్పుడూ మంచి కథల కోసమే ఎదురుచూస్తుంటానని, అందుకే ఒక్కోసారి రెండేళ్లకు ఒక సినిమా మాత్రమే చేస్తున్నానని తెలిపారు. చిత్రాల సంఖ్య కంటే కథలోని బలం, పాత్రలోని ప్రత్యేకత తనకు ముఖ్యమని స్పష్టం చేశారు. బాక్సాఫీస్ రికార్డులు, వసూళ్ల గురించి తాను పెద్దగా ఆలోచించనని, ప్రేక్షకులకు మంచి అనుభూతిని అందించే సినిమా చేయడమే తన లక్ష్యమని పేర్కొన్నారు. అలాగే సినిమాలను స్త్రీ, పురుషుల కోణంలో విభజించి చూడటం సరైన విధానం కాదని, చిత్ర పరిశ్రమకు కావాల్సింది మంచి కథలు మాత్రమేనని అభిప్రాయపడ్డారు. ఒక సినిమా విజయం ఎవరి చేతుల్లోనూ ఉండదని, అది అనుకోకుండా ప్రేక్షకుల ఆదరణతో సాధ్యమవుతుందని అన్నారు. 'ఈత' వంటి విభిన్నమైన, ప్రతిష్టాత్మక చిత్రంలో భాగం కావడం తనకు ఎంతో గర్వంగా ఉందని భావోద్వేగానికి లోనయ్యారు. ఆమె వ్యాఖ్యలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో చర్చనీయాంశంగా మారాయి.



Published And Owned By Adula Thirupathi, And Printed By Bommakanti Vinod Kumar, At Vangs Global Technologies Llp, #1-5-431/20/4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri, Telangana - 500010. And Published From D. No.: 8-3-228/157/A/1a, Rehmath Nagar, Jawahar Nagar, Yousufguda, Hyderabad, Telangana - 500045. **Editor: Adula Thirupathi. PRGI Regd No: TGTEL/26/A6187**, Email: Prajanaava@Gmail.Com. Phone No: 99484 33277.